అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 2-03-2023

సంపుటి : 9 | సంచిక : 12 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

మేథోసంపత్తిలో అట్టడుగున భారత్

- 55 దేశాల్లో 42వ ర్యాంక్
- ఐపీ హక్కుల పరిరక్షణ మెరుగుపడాలి : నివేదిక

న్యూఢిల్లీ : మేథో సంపత్తి (ఐపీ) హక్కుల సూచికలో భారత్ చాలా వెనుకపడింది. 2023 ఏడాదికి సంబంధించి మొత్తం 55 దేశాలకు ర్యాంకులు విడుదల చేయగా, భారత్‌కు 42వ స్థానం దక్కింది. భారత్ సహా అనేక దేశాల్లో మేథో సంపత్తి హక్కులకు సవాళ్లు నెలకొన్నాయని తాజా నివేదిక పేర్కొంది. అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతిఏటా ఈ నివేదికను విడుదల చేస్తోంది. ఈ ఏడాది 55 దేశాలకు ర్యాంకులు విడుదల చేయగా, భారత్ ...9లో



ఘోర ప్రమాదం

- రెండు రైళ్లు ఢీకొని 32 మంది సజీవదహనం
- గ్రీస్‌లో ఘటన

తెంపీ : ఎదురెదురుగా వచ్చిన రెండు రైళ్లు ఢీకొని 32 మంది సజీవదహనమైన ఘోర ఘటన మంగళవారం అర్ధరాత్రి గ్రీస్‌లో జరిగింది. ఈ ప్రమాదంలో మరో 85 మందికి పైగా గాయపడ్డారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఏథెన్స్ నుంచి థెసాలోనికి వెళుతున్న ఓ ప్రయాణికుల రైలు.. తెంపీ సమీపంలో ఎదురుగా వస్తున్న కార్గో రైలును బలంగా ఢీకొట్టింది. దీంతో ప్రయాణికుల రైలుకు చెందిన తొలి మూడు బోగీల్లో ...9లో

ఎన్నికల కౌంటింగ్ నేడే

- త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ ఫలితాలపై సర్వత్రా ఆసక్తి

న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రాల్లో అత్యంత కీలకమైన త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు రాబోతున్నాయి. మూడు రాష్ట్రాల్లో మొత్తం 178 స్థానాలకు జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల కౌంటింగ్ నేడు ఉదయం 8 గంటలకే ప్రారంభం కానున్నది. త్రిపుర-60, మేఘాలయ-59, నాగాలాండ్-59 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 16 నుంచి 27 మధ్య పోలింగ్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ గురువారం ఉదయం 8గంటలకు ...9లో



గిరిజనుల ద్రోహి మోడీ



రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర

- బుల్డోజర్ రాజకీయాలను అడ్డుకుంటాం
- మోడీ పతనానికి మిర్యాలగూడ నుంచే శ్రీకారం
- కార్పొరేట్ల చేతిలోనే దేశ సంపద
- ఇచ్చిన హామీలను కేసీఆర్ అమలు చేయాలి : గిరిజన సంఘం బహిరంగ సభలో ఆదివాసీ అధికార్ మంచ్ జాతీయ నాయకులు బృందాకరత్
- రాష్ట్ర మహాసభ సందర్భంగా వేలాది మందితో భారీ ర్యాలీ



గిరిజనుల ద్రోహిగా మోడీ నిలిచారని, గిరిజన రిజర్వేషన్లు ఎత్తేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆదివాసీ అధికార్ మంచ్ జాతీయ నాయకులు, మాజీ ఎంపీ బృందాకరత్ విమర్శించారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభ సందర్భంగా మొదటి రోజు బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని హనుమానుపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ఎన్నెస్పీ క్యాంపు మైదానం వరకు మహాప్రదర్శన నిర్వహించారు. గిరిజనులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో బృందాకరత్ మాట్లాడారు.

నవతెలంగాణ-మిర్యాలగూడ

రాజ్యాంగం కల్పించిన ఎస్టీ రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే గిరిజన సంక్షేమానికి కేంద్ర బడ్జెట్లో కోత విధించారని అన్నారు. దేశవ్యాప్తంగా గిరిజన మహిళలు పౌష్టికాహార లోపంతో అనారోగ్యానికి గురవుతుంటే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆదివాసీ గిరిజనుల జనాభా ప్రకారం కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించలేదని విమర్శించారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ తీసేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దేశ జనాభాలో 8.6% ఉన్న గిరిజనులకు 2.7శాతం మాత్రమే నిధులు ఇచ్చారని, ఇది గిరిజనుల పొట్ట కొట్టడమేనని చెప్పారు. ఉపాధి హామీ చట్టంలో కూలీలకు 200 రోజులు పని కల్పించాల్సి ఉండగా.. వంద రోజులే కల్పించి.. ఆ పనికి కూడా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. దేశవ్యాప్తంగా మోడీ బుల్డోజర్ రాజకీయం చేస్తున్నారని, దానిని అడ్డుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్మిక, కర్షకులు శ్రమించి కూడబెట్టిన దేశ సంపదను జనాభాలో ఒక్క శాతం ఉన్న కార్పొరేట్ వారికి దోచిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ధనికులు, పేదల మధ్య తీవ్ర వ్యత్యాసం పెరిగిందన్నారు. కష్టపడుతున్న కార్మిక, కర్షకులను మోడీ ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మోడీ ధరలను రెట్టింపు చేశారన్నారు. దాని ఫలితంగా సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో పేదలకు ఉచితంగా అందించాల్సిన ఆహార పదార్థాలను ఇవ్వకుండా ...10లో

బండ బాదుడు..

వంట గ్యాస్‌పై రూ.50, కమర్షియల్ సిలిండర్‌పై రూ.350 పెంచిన కేంద్రం

- ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే వడ్డన
- ప్రజలకు మోడీ సర్కార్ హోలీ కానుక: ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ : సామాన్యులపై మళ్లీ పెను భారం పడింది. ఇటీవలి కాలంలో కాస్త విరామం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం తిరిగి బాదుడు మొదలుపెట్టింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగియగానే వంటగ్యాస్ ధరను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నిత్యావసరాల ధరలన్నీ మండిపోతుంటే.. ఇక ఇప్పుడు గ్యాస్ సిలిండర్‌పైనా వడ్డన మొదలైంది. వాణిజ్య వినియోగానికి ఉపయోగించే సిలిండర్‌తో పాటు గృహ వినియోగానికి ఉపయోగించే సిలిండర్‌పైనా వడ్డించింది. పెరిగిన ధరలు బుధవారం నుంచే అమల్లోకి రానున్నాయి. వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 50 మేర పెరగ్గా.. కమర్షియల్ సిలిండర్‌పై రూ.350.50 మేర పెరిగింది. కమర్షియల్ సిలిందర్‌పై పెరిగిన రేట్లు కూడా మార్చి 1వ తేదీనే అమల్లోకి వస్తున్నట్టు ప్రభుత్వ యాజమాన్యంలోని పెట్రోలియం సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ప్రకటించాయి. మంగళవారం వరకూ అంటే ఫిబ్రవరి 28 వరకూ హైదరాబాద్‌లో గృహ వినియోగానికి వాడే 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.1,105 ఉండగా.. పెరిగిన ధరతో రూ.1,155కు చేరుకుంది. ఇక కమర్షియల్ సిలిండర్ విషయానికి వస్తే.. మంగళవారం వరకూ 19 కిలోల సిలిండర్ ధర రూ.1,769 ఉండగా.. బుధవారం నుంచి దీనిపై రూ.350.50 పెరిగింది. పెరిగిన ధరతో ప్రస్తుతం వాణిజ్య సిలిండర్ రేటు రూ.2,119.50కి చేరింది. ఢిల్లీలో ...9లో

ఉపసంహరించుకోవాలి : సీపీఐ(ఎం)

వంట గ్యాస్ ధర పెంపు ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో ప్రకటన విడుదల చేసింది. "దేశీయ ఎల్‌పీజీ సిలిండర్ ధరను మరో రూ.50 పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అన్ని ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతుంటే... ఇప్పటికే సతమతమవుతున్న సామాన్యులపై ఈ పెంపు మరింత భారంగా మారుతుంది' అని ...9లో

సామాన్యులపై మోయలేని భారం

- బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్ 9లో..

సీపీఆర్ శిక్షణా కార్యక్రమం

ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు

- కార్డియాక్ అరెస్ట్‌తో రాష్ట్రంలో ఏడాదికి 24 వేల మంది మరణం
- సీపీఆర్ తెలిసిన వారు పక్కన లేకనే కేటీఆర్ మామ మరణం
- అప్పుడే రాష్ట్రవ్యాప్తంగా శిక్షణనివ్వాలని నిర్ణయం : మంత్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆకస్మికంగా వచ్చే కార్డియాక్ అరెస్ట్‌తో రాష్ట్రంలో ఏడాదికి 24 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం మేడ్చల్‌లోని జీవీకే, ఈఎంఆర్ఐలో మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ తన సహచర మంత్రి కేటీఆర్ మామ దగ్గరలో సీపీఆర్ తెలిసిన వారు లేకపోవడంతోనే ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. అప్పుడే రాష్ట్రవ్యాప్తంగా ...2లో

సాగుకు పుష్కలంగా నీరు

నిజాంసాగర్‌కు గోదావరి నీరు కాళేశ్వరం ఘనత

- బాన్సువాడ అభివృద్ధికి రూ.50 కోట్లు : ముఖ్యమంత్రి కేసీఆర్



నవతెలంగాణ-నసురుల్లాబాద్

గోదావరి నీరు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి రావడంతో ప్రాజెక్టు ఎప్పటికీ ఎండకుండా రైతులకు సాగునీరు అందిస్తుందని సీఎం కేసీఆర్ చెప్పారు. పంటలకు పుష్కలంగా నీరందిస్తూ నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు సస్యశ్యామలంగా కనిపిస్తుందన్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శ్రీలక్ష్మి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన కల్యాణోత్సవంలో సీఎం కేసీఆర్ దంపతులు పాల్గొన్నారు. సందర్శకులు సమర్పించిన రెండు కిలోల బంగారంతో చేయించిన కిరీటాన్ని ఆలయ ధర్మకర్త, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్వామివారికి సమర్పించారు. అనంతరం నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం మాట్లాడారు.

సమైఖ్య రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాగునీటి కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఆనాడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి నిజామాబాదులో నీటి కోసం ధర్నా చేశారు. నేడు ఎలాంటి ఇబ్బందీ లేకుండానే పంటలకు సాగునీరు వస్తుందని' అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నిసార్లు ...9లో

సర్పంచ్‌లపై విరిగిన లాఠీలు

హర్యానాలో బీజేపీ సర్కార్ నిర్వాకం
ఈ-టెండరింగ్‌కు వ్యతిరేకంగా భారీ నిరసన

- బారికేడ్లు, జలఫిరంగులతో అడ్డగింత..
- పలువురికి గాయాలు



పంచకుల: హర్యానాలోని బీజేపీ సర్కార్ కు వ్యతిరేకంగా సర్పంచ్‌లు కదం తొక్కారు. ఈ-టెండరింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ.. బుధవారం తమ నిరసన తెలియజేయటానికి చండీగఢ్ వెళ్తున్న సర్పంచ్‌లను పంచకులలో పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లను ఏర్పాటు చేశారు. భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. సర్పంచ్‌లు బారికేడ్లను తోసుకుంటూ ముందుకెళ్లటానికి ప్రయత్నించగా...ఆందోళనకారులపై లాఠీలతో పోలీసులు విరుచుకుపడ్డారు.అప్పటికి నియంత్రించలేకపోయిన బలగాలు జలఫిరంగులు ప్రయోగించింది. దీంతో పలువురు సర్పంచ్‌లకు గాయాలయ్యాయి.

ఎందుకీ రగడ...?

హర్యానా ప్రభుత్వం ఈ ఏడాది రూ.2 లక్షల కంటే ఎక్కువ విలువైన పనులకు ఈ-టెండరింగ్‌ను తప్పనిసరి చేసింది. దీంతో సర్పంచ్‌లందరూ ప్రభుత్వంపై మండిపడుతున్నారు. గతంలో 20 లక్షల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. పూర్తిగా టెండర్లు వేసుకునే అధికారం సర్పంచ్ లకే ఉండేది.

.ఇప్పుడు ఖట్టర్ సర్కార్ ఇచ్చిన తాజా మార్గదర్శకాలతో... కనీసం వీధి-డ్రెయిన్‌ను కూడా శుభ్రపర్చలేకపోతున్నామని సర్పంచులు అంటున్నారు. సీఎం ఖట్టర్ ఇంటిని ముట్టడించటానికి బయలుదేరిన సర్పంచులపై పోలీసులు వీరంగం సృష్టించారు. గాయాలపాలైన సర్పంచులను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం హర్యానాలో బీజేపీకి నిరసన సెగలు తాకుతున్నాయి.

రాకుల్‌లో ఎగిరిన ఎర్రజెండా

కార్మికులంతా సీఐటీయూ వెంటే..

- ఓటింగ్‌కు దూరంగా హెచ్‌ఎంఎస్, బీఎంఎస్
- ఏకగ్రీవంగా గెలిచిన సీఐటీయూ



నవతెలంగాణ-కోహిర్

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల పరిధిలో గల కవేలి సమీపంలోని రాకుల్ పరిశ్రమలో బుధవారం జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ జయకేతనం ఎగురవేసింది. కార్మికులందరూ సీఐటీయూ పక్కన నిలవడంతో మిగిలిన హెచ్‌ఎంఎస్, బీఎంఎస్‌లు ఎన్నికల పోటీ నుంచి తప్పుకున్నాయి. దాంతో సీఐటీయూ ఏకగ్రీవంగా ...9లో

అంతా అదానీ కోసమే

తప్పని తెలిసినా బొగ్గు తవ్వకాలకు అనుమతులు

- 2014లో బొగ్గు బ్లాక్‌ల కేటాయింపులను రద్దు చేసిన సుప్రీంకోర్టు
- ఆ తర్వాత ప్రత్యేక నిబంధనతో అదానీ గ్రూపునకు మినహాయింపు
- 450 మిలియన్ టన్నుల మైనింగ్‌కు లైన్ క్లియర్
- ఇప్పటి వరకు 80 మిలియన్ టన్నులు వెలికితీత
- మోడీ-అదానీ బంధంపై 'అల్‌జజీరా' ప్రత్యేక కథనం

భారత్‌లో వివాదాస్పద బడా వ్యాపారవేత్త అదానీకి సంబంధించిన అవకతవకలపై పలు విషయాలు బయటపడుతున్నాయి. హిండెన్‌బర్గ్ నివేదిక నుంచి ఇప్పటి వరకు.. రోజుకో వార్తా సంస్థ తమ ప్రత్యేక కథనాలతో ముందుకొస్తున్నాయి. దేశంలో అదానీ బొగ్గు వ్యాపార సామ్రాజ్యం విస్తృతం కావడానికి మోడీ సర్కారు చేసిన సాయంపై 'అల్‌జజీర' వార్త సంస్థ తాజాగా ఒక కథనాన్ని ప్రచురించింది. ఇందులో దోస్తు అదానీ కోసం ప్రధాని మోడీ చేసిన అసాధారణ సహాయాన్ని వివరించింది.



న్యూఢిల్లీ : మోడీ సర్కారు అండదండలతో అదానీ వ్యాపారం అంతర్జాతీయంగా విస్తరించింది. ప్రభుత్వ పోర్టులు, విమానాశ్రయాలు మొదలుకొని బొగ్గు గనుల తవ్వకాల వరకు అదానీ గ్రూపు గుత్తాధిపత్యాన్ని సాధించింది. ముఖ్యంగా, దేశంలో బొగ్గు గనుల తవ్వకాలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పునూ కాదని మోడీ సర్కారు ప్రత్యేక నిబంధనలతో అదానీ గ్రూపునకు అసాధారణ ...2లో

నవతెలంగాణ

దాడులు చేసే సంస్కృతి మంచిదికాదు

- బీఆర్ఎస్‌కు సీఎల్పీ నేత భట్టి హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

దాడులు చేసే సంస్కృతి మంచిదికాదని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. భూపాలపల్లిలో రేవంత్‌రెడ్డి బహిరంగసభపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. పోలీసుల సమక్షంలోనే దాడి జరగడం శోచనీయమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి జరగడం శోచనీయమని పేర్కొన్నారు. అధికార పార్టీకి పోలీసులు కార్యకర్తలుగా పని చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఎవరికి అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని పోలీసులు గ్రహించాలని హెచ్చరించారు. పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించడం సమాజానికి మంచిది అని సూచించారు. ప్రజాస్వామ్యంలో భౌతికదాడులు చేయడం, సభలను అడ్డుకోవడం చట్టవ్యతిరేకమైన చర్య అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అని పేర్కొన్నారు. దాడులు చేస్తే ప్రతిఘటన తప్పదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీకి అధికార పార్టీ చేసిన ప్రజావ్యతిరేక విధానాలపై మాట్లాడే హక్కు ఉందని తెలిపారు. బీఆర్ఎస్ ఇతర రాష్ట్రాల్లో సమావేశం పెడితే ఇలాగే కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేస్తే కేసీఆర్ ఒప్పుకుంటారా? అని మాజీ ఎంపీ వి హనుమంతరావు ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యాలయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే



నవతెలంగాణ–కోదాడరూరల్

రానున్న ఎన్నికల అనంతరం సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, ఏఐసీసీ కార్యదర్శి మాణిక్‌రావు ఠాక్రే అన్నారు. హాత్ సే హాత్ జోడో, ఇంటింటికీ కాంగ్రెస్, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కార్యక్రమంలో భాగంగా బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ కంఫర్ట్‌హాల్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వంపై, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే రాహుల్‌గాంధీ పాదయాత్ర చేపట్టారన్నారు. దేశ సమగ్రతకు సమైక్యతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పారు. ధరలను పెంచి సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను తగ్గిస్తున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతోపాటు దేశ సమగ్రతను కాపాడాలని రాహుల్‌గాంధీ ఇచ్చిన సందేశాన్ని హాత్‌సే హాత్ జోడో ఇంటికి ఇంటికీ కాంగ్రెస్, గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంతో ప్రజలకు చేర్చాలని సూచించారు. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో ఠాక్రే బేటీ అయి దిశానిర్దేశం చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అని పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఠాక్రే పర్యటన ఉంటుందన్నారు. పట్టణంలో గడపగడపకు ఠాక్రే పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. మాజీ మంత్రులు జానారెడ్డి, దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి బోసురాజు తదితరులు గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంపై పలు అంశాలను సమగ్రంగా వివరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పద్మావతి, నిరంజన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రోహిత్‌చౌదరి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు పాల్గొన్నారు.

దరఖాస్తు తేదీ నాటి మార్కెట్ ధర ప్రకారం లెక్కింపు

- పెరగనున్న క్రమబద్ధీకరణ రుసుం

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని జీవో 59 కింద క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారిపై మరింత భారం పడనుంది. క్రమబద్ధీకరణకు అయ్యే మొత్తాన్ని దరఖాస్తు తేదీ నాటి మార్కెట్ ధర ప్రకారం దరఖాస్తుదారులు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఈమేరకు జీవో 59కి సవరణ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ బుధవారం జీవో 22 జారీ చేశారు. 2014 డిసెంబరు 30న ఇచ్చిన జీవో 59లో 2014 జూన్ 2వ తేదీ నాడు ఉన్న మార్కెట్ ధర ప్రకారం క్రమబద్ధీకరణ మొత్తాన్ని ఖరారు చేయాలని ఉంది. అయితే, ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువ మార్కెట్ ధరలను పెంచింది.

అంతా అదానీ కోసమే



(మొదటిపేజీ తరువాయి)

సాయాన్ని అందించింది. వీటికి సంబంధించిన పత్రాలను లాభాపేక్ష లేని మీడియా సంస్థ 'ది రిపోర్టర్స్ కలెక్టివ్ (టీఆర్‌సీ)', అల్‌జజీరాలు సంపాదించాయి.

'అల్‌జజీర' కథనం ప్రకారం.. బొగ్గు బ్లాకులను ప్రయివేటు రంగానికి అప్పగించే ప్రత్యేక నిబంధన సరికాదనీ, ఇందులో పారదర్శకత లోపించిందని ప్రధాన మంత్రి కార్యాలయం నిర్ధారించింది. అయినప్పటికీ కేంద్రం అదానీ కోసం మినహాయింపును కల్పించింది. భారత్‌లోని అత్యంత దట్టమైన అటవీ ప్రాంతాలలో 450 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ బొగ్గును కలిగి ఉన్న బ్లాక్ నుంచి తవ్వకాలు జరుపుకోవడానికి అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు అనుమతించింది. అయితే ఈ మినహాయింపును అదానీకి చెందిన గ్రూపునకే ఎందుకు ఇచ్చారో ప్రభుత్వం వివరించకపోవడం గమనార్హం.

2014లో కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ గ్రూపునకు బొగ్గు వ్యాపారంలో ఆధిపత్యం చలాయించే అవకాశం లభించినట్టయింది. 204 బొగ్గు బ్లాకుల కేటాయింపులను రద్దు చేస్తూ 2014లో సుప్రీంకోర్టు ఒక తీర్పును ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అనేక బొగ్గు బ్లాకుల కేటాయింపుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని కోర్టు గుర్తించింది. ఈ విధంగానే అప్పట్లో ఒక అక్రమ కాంట్రాక్టును ఒకటి అదానీ గ్రూపు పొందింది. చట్ట సభల అనుమతి లేకుండా ఇదంతా సాగిందని సర్వోన్నత న్యాయస్థానం గుర్తించింది. చివరకు అన్ని బొగ్గు బ్లాక్‌లను, అప్పగించిన మైనింగ్ కాంట్రాక్టులను రద్దు చేసి కంపెనీలను బలవంతంగా జప్తు చేసింది. దీంతో అదానీ గ్రూపునకు ఎదురుదెబ్బ తాకింది.

ఆ తర్వాత అదానీ కోసం మోడీ సర్కారు రంగప్రవేశం చేసింది. కోర్టు తీర్పును అనుసరించి అదానీకి లబ్ది చేకూరేలా ఒక నిబంధనను ప్రవేశపెట్టింది. ఈ నిబంధన అదానీ గ్రూపునకు మైనింగ్ నుంచి మినహాయింపును ఇచ్చింది. అయితే, మోడీ ప్రభుత్వ నిర్ణయంతో అదానీ గ్రూపు వ్యాపార సంపద అమాంతంగా పెరిగింది. కోర్టు తీర్పు నేపథ్యంలో అదానికి అనుకూలంగా మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రత్యేక నిబంధనలు ఇతర ప్రయివేటు కంపెనీలను నష్టాల్లోకి నెట్టాయి. అదానీ గ్రూపునకు మాత్రం కావాల్సినంత లాభాలను తెచ్చిపెట్టాయి. ఈ రోజు వరకు అదానీ గ్రూపు సదరు బ్లాక్ నుంచి 80 మిలియన్ టన్నులకు పైగా బొగ్గును తవ్వింది.

యూపీఏ హయాంలో బొగ్గు కుంభ కోణం మొత్తం దేశాన్ని అంధకారంలోకి నెట్టింది అని 2014 సాధారణ ఎన్నికలకు ముందు మోడీ తన ఎన్నికల ప్రచారాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనపై విమర్శలు సంధించారు. ఏఐసీసీని 'ఆలిండియా కోల్ కాంగ్రెస్‌గా' సైతం ఆ సమయంలో మోడీ అభివర్ణించారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ సర్కారు అదానీ విషయంలో అంతకు మించి వ్యవహరించింది. బొగ్గు వ్యాపార సామ్రాజ్యంలో బడా పారిశ్రామికవేత్తలకు హద్దు మీరి, నిబంధనలను పాతర పెట్టి మరీ సాయం చేసింది. అదానీ గ్రూపునకే కాకుండా ఆర్‌పీ సంజీవ్ గోయెంకా (ఆర్‌పీఎస్‌జీ)కి మోడీ ప్రభుత్వం అండగా నిలిచింది. బొగ్గు గనిని తిరిగి పొందేందుకు డొల్ల కంపెనీలను ఉపయోగించుకోవడానికి ఆర్‌పీఎస్‌జీకి కూడా అనుమతిని ఇచ్చింది.

హిండెన్‌బర్గ్ నివేదికతో అదానీ గ్రూపు సాగించిన డొల్ల వ్యాపారం గుట్టు బయటి ప్రపంచానికి తెలిసిన విషయం విదితమే. బ్యాంకు రుణాలు, అప్పుల మీద విస్తరించిన వ్యాపారం అదానీని దేశంలోనే అత్యంత సంపన్నుడిగా, ప్రపంచంలోనే టాప్–3 స్థానానికి తీసుకెళ్లింది. అయితే, హిండెన్‌బర్గ్ నివేదిక అనంతరం ఆయన వ్యాపార షేర్ల విలువ పడిపోయింది. ప్రపంచ సంపన్నుడిగా ఆయన ర్యాంకు టాప్ 3 నుంచి 30వ స్థానానికి పడిపోయింది.

2014 సుప్రీం తీర్పు తర్వాత కూడా రెండు బొగ్గు బ్లాక్‌లకు ఎండీఓ గా అదానీ గ్రూపు నిలిచిన తీరు

2006(మే) :	బొగ్గు తవ్వకాల కోసం జాయింట్ వెంచర్(జేవీ)కి టెండర్ ఆహ్వానించిన రాజస్థాన్ ప్రభుత్వ రంగ యూనిట్ ఆర్ఆర్‌వీయూఎన్ఎల్
2006 (ఆగస్టు):	ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (సీఎస్‌పీజీసీ)కి పర్సా బొగ్గు బ్లాక్‌ను కేటాయించిన కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ
2007(జూన్):	పీఈకేబీ బొగ్గు బ్లాక్‌ను ఆర్ఆర్‌వీయూఎన్ఎల్‌కు కేటాయించిన బొగ్గు మంత్రిత్వ శాఖ
2007(అక్టోబర్):	అదానీ గ్రూపుతో కలిసి ఆర్ఆర్‌వీయూఎన్ఎల్ జేవీ ఏర్పాటు : ఈ జేవీలో అదానీ ఈక్విటీ 74 శాతం
2009(జులై):	పీఈకేఈబీ బ్లాక్‌కు ఎండీఓగా అదానీ గ్రూపును నియమించిన ఆర్ఆర్‌వీయూఎన్ఎల్–అదానీ జేవీ
2010(డిసెంబర్):	సీఎస్‌పీజీసీతో జేవీ ఏర్పాటు చేసిన అదానీ గ్రూపు, పర్సా బ్లాక్‌కు ఎండీఓగా అదానీ గ్రూపు నియామకం
2013 :	పీఈకేబీ బొగ్గు బ్లాక్‌లో మైనింగ్ పనులు షురూ
2014(ఆగస్టు):	పీఈకేబీ, పర్సాలతో పాటు 204 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపులు రద్దు చేసిన సుప్రీం
2015(మార్చి):	పాత ఎండీఓ కాంట్రాక్టులు పునరుద్ధరించేలా బొగ్గు తవ్వకాల ప్రత్యేక నిబంధనల చట్టం తీసుకొచ్చిన మోడీ సర్కారు
2015(మార్చి):	ఆర్ఆర్‌వీయూఎన్ఎల్‌కు పీఈకేబీ తిరిగి కేటాయించిన బొగ్గు మంత్రిత్వ శాఖ, ఎండీవోగా మళ్లీ అదానీ
2015(ఫిబ్రవరి–మార్చి):	అదానీ సిఫారసు మేరకు పర్సా బ్లాక్ కేటాయింపు కోసం ఆర్ఆర్‌వీయూఎన్ఎల్ దరఖాస్తు చేసి చేజిక్కించుకోవడం, కొత్త ఆక్షన్ లేకుండానే అదానీని ఎండీవోగా నియమించిన జేవీ
2020(మార్చి):	ఎండీవోల నియామకాన్ని అంతర్గతంగా తప్పుబట్టిన పీఎంఓ
2020(ఆగస్టు–అక్టోబర్):	2014కు ముందున్న ఒక్క ఎండీవో (పీఈకేబీ బ్లాక్‌కు అదానీ గ్రూపు) ఒప్పందమే కొనసాగుతున్నదని తెలిపిన ప్రభుత్వాధికారులు.. ఇలాంటి ఒప్పందాలు భవిష్యత్తులో జరగవని స్పష్టీకరణ




సీపీఆర్ శిక్షణా కార్యక్రమం

(మొదటిపేజీ తరువాయి)

సీపీఆర్ అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలనే ఆలోచనను కేటీఆర్ ముందుకు తెచ్చారనీ, దానిపై చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్డియాక్ అరెస్ట్ అనేది సమయం, సందర్భం, చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఎవరికైనా వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. అయితే సకాలంలో కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) చేయడం వల్ల వీరి ప్రాణాలు కాపాడటం సాధ్యమవుతుందని సూచించారు. సడెన్ కార్డియాక్ అరెస్టులు (ఎస్.సి.ఎ), హార్ట్ స్ట్రోక్‌లు పెరుగుతున్నాయనీ, కండ్ల ముందే ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తుచేశారు. అయితే సకాలంలో కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) చేయడం వల్ల చనిపోయే వారి సంఖ్యను తగ్గించే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. ప్రస్తుతం కార్డియాక్ అరెస్ట్ అయిన ప్రతి పది మందిలో ఒకరు మాత్రమే బతుకుతున్నారనీ, సీపీఆర్ సకాలంలో చేస్తే కనీసం ఐదుగురిని బతికించుకునే అవకాశం ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇతర సంస్థలు చెబుతున్నాయని ఉదహరించారు. 'జిమ్ చేస్తూ, పనులు చేస్తూ, డ్యాన్స్ చేస్తూ, నడుస్తూ కొంత మంది సడెన్‌గా పడిపోవడం, ప్రాణాలు కోల్పోవడం వంటి వీడియోలు సోషల్ మీడియా, టీవీల్లో చూస్తున్నాం. ఇవి సడెన్ కార్డియాక్ అరెస్ట్ కేసులే. సీపీఆర్ తెలిసిన వారు ఉంటే సీపీఆర్ చేసి వారి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది. ప్రాణాపాయంలో ఉన్న వారికి సీపీఆర్ చేసేందుకు చదువు అవసరం లేదు, మెడికల్ పరిజ్ఞానం అవసరం లేదు, వయస్సుతో సంబంధం లేదు. ఎవ్వరైనా సరే సీపీఆర్ చేసి ప్రాణాన్ని కాపాడవచ్చు. కొంత అవగాహన, కొంత సమయ స్ఫూర్తి ఉంటేచాలు. అందుకోసమే ఈ కార్యక్రమం.రాష్ట్ర వ్యాప్తంగా అందరికీ విస్తారించలన్నదే ప్రభుత్వం ప్రయత్నం. వైద్యారోగ్య, పోలీసు, మున్సిపల్, పంచాయత్‌రాజ్ అందరికీ శిక్షణ ఇస్తున్నాం. గేటేడ్ కమ్యూనిటీ, సెక్యూరిటీ, వాచ్‌మెన్, అసోసియేషన్, బస్తీల్లో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, పంచాయతీల్లో, మున్సిపాల్టీల్లో అందరికీ శిక్షణనిస్తాం.గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, పోలీసు సిబ్బందికీ శిక్షణ ఇస్తాం...' అని మంత్రి తెలిపారు. 'మారిన జీవన శైలి, ఆహార అలవాట్లు, చెడు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి తదితర కారణాలు గుండె జబ్బులకు కారణమవుతున్నాయి. కరోనా తర్వాత కార్డియాక్ అరెస్టులు పెరిగాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అనుకోని ప్రమాదాలు, దుర్ఘటనలు జరిగినప్పుడు మనిషి సైక్లాజికల్ షాక్స్‌కి గురవుతాడు. ఈ సమయంలో హృదయ స్పందనలో తేడా వస్తుంది. గుండె లయ తప్పి ఆగిపోతుంది. అలాంటి సమయంలో మనిషి స్పందించడు. శ్వాస ఆగిపోతుంది. ఆ సమయంలో గుండె కొట్టుకునేలా ఛాతి మీద పదే పదే ఒత్తిడి చేయడం, నోటి ద్వారా కృత్రిమ శ్వాసను అందించడం వల్ల గుండె , ఊపిరితిత్తులు తిరిగి పని చేస్తాయి. దీన్నే సీపీఆర్ అంటారు. దీన్ని తెలుగులో హృదయ శ్వాస పునరుద్ధరణ అంటారు. ఇంత చేసినా కొన్ని సార్లు గుండె స్పందించదు. అలాంటి సందర్భంలో ఆటోమేటిక్ ఎక్స్‌టర్నల్ డెఫిబ్రిలేటర్స్- ఏఈడీ అనే వైద్య పరికరం ద్వారా ఛాతి నుంచి గుండెకు స్వల్ప మోతాదులో ఎలక్ట్రిక్ షాక్ ఇవ్వడం ద్వారా గుండె తిరిగి పని చేసేలా చేయడం సాధ్యమవుతుంది. మొదటి దశలో రూ.18 కోట్లతో 1,200 ఏఈడీ మిషన్లు కొంటాము. అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానల్లో నెల రోజుల్లో అందుబాటులోకి తెస్తాం...' అని మంత్రి హరీశ్ రావు తెలిపారు.

మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో కనీసం లక్ష మందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. సీపీఆర్ విషయంలో తెలంగాణ భారతదేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సీపీఆర్ శిక్షణా కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ ధరలను తగ్గించాలి : మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలనీ, అడ్డగోలుగా పెంచడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన భారత రాష్ట్ర సమితి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికలు అయిపోయిన వెంటనే ప్రతిసారి గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం కేంద్ర ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని విమర్శించారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం భారీగా గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడంపైన ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ అవసరాల సిలిండర్ ధరను 50 రూపాయలు, కమర్షియల్ సిలిండర్ ధరను 350 రూపాయల మేర భారీగా పెంచిందని విమర్శించారు. ఆయా రాష్ట్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే ఇంత భారీగా సిలిండర్ ధరను పెంచడం దారుణమన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా దేశ మహిళలకు ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన కానుకనా ఈ సిలిండర్ ధరల పెంపు అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ నెల 3న అన్ని నియోజకవర్గ, పట్టణ, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వ సిలిండర్ ధరల పెంపు పైన నిరసన కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎక్కడి వారక్కడ వినూత్నంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం రోజున సైతం గ్యాస్ ధరల పెంపుపైన కేంద్ర ప్రభుత్వ అసమర్థ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. మోడీ ప్రభుత్వం రాకముందు 400 రూపాయలు ఉన్న సిలిండర్ ధర ఈరోజు 1160ని దాటి 1200లకు చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలతో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఉజ్వల స్కీం పేరుతో మాయమాటలు చెప్పిన బీజేపీ ప్రభుత్వం ధరలను పెంచుతూ వారిని సిలిండర్‌కు దూరం చేస్తున్నదన్నారు.

ఎమ్మెల్సీగా మాణిక్ రెడ్డిని గెలిపించండి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ–ఓయూ

మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కోరారు. బుధవారం ఓయూలో ఆర్ట్స్ కళాశాల, సైన్స్ కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీ, కామర్స్ అండ్ మేనేజ్మెంట్ కాలేజీ, టెక్నాలజీ కాలేజీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రొఫెసర్స్‌ను ఓటు వేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం భవిష్యత్‌లో నిక్కచ్చిగా కొట్లాడే వ్యక్తిగా మాణిక్‌రెడ్డి ఉంటారని తెలిపారు. ఇప్పటికే తాను పలుమార్లు శాసనమండలిలో విశ్వవిద్యాలయలలోని అధ్యాపకుల సమస్యలు, కాంట్రాక్ట్ టీచర్ల సమస్యలు, యూనివర్సిటీలో నెలకొన్న మౌలిక వసతుల గురించి ప్రస్తావించినట్టు తెలిపారు. భవిష్యత్తులో మాణిక్ రెడ్డి కూడా తనతో కలిసి ఉద్యమిస్తారన్నారు.



ఈ సందర్భంగా ప్రొఫెసర్‌లు వివిధ సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆమంచి నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కాంట్రాక్టు టీచర్స్ యూనియన్ రామేశ్వరరావు, టెక్నాలజీ కాలేజ్ భాస్కర్, యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్, రాములు, సాంబన్న పాల్గొన్నారు.

చంపేసిన ఒత్తిడి..

- వేధింపులు భరించలేక
- కార్పొరేట్ కాలేజీ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య
- కారకులెవరన్నది సూసైడ్ నోట్‌లో వెల్లడి
- కాలేజీ ఎదుట మృతుని బంధువులు, ప్రజాసంఘాల ఆందోళన
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలంగాణ ఇంటర్ బోర్డు ముట్టడి

నవతెలంగాణ–గండిపేట్/ సుల్తాన్ బజార్

ఓ కార్పొరేట్ కాలేజీ యజమాన్యం వేధింపులు భరించలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఆత్మహత్యకు కారకులెవరన్న దానిపై సూసైడ్ నోట్ రాసి పెట్టుకున్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన సాత్విక్(16) నార్సింగ్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్ విద్యార్థులపై విపరీతంగా ఒత్తిడి ఉంటోంది. కొన్ని రోజుల నుంచి కాలేజీ యజమాన్యం చదువు పేరుతో వేధింపులు, ఒత్తిడికి గురిచేయడంతో సాత్విక్ తట్టుకోలేకపోయాడు. మంగళవారం రాత్రి పది గంటల సమయంలో తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన తోటి విద్యార్థులు కాలేజీ యాజమాన్యానికి తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో కొన ఊపిరితో ఉన్న సాత్విక్‌ను తోటి విద్యార్థులు ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడికి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ బంధువులు, విద్యార్థులు కాలేజీ ఎదుట బైటాయించారు. తమ కుమారుడు ఆత్మహత్యకు కాలేజీ యాజమాన్యమే కారణమని రహదారిపై బైటాయించారు. తల్లిదండ్రులకు మద్దతుగా ప్రజాసంఘాల నాయకులు కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థి స్వాతిక్ మృతికి కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగిన సమయంలో వార్డెన్, ప్రిన్సిపల్, లెక్చరర్స్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తోటి విద్యార్థులు రూం తాళం పగలగొట్టి సాత్విక్‌ను భుజాలపైన వేసుకుని వెళ్తున్నా కాలేజీ యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాదాపూర్ ఏసీపీ, సీఐలు, ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు. కుటుంబానికి న్యాయం చేసే విధంగా యాజమాన్యంతో మాట్లాడతామని, కేసు పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కాగా, విద్యార్థి సాత్విక్ జేబులో పోలీసులు సూసైడ్ నోట్‌ను గుర్తించారు. "అమ్మా, నాన్న.. నన్ను క్షమించండి.. మిమ్మల్ని బాధ పెట్టాలనే ఉద్దేశం నాకు లేదు. ప్రిన్సిపల్, ఇన్‌చార్జి, లెక్చరర్లు పెట్టే టార్చర్ వల్ల ఆత్మహత్య చేసుకుంటున్నాను. కృష్ణారెడ్డి, ఆచార్య, శోభన్, నరేశ్ వేధింపులు తట్టుకోలేకపోయాను. ఈ ముగ్గురు హాస్టల్‌లో విద్యార్థులకు నరకం చూపిస్తున్నారు. వీరి వేధింపులు తట్టుకోలేకనే నేనే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. నన్ను వేధించిన ఆ ముగ్గురిపై చర్యలు తీసుకోండి. అమ్మా, నాన్న లవ్ యూ, మిస్ యూ ఫ్రెండ్స్" అని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.





ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలంగాణ ఇంటర్ బోర్డు ముట్టడి

ర్యాంకులు, మార్కుల కోసం విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెంచి, కులం పేరుతో తిట్టి ఆత్మహత్య చేసుకునే విధంగా వ్యవహరించిన నార్సింగి శ్రీచైతన్య కళాశాల యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థి సాత్విక్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యకు డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ ఇంటర్ బోర్డు కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా టి.నాగరాజు మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పరీక్షల సమయం దగ్గరకు రాగానే ర్యాంకుల కోసం విద్యార్థులను తీవ్రంగా వేధింపులు గురి చేస్తున్నాయని తెలిపారు.

శ్రీచైతన్య విద్యాసంస్థలోనే గత నెలలో ఫిర్జాదీగూడలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని గుర్తు చేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం కమిటీలు వేశామని కాలయాపన చేస్తుంది తప్ప ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. విద్యార్థి సాత్విక్‌ను ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి కులం పేరుతో దూషించి, దాడి చేసి బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. వైస్ ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు పర్యవేక్షణా లోపం కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ కళాశాలలు ఫీజులు దోపిడీ చేస్తూ విద్యార్థులను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాయని చెప్పారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించిన విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి బేగంబజార్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, ఉపాధ్యక్షులు శ్రీమాన్, నాగేందర్, సునీల్, నాయకులు శివ, వాసు, శ్రీరామ్, సాయి కిరణ్, నిఖిల్, వెంకట్, లిఖిత్ పాల్గొన్నారు.

FORM - IV
(Rule 8)

Statement about ownership and other particulars about newspaper **NAVATELANGANA SAMAGRA TELUGU DINAPATRIKA.**

1. Place of publication : Khammam, Hyderabad, Rangareddy, Karimnagar.
2. Periodicity of its publication : Daily
3. Printer's Name : Nandayala Narsimha Reddy
   Nationality : Indian
   Address : Nallapaneni Kasaiah Nagar, Kodada X Road, Gurralapadu, Vill, Thallampadu Post, Khammam Rural Mdl, Khammam Dist-507170, Telangana State.
4. Publisher's Name : Nandayala Narsimha Reddy
   Nationality : Indian
   Address : Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam Dist-507170, Telangana State.
5. Editor's Name : R. Sudha Bhaskar
   Nationality : Indian
   Address : Nallapaneni Kasaiah Nagar, Kodada X Road, Gurralapadu, Vill, Thallampadu Post, Khammam Rural Mdl, Khammam Dist-507170, Telangana State.
6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one percent of the total capital. : (1) Mallareddy Sarampally S/o. S. Krishna Reddy # 1-1-2/D/F, Jawahar Nagar, Musheerabad, Hyderabad-500020.
   (2) Prabhakar Panguluri S/o. Krishnaiah #1-2-606/80, LIC Colony, Indira Park, Hyderabad-500080.
   (3) Ramulu Chukka S/o. CH. Narasaiah, # 2-1/73, Near Takie Town Theater, Widia Colony, Sundaraiah Nagar, Miyapur-500049.
   (4) Nandayala Narasimha Reddy S/o. Yella Reddy, # 6-7-524, Shivaji Nagar, Nalgonda, Pin : 508001.
   (5) Nagaiah Gollapelli S/o. G. Veeraiah # 1-7-1831/153, Ambedkar Nagar, Balasamudram, Hanamkonda, Warangal-506001.

I, Nandayala Narasimha Reddy hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
Nandayala Narasimha Reddy
Publisher

Date : 28-02-2023

నోటీసులు ఇవ్వకుండా
ఇండ్ల తొలగింపు అమానుషం

- మహిళలు, పిల్లలని చూడకుండా రోడ్డుపాలు చేశారు
- ప్రభుత్వం వెంటనే డబుల్ ఇండ్లు కేటాయించాలి: సీపీఐ(ఎం) నేతల
- గుడిసె వాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వమే పట్టాలిచ్చింది.. సదరు ఇండ్ల స్థలాలను సర్కారే జీవో నెం 58 కింద క్రమబద్ధీకరించింది.. దశాబ్దాలుగా అక్కడే నివాసముంటున్న పేద కుటుంబాలను కనీసం నోటీసు ఇవ్వకుండా అర్ధరాత్రి రోడ్డు మీద పడేయడం అన్యాయం.. అత్యంత అమానుషమని సీపీఐ(ఎం) ఆగ్రహం వ్యక్తం చేసింది. నియంత, మిలటరీ ప్రభుత్వాలూ ఇంత దుర్మార్గంగా వ్యవహరించవంది. అక్రమంగా కూల్చివేసిన ఎర్రమంజిల్ కాలనీ గుడిసె వాసులకు ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పార్టీ ప్రతినిధుల బృందం హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. నగరం నడిబొడ్డున నిమ్స్ ఆస్పత్రి పక్కనే గల ఎర్రమంజిల్ కాలనీ గుడిసె వాసులకు చెందిన 30 ఇండ్లను రెవెన్యూ అధికారులు ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా ఫిబ్రవరి 22న అర్ధరాత్రి తొలగించటం అన్యాయం అన్నారు. ఈ ఇండ్ల తొలగింపు అత్యంత అమానుషంగా, మానవ విలువలకు తిలోదకాలిస్తూ జరిపారని విమర్శించారు. బలవంతంగా ఇంటిలోని సామాన్లు బయటపడేసి కూల్చివేశారని, రోడ్డున పడిన ఈ కుటుంబాలకు ప్రత్యామ్నాయంగా ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిమ్స్ ఆస్పత్రికి స్థలం కావాలంటే ప్రజలకు నచ్చజెప్పాలి కానీ బలవంతంగా లాక్కోవడం సరికాదన్నారు. గుడిసె వాసులకు న్యాయం జరిగే వరకు వారికి ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కూల్చివేసిన గుడిసె వాసుల ఇండ్ల స్థలాలను ప్రభుత్వం జీవో నెం 58 కింద క్రమబద్ధీకరిస్తూ.. 2015లో సర్టిఫికెట్ ఇచ్చిందని, అయినా కూల్చివేయటం అన్యాయం అన్నారు. ఖైరతాబాద్ జోన్ కన్వీనర్ జి.కిరణ్ మాట్లాడుతూ.. ఇండ్లను కూల్చే ముందు చట్ట ప్రకారం నోటీసు ఇవ్వలేదన్నారు. ఇంట్లోని సామాన్లు తీసుకునే సమయమూ ఇవ్వకుండా పోలీసులతో ఇండ్లను దిగ్బంధం చేసి.. బలవంతంగా సామాన్లు బయటపడేసి అమానుషంగా రెవెన్యూ అధికారులు వ్యవహరించారన్నారు.

వీరికి ప్రత్యామ్నాయంగా వెంటనే ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) నగర నాయకులు శ్రీరాములు, ఖైరతాబాద్ ఐద్వా జోన్ కార్యదర్శి రాధిక, బస్తీవాసులు సూర్య కుమారి, రాజ్ కుమార్, మల్లేశ్వరి, అక్తర్ సుల్తాన్, మాబునీ, జాకీర్, నరేష్, శివ, గుడిసెవాసులు, కుటుంబ సభ్యులు మహిళలు పిల్లలు సహా పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇండ్లు, ఇండ్లస్థలాలివ్వాలి

- గుడిసె వాసులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలి
- ప్రజల సందేహాలపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి : ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అర్హులైన పేద ప్రజలందరికీ ఇండ్లు లేదా ఇండ్ల స్థలాలను ప్రభుత్వం ఇవ్వాలని ప్రజాసంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న మొదటి ప్రాధాన్యత కల్పించాలనీ, వారికి 120 గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 58, 59 ద్వారా పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ మంత్రివర్గ ఉపసంఘం ప్రకటించడం పోరాటాల ఫలితమేనని చెప్పారు. దానివల్ల కోటి కుటుంబాలకు లబ్ది చేకూరుతుందంటూ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారని అన్నారు. రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ మాత్రం 59 జీవో పరిధిలోకి వచ్చే 45 వేల మంది దరఖాస్తులు, 58 జీవో పరి5ధిలోకి వచ్చే 19 వేల మంది దరఖాస్తులు కలిపి మొత్తం 64 వేల మందికి లబ్దిచేకూరుతుందంటూ ప్రకటించారని గుర్తు చేశారు. మంత్రి కేటీఆర్ ప్రకటించినట్టు ఆ కోటి కుటుంబాలు ఎవరని ప్రశ్నించారు. అందులో రాష్ట్రవ్యాప్తంగా గుడిసెలు వేసుకున్న 28 వేల మంది పేదల ప్రస్తావన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పేద ప్రజల్లో అనేక అనుమానాలున్నాయని చెప్పారు. పోలీసులు దాడి చేసినా, మౌలిక సదుపాయాలు కల్పించకున్నా వారు ఆ గుడిసెల్లోనే ఉంటున్నారని అన్నారు. 120 గజాల చొప్పున గుడిసె వాసులందరికీ ఇంటిస్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు దరఖాస్తు చేసుకున్న వారికి హక్కు పత్రాలివ్వాలని కోరారు. ప్రజల్లో ఉన్న సందేహాలపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత రాకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రానున్న రోజుల్లో భూపోరాట కేంద్రాల్లో పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి నరసింహారావు మాట్లాడుతూ 30 రోజులపాటు సమయమిచ్చి ప్రభుత్వ భూముల్లో ఉండే పేదల నుంచి మళ్లీ దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. 2016లో 58 జీవో ద్వారా దరఖాస్తులను స్వీకరించారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ దరఖాస్తులను స్వీకరించలేదని అన్నారు. నిర్దిష్ట కాలపరిమితి విధించి ప్రభుత్వ భూముల్లో ఉండే పేదల నుంచి దరఖాస్తులను తీసుకుని వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షల చొప్పున ఇవ్వాలన్నారు. అప్పుడే వారు ఇండ్లు కట్టుకోవడానికి వీలవుతుందని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో పేదలుండే ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు ఇండ్లులేవని తేలిందని గుర్తు చేశారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వడం ద్వారా కోటి కుటుంబాలకు లబ్ది చేకూరుతుందంటూ మంత్రి కేటీఆర్ ఏ గణాంకాల ప్రకారం ప్రకటించారని ప్రశ్నించారు. మిగిలిన లబ్దిదారులెవరో ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 26,635 మంది లబ్దిదారులు, పట్టణాల్లో 46 వేల మంది లబ్దిదారుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వాటిని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె ఈశ్వర్‌రావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌పై దాడికి పాల్పడ్డ దుండగులను కఠినంగా శిక్షించాలి : తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేష్‌పై బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, హిందూవాహిని కార్యకర్తలు మూకుమ్మడిగా పోలీస్ వాహనంలోకి చొరబడి విచక్షణారహితంగా దాడిచేయడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడ్డ ఆ దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరింది. నరేష్‌కు రక్షణ కల్పించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ధాంతాలు, నమ్మకాలను చట్టానికి లోబడి ప్రచారం చేసుకునే హక్కు పౌరులకు రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. హన్మకొండ ఆదర్శ లా కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న నరేష్ అంబేద్కర్ భవన్‌లో విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీలో పాల్గొనేందుకు వెళ్లారని తెలిపారు. బీజేపీ, దాని అనుబంధ సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడ గుమికూడిన విషయాన్ని నరేష్ గమనించి పోలీసుల రక్షణ కోరాడని వివరించారు. వారి రక్షణతో పోలీస్ వాహనంలో ఉండగానే, దాన్ని అడ్డగించి విచక్షణారహితంగా దాడి చేయడంతో నరేష్ గాయాల పాలయ్యారని పేర్కొన్నారు. పోలీసులు అడ్డుకోకపోతే నరేష్ ప్రాణాలకే ముప్పు కలిగేదని తెలిపారు. ఈ కాలంలో మతోన్మాదుల దాడులు, అరాచకాలు పేట్రేగుతున్నాయని విమర్శించారు. భౌతికంగా దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే ఈ తరహా దాడులను ప్రజాస్వామ్యవాదులంతా ప్రతిఘటించాలని కోరారు. గతంలో ఆయన చేసిన వ్యాఖ్యల పట్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే దానికి క్షమాపణ కూడా కోరిన నరేష్‌పై ఈ రకంగా వెంటాడి, వేటాడి దాడికి పూనుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇండియన్ నేషనల్ ఒలింపియాడ్‌లో నారాయణ స్కూల్ విజయదుందుభి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇండియన్ నేషనల్ మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్‌లో నారాయణ స్కూల్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పి సింధూర నారాయణ, శరణి నారాయణ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ శిక్షణ క్యాంపునకు నారాయణ నుంచి అత్యధికంగా 33 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ పోటీలో మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు 12 మంది, కెమిస్ట్రీ ఒలింపియాడ్‌కు తొమ్మిది మంది, ఫిజిక్స్ ఒలింపియాడ్‌కు ఐదుగురు, సైన్స్ ఒలింపియాడ్‌కు ఏడు మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. సైన్స్ ఒలింపియాడ్‌లో తెలంగాణ నుంచి ఒకరు, ఏపీ నుంచి ఒకరు ఎంపికైతే, వారు నారాయణ విద్యార్థులు కావడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. పోటీ పరీక్షల్లో విజయం కోసం ప్రత్యేకంగా సీవో స్పార్క్, ఒలింపియాడ్, ఈటెక్నో, మెడిస్పార్క్ వంటి ప్రోగ్రామ్‌లతో శిక్షణ అందిస్తున్నామని వివరించారు. వాటికోసం ప్రత్యేకంగా అత్యున్నత స్థాయి మెటీరియల్‌ను రూపొందించామని పేర్కొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాల దరఖాస్తు గడువు 8 వరకు పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఆరో తరగతితోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. దరఖాస్తుల సమర్పణకు ఈనెల ఎనిమిదో తేదీ వరకు అవకాశముందని పేర్కొంది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఉషారాణి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు. ఆరో తరగతిలో ఒక్కో పాఠశాలలో వంద సీట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీ సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఓసీలు రూ.200, ఎస్సీ,ఎస్టీ,బీసీ, వికలాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 దరఖాస్తు ఫీజు చెల్లించాలని కోరారు. ఇతర వివరాల కోసం **www.tsmodelschools.com** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఇప్పటి వరకు 64,350 దరఖాస్తులొచ్చాయని వివరించారు.

బీజేపీని తరిమి కొట్టాలి

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవ తెలంగాణ - ఎన్జీవోస్ కాలనీ

ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్న బీజేపీని దేశం నుంచి తరిమి కొట్టడంతోపాటు రాష్ట్రంలో అడుగుపెట్టనీయొద్దని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం సారంపల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. బీజేపీ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ, రాష్ట్రంలోనూ పాగా వేయాలని చూస్తున్నదని, దాని ఆటలు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. బీజేపీ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం మార్చి 17న గ్రేటర్ వరంగల్ నగరంలో ప్రారంభమయ్యే రాజకీయ జాతాకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. దేశం అధోగతి పాలైందని, కార్మికులకు పని భద్రత కల్పించకపోగా, కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మోడీకి అత్యంత సన్నిహితులైన అదాని, అంబానీలాంటి పెట్టుబడుదారులకు కోట్ల రూపాయలు లబ్ది చేకూర్చడం కోసం దేశ ప్రజల సొమ్ము దోచిపెట్టారని విమర్శించారు. నిరుద్యోగంతో యువత కొట్టుమిట్టాడుతుంటే కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ దేశం ఆర్థికంగా దివాలా తీసే చర్యలు చేపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశం నుంచి బీజేపీని తరిమి కొట్టడంతోపాటు రాష్ట్రంలో అడుగుపెట్టనీయొద్దని పిలుపునిచ్చారు. పెరుగుతున్న ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. ములిగే నక్కపై తాటిపండు పడిన చందంగా గ్యాస్ ధరలను పెంచి భారం వేయడం ఏంటని ప్రశ్నించారు.

ధరల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, నాయకులు జి.ప్రభాకర్ రెడ్డి, చుక్కయ్య, టి.ఉప్పలయ్య, గొడుగు వెంకట్, గుమ్మడి రాజుల రాములు, మంద సంపత్, డి.తిరుపతి, కె.లింగయ్య, ఎల్.దీప, మిశ్రిన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దోపిడీలో కేసీఆర్ కుటుంబం

ఇదే తంతు కొనసాగితే ఈ ప్రాంతం ఎడారే..

- ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-జమ్మికుంట

క్వారీల పేరుతో కేసీఆర్ కుటుంబం ఇసుకను దోపిడీ చేస్తోందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హథ్ సే హాత్ భారత్ జోడో యాత్రలో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని తనుగుల, శంభునిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పరిమళ కాలనీలో ఇసుక క్వారీలను ఆయన సందర్శించారు. ఇసుక తరలింపుతో పంట పొలాలు దెబ్బ తింటున్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రేవంత్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇసుక దోపిడీని ప్రజలకు చూపెట్టడానికే ఇక్కడకు వచ్చినట్టు తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలించి కోట్లు కూడబెడుతున్నారన్నారు. అధికారులను అడుగుదామంటే ఒక్కరూ అందుబాటులో లేరన్నారు. మానేర్ వాగులో ఈ రకంగా ఇసుక తీస్తే రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంపై స్థానిక శాసన సభ్యుడు ఈటల రాజేందర్, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తప్పకుండా ప్రజా సమస్యలపై పోరాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు మక్కాన్‌సింగ్, కాంగ్రెస్ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పత్తి కృష్ణారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిని రవి తదితరులు పాల్గొన్నారు.

బిజిగిరి షరీఫ్ దర్గాలో రేవంత్ రెడ్డి పూజలు

జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ గ్రామంలో దర్గాలో రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని వావిలాల గ్రామంలో ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టను సందర్శించారు. సూపర్‌వైజర్‌తో మాట్లాడి ఖాదీ వస్త్రాల తయారీ, క్రయ, విక్రయాల గురించి తెలుసుకున్నారు.

బ్యాడ్మింటన్ ఆడుతూ గుండెపోటుతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-మల్కాజిగిరి

బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రమంలో ఓ వ్యక్తి అకస్మాత్తుగా గుండెపోటుతో గ్రౌండ్‌లోనే కుప్పకూలాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరిలోని మధుసూదన్‌నగర్‌కు చెందిన పరమేష్ యాదవ్(39) లాలాపేట్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ ఇండోర్ స్టేడియంలో బాడ్మింటన్ ఆడుతున్నాడు. ఈ క్రమంలో అతనికి ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందాడు.


(ఫైల్)

సమాచారం అందుకున్న లాలాగూడా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీడిమెట్ల ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం

- ఇద్దరు కార్మికులు మృతి



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలడంతో భారీ అగ్ని ప్రమాదం సంభవించి ఇద్దరు కార్మికులు మృతిచెందారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల పారిశ్రామికవాడలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అరోరా ఫార్మాస్యూటికల్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో బుధవారం రియాక్టర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరే గాయి. పరిసర ప్రాంతమంతా దట్టంగా పొగ కమ్ముకుంది. సమా చారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు రవీందర్‌రెడ్డి (25), కుమార్ (24) మృతిచెందారు. జీడిమెట్ల పోలీసులు మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మంటలు ఒక్కసారిగా ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

బిల్లులు రాలేదని సర్పంచ్ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సర్పంచ్ రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ - సుల్తానాబాద్

అప్పుచేసి గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తే బిల్లులు రావడం లేదని ఓ సర్పంచ్ ఎంపీడీవో కార్యాలయంలో పురుగుల మందు తాగాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కేంద్రంలో బుధవారం జరిగింది. రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన సర్పంచ్ రవీందర్ రెడ్డి గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేసిన రూ.15లక్షలకు సంబంధించిన బిల్లులు రాకపోవడమే కాగా ఎంపీవో వేధింపులకు గురిచేయడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే అక్కడివారు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మండల పరిషత్ కార్యాలయంలో ఓ అధికారికి గతంలో డబ్బులు ఇచ్చినా బిల్లులు మంజూరు చేయలేదని, తనకన్నా వెనక వారికి త్వరగా మంజూరు చేశారని ఆరోపించారు. బిల్లుల మంజూరు విషయం ఎప్పుడు అడిగినా రేపు మాపు అంటూ దాటవేస్తూ ఇబ్బందులకు గురి చేశారని చెప్పాడు. ప్రస్తుతం సర్పంచ్ రవీందర్‌రెడ్డి ఆరోగ్యం నిలకడగానే ఉంది.

'డబుల్' ఇండ్ల లబ్దిదారుల ఆందోళన

- సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆవేదన


ఆందోళన చేస్తున్న లబ్దిదారులు

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్దిదారులు బుధవారం ఆందోళనకు దిగారు. జగిత్యాల మున్సిపల్ పరిధిలో మొత్తం 3355 మంది డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారులను గుర్తించారు. కానీ వారికి క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికేట్లు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో లబ్దిదారులు పెద్దఎత్తున తహసీల్దార్ కారాలయానికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతుందని, మూడ్రోజుల్లో అన్ని సర్టిఫికెట్లు ఇస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ అమలు చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా మూడ్రోజులపాటు సమ్మె
- తొలిరోజు ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద ధర్నా

అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా మూడ్రోజుల సమ్మె చేపట్టారు. అందులో భాగంగా బుధవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. ఐసీడీఎస్‌ను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.



ఖమ్మంలో...
మెదక్‌లో...

నవతెలంగాణ- విలేకరులు

రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ధర్నా చేశారు. రాజేంద్రనగర్ సీడీపీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొడంగల్ చౌరస్తా నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

మూడ్రోజుల సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట ఆందోళన చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రాజెక్టు కార్యాలయం ఎదుట యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. నార్నూర్‌లో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సుభద్ర ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నిర్మల్ జిల్లా ముధోల్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ప్రాజెక్టు ఆందోళన చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ త్రివేణి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు.

నిజామాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిజామాబాద్ అర్బన్, డిచ్‌పల్లి ప్రాజెక్టులకు చెందిన అంగన్‌వాడీలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి ధర్నా చేపట్టారు. బోధన్, ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయాలతో పాటు మద్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్లు భారీ ప్రదర్శనగా ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం సీడీపీవో కనకదుర్గకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన సీడీపీవో తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని, మిగిలిన సమస్యలను పై అధికారులకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు. ఇల్లందు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. దమ్మపేటలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అశ్వారావుపేటలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు.

ఖమ్మం జిల్లా మధిరలో మానవహారం నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీగా సీడీపీవో కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేశారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఖమ్మ రూరల్ మండలంలో సీడీపీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ముందు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, అంగన్వాడీ టీచర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి కె.సమ్మక్క ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీ టీచర్లు 72 గంటలపాటు సమ్మె చేపట్టారు. మెదక్ పట్టణంలో ఆర్‌డీఓ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఆందోళ చేపడుతున్న అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సమ్మతోపాటు అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విడుదల చేశారు. సిద్దిపేటలో సీడీపీఓ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేపట్టారు.


సంపాదకీయం

ఈ గుండెకోతకు బాధ్యులెవరు?

ర్యాగింగ్ వికృతత్వం మరోమారు జడలు విప్పింది. ఉన్నత విద్యావ్యవస్థని చెదపురుగులా తొలుస్తోంది. రెక్కలు ముక్కలు చేసుకొని పట్టణాల్లో చదువుకోసం పల్లెల నుంచి తరలివచ్చిన ఎందరో విద్యార్థులు ఆధునికత్వం ముసుగులో భయానక ర్యాగింగ్ భూతానికి బలవుతున్న

ప్రపంచీకరణ నేపథ్యంలో కార్పొరేట్ విద్యావిధానం, పెరుగుతున్న విలాసాలు, సరదాలు, విద్యాసంస్థలు, యాజమాన్య నిర్లక్ష్యం, సినిమాలు, క్లబ్బు, పబ్బు సంస్కృతి వెరసి ఇవన్నీ ఎంతో విశాలంగా ఆలోచించాల్సిన యువతను చెడువైపునకు నెట్టేస్తున్నాయి. చదువులో పోటీ, ర్యాంకుల రేసులో వెనుకబడ్డ విద్యార్థులపై అధ్యాపకుల విపరీతమైన ఒత్తిడి కూడా కొన్నిసార్లు ప్రతికూల ఫలితాలకు కారణమవుతుంది.

పరిస్థితి హడలెత్తిస్తోంది. తాజాగా వరంగల్‌లో చోటు చేసుకున్న రెండు ఘటనలు మరువక ముందే, హైదరాబాద్‌లో బుధవారం కార్పొరేటు విద్యాసంస్థల ర్యాంకుల దాహానికి మరో విద్యార్థి బలయ్యాడు. ఈ ఉదంతాలు విద్యావ్యవస్థలో వేళ్ళూనుకొంటోన్న అనారోగ్యకర ఆటవిక చర్యలకు అద్దం పడుతున్నాయి. కొద్దిపాటి వినోదం కోసం ప్రారంభమై ఒక సాంప్రదాయంగా మారిన ర్యాగింగ్ వినోదపు హద్దుల్ని దాటి ప్రమాదకర స్థాయికి చేరడమే కాకుండా, అందులోకి కులం కూడా చొరబడి చాలా కాలమే అయ్యింది. తత్ ఫలితంగా అమ్మాయిలు కాలేజీ చదువులే విరమించుకుంటున్న సంఘటనలు అనేకం..! ఇది ఆడపిల్లల ఆత్మాభిమానానికి, ఆత్మ విశ్వాసానికి సవాలుగా మారింది. ఈ అనాగరిక, కుసంస్కార, హింసాత్మక చర్యలను అరికట్టాల్సిన విద్యాలయాల పెద్దలు, ప్రభుత్వాలు బాధ్యత మరిచి చోద్యం చూస్తున్నప్పుడు విద్యార్థులేం చేయాలి?



జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలు సాధించా లనుకున్న ఆ విద్యార్థుల కథలు అర్థాంతరంగా ముగిసిపోయాయి. సీనియర్‌ల వేధింపులు భరించలేక తీవ్రంగా కలత చెందిన అనస్థీషియా వైద్యవిద్యార్థిని ప్రీతి హానికర ఇంజక్షన్ తీసుకుని అయిదురోజులు మృత్యువుతో పోరాడి ప్రాణాలు వదిలింది. నర్సంపేటలో మరో బీటెక్ విద్యార్థిని ఈ భూతానికే బలైంది. ఏడిపించడం, వేధించడం, శారీరకంగా మానసికంగా హింసించి భయకంపితుల్ని చేయడమనే వికృత చేష్టలకు పర్యాయపదంగా ర్యాగింగ్ మారిపోయిందని సుప్రీంకోర్టు ఏనాడో ఛీత్కరించింది. నాకు చెప్పకుండా ప్రిన్సిపల్‌కు ఎందుకు ఫిర్యాదు చేశావని హెచ్‌ఓడి! నాకు అసలు ఫిర్యాదే అందలేదని ప్రిన్సిపల్! ఎవరి దృష్టికి తీసుకెళ్లినా వేధింపులు ఆగలేదని బోరున విలపిస్తున్న ఆ తల్లిదండ్రులు.. వారి గుండె కోతకు బదులిచ్చేదెవరు!

తాను ప్రేమించిన యువతినే కోరుకున్నాడన్న కక్షతో స్నేహితుడినే గుండెను చీల్చి అత్యంత కిరాతకంగాహత్య చేసి సెల్ఫీలు దిగిన బీటెక్ విద్యార్థి ఉదంతం రాష్ట్ర రాజధాని నడిబొడ్డున గగుర్పాటుకు గురిచేస్తోంది. కులం పేరుతో దూషిస్తూ, మార్కులు, ర్యాంకుల పేర ఒత్తిడి చేస్తున్నారని విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం సంచలనం కలిగిస్తోంది. ఈ ఘటనలు సామాజిక జీవన చిత్రం ఎంతగా ఛిద్రమైపోయిందో చాటుతున్నాయి. ఇటువంటి ఘటనల్లో నిందితుల్ని అరెస్టు చేసి రిమాండుకు తరలిస్తేనో, కళాశాల నుంచి సస్పెండ్ చేస్తేనో సమస్య పరిష్కారమై పోయినట్లు కాదు. ర్యాగింగుకు పాల్పడబోమంటూ విద్యార్థుల నుంచి తీసుకుంటున్న ప్రమాణ పత్రాలు, ర్యాగింగ్ నిరోధక కమిటీలు, నిఘా బృందాలు నిష్ప్రయోజకాలేనని ఆగకుండా సాగుతున్న ఈ ఉదంతాలు ఎలుగెత్తుతున్నాయి. గతంలో రాఘవన్ కమిటీ చెప్పినట్లు, పాఠశాల విద్య దశలో పిల్లలకు నైతిక విలువలు అలవరచకపోవడం వ్యవస్థ వైఫల్యంగా ర్యాగింగ్ సంస్కృతిని గుర్తించాలి. దాని మూలాలపై దృష్టిపెట్టి అన్ని అంచెల్లోనూ దిద్దుబాటు చర్యలు చేపట్టనంత వరకు, సమర్థ పరిష్కారమన్నది నేతి బీరలో నేతి చందమే!

ప్రపంచీకరణ నేపథ్యంలో కార్పొరేట్ విద్యావిధానం, పెరుగుతున్న విలాసాలు, సరదాలు, విద్యాసంస్థలు, యాజమాన్య నిర్లక్ష్యం, సినిమాలు, క్లబ్బు, పబ్బు సంస్కృతి వెరసి ఇవన్నీ ఎంతో విశాలంగా ఆలోచించాల్సిన యువతను చెడువైపునకు నెట్టేస్తున్నాయి. చదువులో పోటీ, ర్యాంకుల రేసులో వెనుకబడ్డ విద్యార్థులపై అధ్యాపకుల విపరీతమైన ఒత్తిడి కూడా కొన్నిసార్లు ప్రతికూల ఫలితాలకు కారణమవుతుంది. ఫలితంగా విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురికావడం, ఇంకొంతమంది నిరాశా నిస్పృహలకు లోనుకావడం జరుగుతోంది. అదే బలవన్మరణాలకు దారితీస్తోంది. "చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్టు" ప్రీతిని సైఫ్ వేధించినది నిజమేనని యాంటీ ర్యాగింగ్ కమిటీ తాజాగా నిర్ధారించింది. ఆపని ఫిర్యాదు అందినప్పుడే చేసి ఉంటే నేడు ప్రీతి బతికి ఉండేది కదా! ఇప్పటికైనా పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వాలు వేగంగా తగు చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి.

అమెరికా దేశంలో... సియాటిల్ నగరంలో...

సత్య

ఎక్కడైతే కుల వివక్ష పాటించబడుతున్నదో దానికి భారతీయులు కారణం కావటం సిగ్గుతో తల దించుకోవాల్సిన అంశం. ఎక్కడైతే అంటరానితనం మీద గళమెత్తుతున్నారో అక్కడ కమ్యూనిస్టులు ఉండటం సగర్వంగా తల ఎత్తుకొనే పరిణామం. అమెరికాలో ఇప్పుడు జరిగింది అదే. కొద్ది రోజుల క్రితం కులవివక్షను నిషేధిస్తూ తీర్మానం చేసిన అమెరికాలోని ఏకైక నగరంలో సియాటిల్ కాగా అందుకు ఆద్యురాలు, కమ్యూనిస్టు కౌన్సిలర్ క్షమా సావంత్ అనే 49సంవత్సరాల భారతీయ మహిళ. తొలిసారి ఎన్నికైనప్పుడు కనీస వేతనం గంటకు 15డాలర్ల కంటే తక్కువ ఉండరాదంటూ ఆమె ప్రవేశపెట్టిన తీర్మానం నెగ్గింది. దాంతో అనేక నగరాల్లో అలాంటి తీర్మానాలకు తెరలేచింది. ఇప్పుడు కులవివక్షపై నిషేధం విధించాలంటూ ఆమె ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కౌన్సిల్ ఆమోదించింది. ఒక కమ్యూనిస్టుగా బాధ్యతల నిర్వహణలో సహజంగానే ఆమె కార్పొరేట్ల ఆగ్రహానికి గురయ్యారు. కౌన్సిలర్‌గా వెనక్కు పిలవాలంటూ తప్పుడు ఆరోపణలు చేసి ఓటింగ్ నిర్వహించారు. దానిలో కూడా ఆమె మెజారిటీ సాధించి తన సత్తాను చాటుకున్నారు. రాజీపడని ఒక

మహారాష్ట్రకు చెందిన తమిళ కుటుంబానికి చెందిన క్షమా సావంత్ ముంబైలో చదువుకున్నారు. అక్కడ ఆమెకు వామపక్ష భావాలు వంటబట్టాయి. భర్త వివేక్ సావంత్‌తో కలసి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా అమెరికా వెళ్లిన ఆమె అక్కడ అర్థశాస్త్రం చదుకొని బోధనా వృత్తిని చేపట్టారు. సోషలిస్టు ప్రత్యామ్నాయం అనే ఒక కమ్యూనిస్టు పార్టీలో 2006లో చేరారు. ప్రస్తుతం ఆమె డెమోక్రటిక్ సోషలిస్టు పార్టీలో ఉన్నారు. సియాటిల్ నగరపాలక సంస్థకు తొలి సారిగా 2013లో ఎన్నికైన క్షమా ఈ ఏడాది ఆఖరి వరకు కౌన్సిలర్‌గా ఉంటారు. ప్రస్తుతం ఉన్న తొమ్మిది మందిలో ఆమె సీనియర్. వచ్చే ఎన్నికలలో తాను పోటీలో ఉండనని, కార్మిక ఉద్యమాల నిర్మాణానికి అంకితమవుతానని ఆమె ప్రకటించారు.

సోషలిస్టును పదవి నుంచి తొలగించేందుకు చేసిన యత్నాలంటూ బ్రిటన్‌కు చెందిన ఇండిపెండెంట్ పత్రిక "అమెరికాకు మరింత మంది కమ్యూనిస్టుల అవసరం ఏమిటి?" అనే శీర్షికతో 2021 డిసెంబరు 14న ఒక విశ్లేషణ రాసింది. కరోనా ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు మేయర్ ఇంటి ముందు ఒక నిరసన ప్రదర్శనలో మాట్లాడినందుకు గాను ఆమెను కౌన్సిలర్‌గా తొలగించాలని చూశారు. బడా వాణిజ్యవేత్తలు, మిత వాదులు, కార్పొరేట్ మీడియా, రాజకీయవేత్తలు, కోర్టులు ఆమెను వదిలించుకోవాలని చూసినట్లు ఆ పత్రిక రాసింది.

అమెరికా, ఐరోపా దేశాల్లో ఆఫ్రికన్లు, ఆసియన్లు, శ్వేతేతరులందరూ జాత్యహంకారానికి గురవుతున్నారు. భారతీయులు కూడా దానికి గురవుతున్నారు. కానీ వారిలో అగ్రకులం అనుకొనేవారు అక్కడ కూడా మిగతావారి పట్ల కులవివక్షను పాటిస్తున్నారు. వీరిలో ఉద్యోగులు, విద్యార్థులు కూడా ఉన్నారు. అమెరికాలో భారత సంతతికి చెందిన వారు మొత్తం పాతికలక్షల మంది ఉన్నారు.

సిస్కో కంపెనీలో పని చేస్తున్న దళిత సామాజిక తరగతికి చెందిన ఒక ఇంజనీరు అదే కంపెనీలో మేనేజర్లుగా పని చేస్తున్న మరో ఇద్దరు అగ్రకులాలుగా పరిగణించే వారు తన పట్ల వివక్ష చూపారన్న ఫిర్యాదు మీద సదరు కంపెనీ ఎలాంటి చర్య తీసుకోకపోగా తమ దగ్గర అలాంటి వివక్ష లేదని చెప్పుకుంది. ఫిర్యాదు చేసిన దళి తుడిని పక్కన పెట్టింది. ఈ వార్త వెల్లడికాగానే అమెరికాలో కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న 'ఈక్వాలిటీ లాబ్స్'కు... ఫేస్‌బుక్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబిఎం వంటి కంపెనీలలో కూడా అలాంటి పరిస్థితి ఉందంటూ అనేక ఫిర్యాదులు అందాయి. ఒత్తిడి పెరగటంతో సిస్కో సంస్థ జరిపిన విచారణలో వివక్ష నిజమే అని తేలింది. అమెరికాలో ఉన్న చట్టాల ప్రకారం కులం, తెగలకు సంబంధించి ఎలాంటి రక్షణ చట్టాల్లో లేనందున ఈ కేసును కొట్టివేయాలని కోర్టును కోరింది. ఈ కేసులో ఒక పక్షంగా చేరిన ఒక హిందూత్వ సంస్థ హిందూయిజానికి వివక్షకు సంబంధం లేదంటూ వాదనలు చేస్తున్నది. ఈ కేసు ఇంకా విచారణలో ఉంది.

తాజాగా సియాటిల్ నగరపాలక సంస్థ చేసిన నిర్ణయం ఈ కేసును ఎలా ప్రభావితం చేస్తుందో చూడాల్సి ఉంది. సిలికాన్ వ్యాలీలో "అగ్రహార వ్యాలీలు" ఉన్నాయని 'ఈక్వాలిటీ లాబ్స్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తనిమొళి సౌందరరాజన్ చెప్పారు. (మన దేశంలో అగ్రహారాలు వివక్షకు ప్రతిరూపాలుగా ఉన్నందున ఆమె అలా వర్ణించారు. ఇప్పుడు అగ్రహారాలులేని చోట్ల కూడా వివక్ష పాటించే వారందరికీ అది వర్తిస్తుంది). అమెరికాలోని స్వామి నారాయణ సంస్థ న్యూజెర్సీలో దేవాలయ నిర్మాణం కోసం రెండు వందల మంది బలహీనవర్గాలకు చెందిన వారిని అక్కడికి తీసుకుపోయి గంటకు కేవలం 1.2 డాలర్లు మాత్రమే ఇస్తూ సంవత్సరాల తరబడి పనిచేయిస్తున్నట్లు అక్కడి మీడియా వెల్లడించింది. సిస్కో, ఈ దేవాలయ నిర్మాణంలో వెట్టి కార్మికుల కేసు ఇంకా పరిష్కారం కాలేదు.



'ఈక్వాలిటీ లాబ్స్' 2016లో నిర్వహించిన ఒక సర్వేలో దిగువ కులాలుగా పరిగణించబడుతున్న తరగతులకు చెందిన వారిలో 41శాతం మంది వివక్షకు గురవుతున్నారని చెప్పినట్లు తేలింది. అమెరికా స్కూళ్లు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలలో ఈ సర్వే జరిగింది. పని స్థలాల్లో వివక్షకు గురైనట్లు 67శాతం చెప్పారు. మొత్తంగా దక్షిణాసియా వారు వివక్షకు గురవుతున్నప్పటికీ వారిలో అగ్రకులాలకు చెందిన వారు నామమాత్రంగా ఉన్నారని సర్వే తెలిపింది. కార్నెగీ సంస్థ 2020లో జరిపిన సర్వేలో అమెరికాలో జన్మించిన వారితో పోలిస్తే వలస వచ్చిన వారిలో ఎక్కువ మంది తమ కుల గుర్తింపును గట్టిగా చెప్పినట్లు తేలిసింది. పదిలో ఎనిమిదిమంది తాము అగ్రకుల హిందువులమని చెప్పుకున్నారట. వివక్ష గురించి అడిగిన ప్రశ్నకు అమెరికాలో శ్వేతజాతి వివక్ష అమెరికా ప్రజాస్వామ్యానికి ముప్పని భారత సంతతికి చెందిన వారిలో 73శాతం మంది చెప్పారు. అయితే భారత్‌లో హిందూత్వ మెజారిటీ వివక్ష ఇక్కడి ప్రజాస్వామ్యానికి ముప్పని వారిలో 53శాతం మాత్రమే చెప్పారట.

అమెరికా, ఇతర దేశాలలో ఉన్న దళితులు తాము ఎదుర్కొంటున్న వివక్ష, అవమానాలకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. సామాజిక మాధ్యమ వేదికలను ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారు, బాధితులకు ఆసరాగా నిలుస్తున్నారు. అలాంటి వారిలో సెల్వీ రాజన్ ఒకరు. ఆమె ఆర్గనైజ్ పేరుతో కుల వివక్ష వ్యతిరేక శక్తులను సమీకరిస్తున్నారు. ఆమె తలిదండ్రులు కులవివక్షను తప్పించుకొనేందుకు అమెరికా వలసవెళ్లారు. తాము భారత్ నుంచి అమెరికా వచ్చినా అక్కడా కుల ముద్ర వెంటాడుతోందని సెల్వీ ఆవేదన చెందారు. తన అనుభవం గురించి చెబుతూ దళితులు అమెరికాకు రావటం అరుదుగా ఉంటున్న స్థితిలో తనను అగ్రకులస్తురాలిగా భావించారన్నారు. ఒక ఆసియన్‌గా శ్వేతజాతి దురహంకారానికి గురైనట్లు చెప్పారు. తన రూమ్మేట్‌గా ఉన్న ఒక బ్రాహ్మణ యువతి తన వంట పాత్రల్లో మాంసం కాదు కదా గుడ్లు కూడా ఉడికించటానికి వీల్లేదని చెప్పినట్లు వెల్లడించారు. అమెరికాలో కూడా కులాన్ని పాటిస్తున్నందున ఇతరుల మాదిరే తోటి భారతీయుల ముందు కులాన్ని దాచుకోవాల్సి వచ్చిందన్నారు. కులతత్వానికి వ్యతిరేకంగా పోరాడకపోతే అమెరికాలో కూడా అది పాతుకుపోతుంది. అమెరికాలో జాత్యహంకారం, భారత్‌లో కులతత్వానికి దగ్గరి పోలికలు ఉన్నాయని రెండూ అణచివేతకు పాల్పడేవే అన్నారు.

2018లో జరిపిన ఒక సర్వే ప్రకారం 26శాతం మంది దక్షిణాసియా వాసులు భౌతికదాడులకు గురైనట్లు, 59శాతం మంది కులపరమైన వివక్షకు గురైనట్లు, సగం మంది తాము దళితులమని వెల్లడైతే దూరంగా పెడతారని భయపడినట్లు తేలింది. 2003లో పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలోని భారత అధ్యయన కేంద్ర సర్వే ప్రకారం భారత్ నుంచి వలస వచ్చిన వారిలో దళితులు కేవలం 1.5శాతమే అని 90శాతం మందికి పైగా తాము ఆధిపత్య కులాలకు చెందిన వారిగా చెప్పినట్లు తేలింది. అమెరికాలో జన్మించిన భారత సంతతివారితో పోలిస్తే వలస వచ్చిన వారితో కులవివక్ష సమస్య ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. ప్రీతి మేషరామ్ అనే దళిత యువతి అమెరికాలో తన అనుభవం గురించి చెబుతూ... పార్టీలు జరుపుకునే సమయంలో ప్రతి గదిలో ఉన్నవారిని పలుకరించి కులం గురించి తెలుసుకున్నవారు తన వద్దకు వచ్చేసరికి ఇబ్బంది పడేవారని, కారణం తాను దళితురాలినని తెలియటమే అన్నారు. తనపై జరిగిన అత్యాచారం గురించి ఆమె వివరిస్తూ... గ్రామాల్లో పొలాల్లో పని చేసే దళిత స్త్రీల శరీరాలకు తామే యజమానులమన్నట్లు ప్రవర్తించే భూస్వాముల మాదిరి ఒక అగ్రకుల విద్యార్థి తన పట్ల ప్రవర్తించాడని, ఆ విషయాన్ని అగ్రకులానికి చెందిన తన రూమ్మేట్‌కు చెబితే నమ్మకుండా తిట్టిందని మేషరామ్ చెప్పింది. రుజువు చేసే అవకాశాలు లేనందున ఫిర్యాదు చేయలేదని చెప్పింది.

అమెరికాలోని దళితుల గురించి 'ఈక్వాలిటీ ల్యాబ్స్' జరిపిన సర్వే విశ్లేషణ ఫలితాలు ఇలా ఉన్నాయి... సర్వేలో పాల్గొన్నవారిలో 25శాతం మంది భౌతిక లేదా దూషణ దాడికి గురయ్యారు. చదువుకొనేటప్పుడు ప్రతి ముగ్గురిలో ఒకరు వివక్షను అనుభవించారు. పని ప్రాంతాల్లో మూడింట రెండు వంతుల మంది పట్ల అనుచితంగా వ్యవహరించారు. అరవైశాతం మంది కులపరమైన జోక్స్ లేదా మాటలను ఎదుర్కొన్నారు. నలభైశాతం

అమెరికా, ఇతర దేశాలలో ఉన్న దళితులు తాము ఎదుర్కొంటున్న వివక్ష, అవమానాలకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. సామాజిక మాధ్యమ వేదికలను ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారు. బాధితులకు ఆసరాగా నిలుస్తున్నారు. అలాంటి వారిలో సెల్వీ రాజన్ ఒకరు. ఆమె ఆర్గనైజ్ పేరుతో కుల వివక్ష వ్యతిరేక శక్తులను సమీకరిస్తున్నారు. ఆమె తలిదండ్రులు కులవివక్షను తప్పించుకొనేందుకు అమెరికా వలసవెళ్లారు. తాము భారత్ నుంచి అమెరికా వచ్చినా అక్కడా కుల ముద్ర వెంటాడుతోందని సెల్వీ ఆవేదన చెందారు.

మంది దళితులు, 14శాతం మంది శూద్రులను పని స్థలాల్లో ఎందుకు వచ్చారన్నట్లుగా చూశారు. తమ కులం కారణంగా వాణిజ్యంలో వివక్షకు గురైనట్లు 14శాతం మంది దళితులు చెప్పారు. తమ కులం కారణంగా అమ్మాయిలు తమతో రొమాంటిక్ రిలేషన్‌షిప్‌కు తిరస్కరించినట్లు 40శాతం మంది చెప్పారు. తమ కులాన్ని ఎక్కడ వెల్లడిస్తారో అనే భయం ప్రతి ఇద్దరు దళితుల్లో ఒకరు, ప్రతి నలుగురు శూద్రుల్లో ఒకరిలో ఉన్నట్లు వెల్లడైంది. అయితే అనేక మంది కులవివక్షను వ్యతిరేకి స్తూనే ఆత్మన్యూనతకు లోనుకాకుండా తమ కులం గురించి గర్వంగా చెప్పుకొనే దళితులు కూడా గణనీయంగా ఉన్నారు. ప్రపంచీకరణలో దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలతో పాటు ప్రపంచవ్యాపితం అవుతున్న కులవివక్ష మహమ్మారికి వ్యతిరేకంగా దాన్ని వ్యతిరేకించే అందరితో కలసి పోరాడాల్సి ఉంది.

మహారాష్ట్రకు చెందిన తమిళ కుటుంబానికి చెందిన క్షమా సావంత్ ముంబైలో చదువుకున్నారు. అక్కడ ఆమెకు వామపక్ష భావాలు వంటబట్టాయి. భర్త వివేక్ సావంత్‌తో కలసి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా అమెరికా వెళ్లిన ఆమె అక్కడ అర్థశాస్త్రం చదుకొని బోధనా వృత్తిని చేపట్టారు. సోషలిస్టు ప్రత్యామ్నాయం అనే ఒక కమ్యూనిస్టు పార్టీలో 2006లో చేరారు. ప్రస్తుతం ఆమె డెమోక్రటిక్ సోషలిస్టు పార్టీలో ఉన్నారు. సియాటిల్ నగరపాలక సంస్థకు తొలి సారిగా 2013లో ఎన్నికైన క్షమా ఈ ఏడాది ఆఖరి వరకు కౌన్సిలర్‌గా ఉంటారు. ప్రస్తుతం ఉన్న తొమ్మిది మందిలో ఆమె సీనియర్. వచ్చే ఎన్నికలలో తాను పోటీలో ఉండనని, కార్మిక ఉద్యమాల నిర్మాణానికి అంకితమవుతానని ఆమె ప్రకటించారు. మహిళలకు మాత్రమే ఆడవాళ్ల సమస్యలు తెలుస్తాయని, అలాగే దళితులకు మాత్రమే దళితుల సమస్యలు తెలుస్తాయని మిగతావారికి మాట్లాడే అర్హత లేదన్నట్లుగా వాదించేవారిని దళితురాలు కాని క్షమా సావంత్ ఆచరణ ఆలోచింపచేస్తుందా? ఎవరికైనా స్పందించే హృదయం, చిత్తశుద్ధి కావాలి.



నేరప్రవృత్తికి అడ్డుకట్ట వేయలేమా..?

ఇటీవల కాలంలో హత్యలు, ఆత్మహత్యలు సమాజాన్ని వెంటాడుతున్న అతి ప్రధానమైన సమస్యలుగా మనముందు కనపడుతున్నాయి. దీనికి ప్రధాన కారణాలుగా శారీరక మానసిక ఉద్రేకాలు, ఆర్థిక, కుటుంబ కారణాలు అని గ్రహించాలి. దీనికితోడు సామాజిక మాధ్యమాలు, వివిధ వెబ్‌సైట్లు, మద్యం, మత్తుపదార్థాలు... చదువుతున్న హైస్కూల్ విద్యార్థుల స్థాయి నుంచి పండు ముదుసలి వరకు ఈ హత్యలు, ఆత్మహత్యలు పెరుగుతూ ఈ సమాజం ఎటు పోతుందో అనే ఆందోళన కలిగిస్తుంది. ప్రతి చిన్న విషయానికి ఆత్మహత్య చేసుకోవడం, చిన్న చిన్న ఉద్రేకాలకు హత్యలు చేసే సంస్కృతి పెరగడం వలన సమాజంలో నేరప్రవృత్తి పరవళ్ళు తొక్కుతోంది. ఇది అత్యంత ప్రమాదకరమైనదిగా ఆదిలోనే గుర్తించి, నివారణా చర్యలు కుటుంబ స్థాయి తల్లిదండ్రులు నుంచి సమాజంలో ఉపాధ్యాయులు, మీడియా స్వచ్ఛంద సంస్థలు పైనా ఈ బాధ్యతను గుర్తెరగాలి.

ముఖ్యంగా ప్రస్తుతం సమాజంలో వైయక్తిక కుటుంబాలు పెరగడం, తల్లిదండ్రులు తమ ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో మునిగి పోవడం వల్ల తమ పిల్లలకు సరైన మానసిక ఆరోగ్యం కల్పించకపోవడంతో పిల్లలు ఒంటరిగా ఉండటం, ఇతరులతో సావాసం చేయుడంతో కొన్ని రుగ్మతలకు లోనవుతున్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారు. పిల్లలను ఆర్థిక పరంగా మంచి స్థితిలో ఉంచడానికి చిన్నప్పుడు నుంచే చదువు పేరుతో హాస్టల్లో చేరిపించుటచే విద్యార్థి దశలోనే కుటుంబ సభ్యులకు దూరంగా ఉండుట వలన శారీరక మానసిక అనారోగ్యాలకు గురవుతున్నారు. భవిష్యత్తులో ఏమైనా సమస్యలు వస్తే, ధైర్యంగా ఎదుర్కోవాలి అనే భావన అందరిలో రావడానికి బదులు, ఆత్మహత్య అనే పిరికితన చర్యలకు పాల్పడుతున్నారు. ఇక మరికొందరు హింస, శృంగార (పోర్న్ సైట్లు) మాధ్యమాల్లో సంచరిస్తూ అనేక హత్యలు చేస్తున్నారు. తనకు కావలసిన రీతిలో ఏదైనా లభ్యం కాకపోతే ఎంతటికైనా దిగజారే స్థితిలోకి వెళుతున్నారు. యాసిడ్ దాడులు, చివరికి శరీర భాగాలను ముక్కలు ముక్కలుగా కట్ చేసే భయంకరంగా తయారు అవుతూ ఉండటం అత్యంత బాధాకరం. ఇటీవల అనేక నేర దర్యాప్తు సంఘటనలలో ఇటువంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా వివాహేతర సంబంధాలు పెచ్చుమీరుతున్నాయి. సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన నేటి తరుణంలో ఈ అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా విరాజిల్లుతోంది. దీనికి తోడు టీవీ సీరియల్స్, వివిధ షోలు అనేక కుటుంబాలు, వ్యక్తులు మీద తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ప్రతీ అంశంలో మంచి చెడులు ఉంటాయి. దానిలో మంచి తీసుకుని ముందుకు సాగాలి. కానీ నేడు చెడు అంశాలతో ముందుకు సాగడం ప్రమాదకరం. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పెంచడం పట్ల ఎక్కువ శ్రద్ధ వహించాలి. వారి అలవాట్లు, స్నేహాలు, చూసే వెబ్‌సైట్లు మీద దృష్టి సారించాలి.

సమాజంలోని అన్ని రంగాల్లో, వర్గాల్లో ఈ హత్యలు, ఆత్మహత్యలు నేరప్రవత్తి పరవళ్ళు తొక్కుతోంది. దీనికి ఇకనైనా చెక్ పెట్టాలి. ముఖ్యంగా కుటుంబ స్థాయి నుంచి చర్యలు చేపట్టాలి. ప్రభుత్వాలు విద్యా వైద్య రంగా లకు ప్రాధాన్యత కల్పించాలి. ఉచితాలు కంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రతీ వ్యక్తీ ఈ సమాజంలో ఉన్నతంగా జీవించాలి అంటే భారత రాజ్యాంగం ఆశయాలకు అనుగుణంగా ప్రజాస్వామ్య లౌకిక సామ్యవాద విధా నాలకు అనుగుణంగా పరిపాలన అందించాలి. విద్వేష ప్రసంగాలు, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు కట్టడి చేయాలి. శారీరక మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బైఐదు సంవ త్సరాల పూర్తైనా, నేటికీ అందరికీ విద్య వైద్యం అందని ద్రాక్షగా ఉన్నది. సమాజంలో అనేక అసమానతలు మనవెంటే ప్రయాణం చేస్తున్నాయి. ఇకనైనా విడనాడాలి. ప్రజల ఆర్థిక సామాజిక పరిస్థితులు మారితేనే ఆత్మహత్యలు ఆగుతాయి.ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో సంచరిస్తున్న యువత, పిల్లలు తమ బాల్యాన్ని విజ్ఞాన సము పార్జనకు, నూతన ఆవిష్కరణలకు, క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు మార్గాలు అన్వేషించాలి. ఒలింపిక్ పతకాలు, నోబెల్ బహుమతులు అందుకునే విధంగా ప్రయత్నాలు ముమ్మరం చేయాలి... నైతిక, కుటుంబ, మానవతా విలువలు పాటించాలి. జీవితాల్లో వెలుగులు నింపుకుని, నిండు నూరేళ్ళు హాయిగా జీవించాలి...

- ఐ.పి.రావు



వాళ్ళిద్దరివికూడా పాలుగారే మొహాలే!
ఉజ్వల భవిష్యత్తు, వాళ్ళకే గాదు
ఈ దేశానికి, సమాజానికి,
ప్రపంచానికి, యావత్ మానవాళికి
అందించాల్సినవాళ్ళే!

ముందు మందుతో స్నేహం కుదిరింది
గంజాయి దమ్ముకూడా తోడయినట్టుంది
ఓ అమ్మాయి జత కలిసింది! ఇంకేముంది!
వాళ్ళు వాళ్ళ వయసును మరిచారు!
కుటుంబాన్ని మరిచారు!
సమాజాన్ని మరిచారు!
చదువుల తల్లిని మరిచారు!
సమస్త ప్రపంచాన్ని మరిచారు!
మైమరిచిన బుద్ధి వక్రీకరించింది!

మానవుడు దానవుడయ్యాడు!
ఒకడు హతుడయ్యాడు!
మరొకడు హంతకుడయ్యాడు!
నిష్కారణంగా
ఓ నిండు ప్రాణాన్ని కోల్పోయిన
ఆ కుటుంబం గర్భ శోకంతో
తల్లడిల్లిపోయింది!
సమాజం నివ్వెర పోయింది!
చట్టాలు చుట్టుముట్టాయి!

ఎవరిది తప్పు! ఎవరిదీ నేరం!
గంజాయి దమ్ముదా! మందుదా!
హతుడిదా! హంతకుడిదా!
ఆ అమ్మాయిదా! మిత్ర బృందానిదా!
యుక్తాయుక్త విచక్షణ
నేర్పని చదువులదా!
ప్రేమామృతంలో విషాన్ని నింపి
కల్తీ కల్లులా సరఫరా చేస్తోన్న
వినోద మాధ్యమాలదా!
చోద్యం చూస్తోన్న ప్రభుత్వానిదా!
ఎవరిది! ఎవరిది తప్పు!

ప్రేమ ముసుగులో చలామణిలవుతోన్న
పాశ్చాత్య విలువలు, కృత్రిమ పోకడలు,
వాటి వలలో చిక్కి
నేల విడిచి సాము చేస్తూ
లవ్ ఎఫైర్‌లలో జీవితాలను
బ్రేక్ అప్ చేసుకొంటున్న
యువతీ, యువకులు!

ఈ విష వలయాన్ని ఛేదించి
మన ముందు తరాలను కాపాడుకునే
ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతికోసం
సమాజం ఎదురుచూస్తోంది!
అందించేదెవరో!!

-సత్యభాస్కర్, 9848391638

విజ్ఞాన కేంద్రాల్లో యజ్ఞయాగాలా?

సైన్స్ రంగంలో పరిశోధనలు చేసి ఈ స్థాయికి చేరుకున్న యూనివర్సిటీ ఉన్నత అధికారులే... మానవ మరణాలకు యాగాలు విరుగుడని భావించే స్థితికి దిగజారితే ఇక సమాజానికి దిక్కెవరు? విద్యను కాషాయీకరణ చేయాలనే బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ భావజాల ప్రభావం ఎంత తీవ్రంగా విద్యాలయాల్లోకి చొరబడుతున్నదో అందునా విశ్వ విద్యాలయాల్లోకి ఎంత వేగంగా వస్తున్నదో ఈ ఘటన తెలియచేస్తోంది. బీజేపీ బలంగా ఉన్నచోటే దాని భావజాల ప్రమాదం ఎక్కువగా ఉంటుందనుకునే వారికి ఈ పరిణామం ఒక హెచ్చరిక.

ఏపీలోని అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గత రెండు నెలల్లో కొందరు ఉద్యోగులు చనిపోయారు. ఈ మరణాలతో వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ ఆవేదన చెందారట! ఈ చావులను అడ్డుకునేందుకు బోధన, బోధనేతర సిబ్బందికి అత్యవసరంగా ఒక సర్క్యులర్ జారీ చేశారు. ఈ నెల 24న యూనివర్సిటీ క్యాంపస్‌లో ధన్వంతరి మహా మృత్యుంజయ యాగం చేద్దాం, అందుకు బోధన ఉద్యోగులు రూ.500, బోధనేతర సిబ్బంది రూ.100 చెల్లించి తమ పేరిట పూజలు చేయించుకోవాలన్నారు. విద్యార్థి సంఘాలు, లౌకికశక్తులు ప్రశ్నించడంతో రద్దు చేసుకున్నట్లు రిజిస్ట్రార్ ప్రకటించారు. తాత్కాలికంగా యాగ ప్రయత్నాలు రద్దయినా ఈ ఆలోచన ఒక్క వి.సి, రిజిస్ట్రార్‌లకు తట్టినది కాదని, దేశంలో అనేక యూనివర్సిటీలలో జరుగుతున్న ఛాందసవాద భావజాల విస్తృతిలో భాగమని గుర్తించాలి. వైస్‌ఛాన్సలర్, రిజిస్ట్రార్ ఇద్దరూ సైన్స్ విభాగాల్లోనే పిహెచ్‌డిలు చేశారు. వారు సైన్స్ అధ్యాపకులు కూడా. అయినా ఇలా ఎందుకు ఆలోచించారు. దీనికి మూలం దేశంలో గత కొద్ది సంవత్సరాలుగా జరుగుతున్న మతఛాందసవాదుల ప్రయత్నాలు, అధికారంలో ఉన్న వారి మనసును ఆకట్టుకోగలిగితే... ఎంతటి ఉన్నత పదవులైనా రాత్రికి రాత్రి వచ్చి తమను వరిస్తున్న తీరు ఇందుకు కారణాలు.

తమ వ్యక్తిగత విశ్వాసాలకు యూనివర్సిటీని కేంద్రంగా చేసుకుంటూ వి.సి, రిజిస్ట్రార్‌లు అధికారికంగా ప్రయత్నాలు చేయడం తీవ్ర అభ్యంతరకరం. విజ్ఞాన కేంద్రాలుగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలను అజ్ఞాన కేంద్రాలుగా మారుస్తారా? అని విద్యార్థి సంఘాలు, మేధావులు వి.సి.ని ప్రశ్నిస్తే, యాగం నిలిపివేసే ప్రసక్తిలేదని, అవసరమైతే యాగానికి అయ్యే ఖర్చంతా తానే భరిస్తానని వి.సి. యాగం నిర్వహించండి మీకు అండగా ఉంటామని ఎబివిపి నాయకులు ప్రకటించారు. డబ్బు తనది కావచ్చేమో కాని (అది కూడా ప్రజలు చెల్లించే పన్నుల నుండి వస్తుందని ఆయన గమనించడంలేదు). యాగం నిర్వహించాలనుకుంటున్న స్థలం తనది కాదని, అది ఉన్నత పరిశోధనలకు, భావాలకు, కుల, మత, ప్రాంతీయ సంకుచిత పరిధులకు మించిన విశాల విశ్వవిద్యాలయమనే విషయాన్ని



ఆయన మరచిపోయారు. బోధన, పరిశోధన, విస్తరణ అనే మూడు రూపాలుగా పనిచేయడం విశ్వవిద్యాలయాల కర్తవ్యమని, ఈ కర్తవ్యాల అమలు, పర్యవేక్షణ బాధ్యతలను చూడాలిగాని, తన వ్యక్తిగత విశ్వాసాల ఆధారంగా యజ్ఞాలు, యాగాలు, బలులు, జాతరలు చేసుకోవడానికి కాదనే విషయాన్ని ఆయన గుర్తించాలి. సైన్స్ రంగంలో పరిశోధనలుచేసి ఈ స్థాయికి చేరుకున్న యూనివర్సిటీ ఉన్నత అధికారులే... మానవ మరణాలకు యాగాలు విరుగుడని భావించే స్థితికి దిగజారితే ఇక సమాజానికి దిక్కెవరు? విద్యను కాషాయీకరణ చేయాలనే బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ భావజాల ప్రభావం ఎంత తీవ్రంగా విద్యాలయాల్లోకి చొరబడుతున్నదో అందునా విశ్వవిద్యాలయాల్లోకి ఎంత వేగంగా వస్తున్నదో ఈ ఘటన తెలియచేస్తోంది. బీజేపీ బలంగా ఉన్నచోటే దాని భావజాల ప్రమాదం ఎక్కువగా ఉంటుందనుకునే వారికి ఈ పరిణామం ఒక హెచ్చరిక.

మృత్యుంజయ యాగం చేయాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ అధికారులు ప్రయత్నించడం మొదలూ కాదు, ఆఖరూ కాదు. గతంలో మన ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్య దోణప్ప వైస్ ఛాన్సలర్‌గా ఉన్న కాలంలో జ్యోతిష్యాన్ని డిగ్రీ, డిప్లమో కోర్సులుగా ప్రవేశపెట్టారు. దీనిపై పెద్ద వివాదం జరిగి చివరకు ప్రముఖ కవి సి.నారాయణరెడ్డి హయాంలో జ్యోతిష్యం నిరూపితమైన శాస్త్రం కాదని తొలగించారు. అప్పుడు కూడా మతతత్వవాదులు అల్లరి చేశారు. ట్రినిటి కాలేజికి చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ సెక్యులరిజం ఇన్ సొసైటీ అండ్ కల్చర్', భారత దేశానికి చెందిన 'సెంటర్ ఫర్ ఎంక్వైరీ' కలిసి దీనిపై పరిశోధన చేశాయి. 130 సంస్థలకు చెందిన 1100మంది సైంటిస్టుల మీద చేసిన సర్వేని ప్రకటించాయి. ఇందులో 24శాతం మంది దైవాంశ సంభూతులు ఉన్నారని, వారు అద్భుతాలు సృష్టిస్తారని, 49శాతం మంది ప్రార్థనల వల్ల ప్రయోజనం ఉంటుందని, 16శాతం మంది విశ్వాస స్వస్థతపై నమ్మకం ఉందని, 14శాతం మంది వాస్తుపై, మరో 14శాతం మంది జ్యోతిష్యంపై నమ్మకం ఉందన్నారని నివేదిక తెలిపింది. ఇలాంటి సర్వే నివేదికలు చూసేనేమో 'దేశంలో 90శాతం మంది మూర్ఖులు ఉన్నారని' జస్టిస్ మార్కండేయ కట్జూ ఆవేదన చెందారు. 'యూనివర్సిటీలో యాగం వద్దు' అనే కనీస రాజ్యాంగ స్ఫూర్తిని సహించ లేకున్నాయి. సరస్వతీ పూజలు, విగ్రహాల ఏర్పాటు, జన్మాష్టములు, తల్లిదండ్రులకు పాదాభివందనం లాంటి అనేక ముసుగులతో విద్యాలయాల్లోకి ఆర్ఎస్ఎస్ చొరబడి చిన్న వయసులోనే విషబీజాలు నాటేందుకు ప్రయత్నిస్తున్నది. విశ్వవిద్యాలయాలను తమ కబంధ హస్తాల్లోకి తీసుకోవాలని యూజీసీ లాంటి సంస్థల్లో తమ మనుషులను నియమించి వారి ద్వారా ఈ రకమైన యజ్ఞయాగాలు, క్రతువులు చేయిస్తున్నది. రాష్ట్ర పాలకులు ఈ ప్రమాదకరమైన పోకడలను మొగ్గలోనే అడ్డుకోకపోతే ప్రజల ఐక్యతకు, రాజ్యాంగ స్ఫూర్తికి తీరనిద్రోహం చేసినవారవుతారు.

-వి. రాంభూపాల్

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- దేశానికి దిక్సూచి సీఎం కేసీఆర్

- ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు

నవతెలంగాణ-బూర్గంపాడు

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతా రావు అన్నారు. బుధవారం మండలంలోని మోరంపల్లి బంజర గ్రామంలో 27 లక్షల 14 వేల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన గిడ్డంగిని, 13 లక్షల 28 వేల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన రైతు శిక్షణ కేంద్రాన్ని, ఇరవెండి గ్రామంలో స్థలదాత తాళ్ళూరి పంచాక్షరయ్య సహకారంతో 36 లక్షల 21 ఒకవేల రూపాయలతో నిర్మించిన గిడ్డంగిని రేగా కాంతారావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా డిసిసిబి చైర్మన్ కురాకుల నాగభూషణం ల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రేగా మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు. రైతుల అసంఘటితం కోసమే రైతు వేదికలు ఏర్పాటు చేశామన్నారు. అన్నదాత సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం సాగుకు 24 గంటలు ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని ఆయన అన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చాలా మెరుగుప డుతున్నదని ఆయన పేర్కొన్నారు.

తానా ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం : తానా మాజీ అధ్యక్షుడు తాళ్ళూరి జయశేఖర్

తానా ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తానా మాజీ అధ్యక్షుడు తాళ్ళూరి జయశేఖర్ అన్నారు. ఇరివెండిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో భద్రా చలం నుండి యూరియా బస్తాలు భుజాన వేసుకొని మోసేవాళ్ళు అటువంటి పరిస్థితి ప్రస్తుతం కనిపించకుండా గ్రామంలోని మన మధ్యనే ఈ గోదాం కట్టడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం పలుచోట్ల ఖమ్మంలో భద్రాచలంలో తానా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. తానా ఫౌండేషన్ ద్వారా ముందు ముందు ఇంకెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, పిఏసిఎస్ చైర్మన్ బిక్క సాని శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ పోడియం ముత్యాలమ్మ, గ్రామ సర్పంచులు భూక్య దివ్యశ్రీ,



సిరివరపు స్వప్న, లక్ష్మి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మండల ప్రధాన కార్యదర్శి జక్కం సుబ్రమ్మణ్యం, బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గోనెల నాని, మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేడం లక్ష్మీనారాయణ రెడ్డి, భూపల్లి నరసిం హారావు, బండారు లక్ష్మీనారాయణ, వలదాసు సాలయ్య పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించాలి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ - భద్రాచలం



కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలు వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన వెంటనే దేశ ప్రజలకు గ్యాస్ ధరలు పెంచి కానుక ఇచ్చారని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పేద ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. వంట గ్యాస్ ధరలు పెంచడం వల్ల సామాన్య ప్రజలపై మూయలేని భారం పడుతుందని అన్నారు. పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్న బిజెపికి ప్రజలే గట్టి బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం రేణుక, సరియం కోటేశ్వరరావు, పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి.సంతోష్ కుమార్,ఎన్ లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు బి. కుసుమ, డి సీతాలక్ష్మి, జీవనజ్యోతి, న్. నాగరాజు, జి లక్ష్మణ్, కోరాడ శ్రీనివాస్, శాఖ కార్యదర్శి డి రామకృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు సతీష్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో

మొబైల్ ఆసుపత్రి ఏర్పాటుకు అనుమతించాలి

- కలెక్టర్ అనుదీప్ - ఇంటెలిజెన్స్ నోడల్ అధికారికి విజ్ఞప్తి

నవతెలంగాణ-పాల్వంచ



తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు మొబైల్ ఆసుపత్రి ఏర్పాటు కు అనుమతించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుండి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులు (స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్) మంజూరు వినియోగం పనులు పురోగతి తదితర అంశాలపై ఇంటిలిజెన్స్ నోడల్ అధికారి ప్రభాకర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బోసు గొప్ప సుదూరంగా ఉన్నందున ప్రజలకు వైద్య సేవలకు ప్రజలు రావడానికి దూరంగా ఉందని చెప్పారు. ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు చెన్నారం, పూసగుప్ప క్యాంపులకు కూడా సత్వర వైద్య సేవలు అందించేందుకు మొబైల్ ఆస్పత్రి ఉపయోగపడుతుందని అన్నారు. మన రాష్ట్రంతో పాటు చత్తీస్గఢ్, ఆంధ్రప్రదేశ్ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు వైద్య సేవలు నిర్వహణకు ఆసుపత్రుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఇల్లందు, భద్రాచలం వైద్యశాలలో మాత శిశుసంరక్షణ చర్యల్లో భాగంగా పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భద్రాచలం ఆస్పత్రిలో కంటి వైద్యులు ఉన్నారని పరికరాలు లేకపోవడం వల్ల కంటి చికిత్సలు చేయలేకపోతున్నామని కంటి పరీక్ష పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల సౌలభ్యం కోసం డిజిటల్ పరికరాలు ఏర్పాటు చేశామని, డిజిటల్ ఎక్విప్మెంట్ ఏర్పాటు వల్ల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. చర్ల మండలంలో అడవి అనుమతులు రాకపోవడంతో నిలిచిపోయిన రహదారుల నిర్మాణానికి అనుమతులు కొరకు ప్రిన్సిపాల్ చీఫ్ కన్సలేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ప్రతిపాదన పంపినట్లు చెప్పారు. సమస్య పరిష్కారానికి తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఓఎస్డి అనంత రామకృష్ణ, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమం ద్వారా ప్రజావాణి

సమస్యలు తెలిపిన బాధితులు...

పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.జి

నవతెలంగాణ-కొత్తగూడెం



జిల్లా ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు గాను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.జి బుధవారం డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఎస్పీ కార్యాలయంలో గంట పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు బాధితులు వారి సమస్యలు ఎస్పీ దృష్టికి తీసుకు వచ్చారు. సమస్య పరిష్కారానికి సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ వినీత్ మాట్లాడుతూ డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసునేందుకు వీటుంటుందని చెప్పారు. జిల్లా నలుమూలల నుండి మొత్తం 17 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. బాధితుల సమస్యల పరిష్కారం కోసం వెంటనే అధికారులు చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ సమయంలో ఫోన్ ద్వారా తమ సమస్యలను తెలుసుకోలేని బాధితులు ఎస్పీ కార్యాలయానికి వచ్చి నేరుగా తమని సంప్రదించవచ్చని కోరారు. ఫోన్ ద్వారా ఎస్పీ సమస్యలు తెలుపుకున్న వారిలో భూ తగాదాలు, వ్యక్తిగత, కుటుంబ సమస్యలు, ప్రజా సమస్యల గురించి ఫిర్యాదు చేశారు. వెంటనే సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పదవ తరగతి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

రాష్ట్ర పరిశీలకులు వెంకటరెడ్డి

నవతెలంగాణ-పాల్వంచ

పదవ తరగతి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర పరిశీలకులు యానాల వెంకటరెడ్డి సూచించారు. పదవ తరగతి పరీక్షా సన్నద్ధంపై ఏర్పాటు చేసిన రాష్ట్ర పరిశీలక బృందం బుధవారం పాల్వంచలోని బాలిక ఉన్నత పాఠశాల బుల్లోరు గూడెంలో ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ పిల్లలతో మాట్లాడి విద్యార్థుల పరీక్షలకు ఎలా సన్నద్ధం అవ్వాలో వివరించారు. ఈ బృందంలో సభ్యులు వెంకటయ్య, బాలమురళీకృష్ణతో పాటు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగ రాజశేఖర్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన


నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యుత్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ ప్రకటించాలని, ఆర్టిజన్స్ని వెంటనే కన్వర్ట్ చేయాలని కొత్తగూడెం ఎలక్ట్రికల్ డివిజనల్ కార్యాలయంలో ముందు పెద్దఎత్తున ఉద్యోగులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం లక్ష్మీదేవిపల్లిలోని డివిజనల్ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో టీఎస్పీఇ జేఏసీ ఆద్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. విద్యుత్ సంస్థలో 2022 పీఆర్సీ జాప్యంపై రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిఎస్పీఇ జేఏసీ) పిలుపులో భాగంగా అన్ని డివిజన్ ఆఫీస్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించాలని, ఆర్టిజాన్స్కు కన్వర్షన్ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మోహనరావు, హేమంత్, రాజేష్, పులి గణేష్ బాబు, జి. నరసింహారావు, కూనూరాజు శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

అనేక సంవత్సరాలుగా అంగన్ వాడీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయిందని, అంగన్ వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీడిపిఓ కార్యాలయం ముందు అంగన్ వాడీలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు కళావతి, జ్యోతి, మాధవి, శైలజ, నాగమణి, అరుణ, రాజేశ్వరి, జుబేద, నళిని తదితరులు పాల్గొన్నారు.



www.praja.khammam@gmail.com

నవతెలంగాణ

6 ఖమ్మం

గురువారం 02 మార్చి 2023

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలి

- అదే భగత్ సింగ్ కు ఇచ్చే నిజమైన నివాళి
- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్

నవతెలంగాణ- ఖమ్మం

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే భగత్ సింగ్ ఇచ్చే నిజమైన నివాళి అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ అన్నారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే సందర్భంగా భారత విప్లవ కెరటం భగత్ సింగ్ అనే పుస్తకాన్ని సాంఘిక అధ్యయనం చేశారు. ఈసందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకుపోవటం అంటే ఈనాటి మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమేనని ఆయన అన్నారు. వన్ టౌన్ కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 10న డివైఎఫ్ఐ వన్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జీవిత చరిత్రపైన సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎండి గౌస్, డివైఎఫ్ఐ వన్‌టౌన్ అధ్యక్షులు రావులపాటి నాగరాజు, శభాష్‌రెడ్డి, జూపల్లి విష్ణువర్ధన్, పరిగ లక్ష్మణ్, సుగ్గల గోపి, నవీన్, పవన్ ప్రవీణ్, వర్షిత్, తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారి కొత్త దందా...?

బతికి ఉన్న మనిషిని చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టి...?



- రూ.కోట్ల విలువ చేసే భూమి తన అనుచరులకు రిజిస్ట్రేషన్...!
- భారీగా ముడుపులు అందుకున్న ఓ రెవెన్యూ అధికారి...?
- తప్పు కప్పిపుచ్చుకునేందుకు తీవ్ర యత్నాలు...!
- ఖమ్మంరూరల్ తహశీల్దార్ కార్యాలయంలో భారీ కుంభకోణం వెలుగులోకి...!



నవతెలంగాణ - ఖమ్మంరూరల్

ఏండ్ల తరబడి తన ఆధీనంలో ఉన్న భూమిని ఓ రైతు తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలంటే ధరణీ మయం అంటూ రెవిన్యూ అధికారులు నానా సాకులు చెప్పి తప్పించుకుంటారు...వారికి పెద్ద మొత్తంలో ముడుపులం దిస్తే మాత్రం...ఏకంగా బతికున్న మనిషిని చంపేసి వారి పేరుతో "డెత్ సర్టిఫికెట్" సృష్టించి కోట్ల రూపాయల భూములను వారి అనుచరులకు కట్టబెట్టే పని సులువుగా చేసి పెడతారు...

బతికి ఉన్న మనిషిని చంపేసి రిజిస్ట్రేషన్...?

ఖమ్మం రూరల్ మండలం తనగంపాడు రెవెన్యూ పరిధిలోని ఓ సర్వే నంబర్‌లోని 5 ఎకరాల భూమి ఓ వ్యక్తి పేరుపై ఉంది. అట్టి భూమిని బ్రోకర్ల ద్వారా నేలకొండపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనుగోలు చేశాడు. అ భూమి గల వ్యక్తి దూర ప్రాంతంలో స్థిరపడ్డాడు. అయితే ఆ భూమి తన పేరుతో ఉందన్న విషయం అతనికి కూడా తెలియదు. ఆ బతికి ఉన్న వ్యక్తి చనిపోయినట్లు ఆన్లైన్లో "డెత్ సర్టిఫికెట్" సృష్టించి అనంతరం ఆ భూమి యజమానికి ఓ దత్తత కుమారుడిని సృష్టించారు...ఆ దత్తపుత్రిడి ద్వారా సుమారు "5" ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు... అయితే ఈ తంతంగానికి కర్త....కర్మ...క్రియ అంతా ఓ రెవెన్యూ అధికారి అని విశ్వసనీయ సమాచారం... బతికున్న మనిషిని చంపేసి ఓ దత్తత కుమారుడిని సృష్టించి నకిలీ డెత్ సర్టిఫికెట్ తయారు చేయిస్తే రిజిస్ట్రేషన్ చేసి పెడతానని చెప్పడంతో వెంటనే వారు నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసుకుని ఆ అధికారి చేతిలో పెట్టారు. అనంతరం రిజిస్ట్రేషన్ జరిగి వారి చేతిలో పాస్ పుస్తకం పెట్టి పెద్ద మొత్తంలో ముడుపులు అందుకున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి...ఇది అంతా ధరణీ "శ్రీ" మయం....

ఈ భూమి విషయంలోనే రియల్టర్ ఆత్మహత్యా యత్నం.....?

తనగంపాడు రెవిన్యూ పరిధిలోని భూమిని నేలకొండపల్లి ప్రాంతానికి చెందిన ఓ రియల్టర్ బ్రోకర్ల ద్వారా భూమి కొనుగోలు చేశాడు.. అయితే అట్టి భూమి విషయంలో అంతా మోసం జరిగిందని అసలు అక్కడ భూమే లేదని.... అంతే కాకుండా ఆ భూమికి సంబంధించిన వ్యక్తులు ఉన్నా సరే ఎవరు లేరని ఓ దత్త పుత్రుడిని సృష్టించి ఆ భూమిని తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ తరువాత ఆ భూమికి సంబంధించి పూర్తిగా తెలుసుకున్న సదరు రియల్టర్ తాను నిలువునా మోసపోయానని గ్రహించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డట్లు సమాచారం..దీనికి అంతటికి ఓ "వెబ్ పత్రికలో" పనిచేసే వ్యక్తితో పాటు మరో వ్యక్తి కలిసి తనను మోసం చేశారని లబోదిబోనని పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం...ఆ తరువాత సదరు వ్యక్తులు ఆ వ్యాపారిని నానా విధాలుగా మచ్చిక చేసుకొని తాము తీసుకున్న డబ్బులకు మరికొంత కలిపి ఇస్తామని చెప్పడంతో సదరు వ్యాపారి శాంతించినట్లు సమాచారం...

> ప్రయివేటు భూములు కానీ, ప్రభుత్వ భూములు కానీ, ఎవరి పేరుతో ఉన్న భూములైనా సరే, అవసరమైతే అట్టి భూ యజమానులు బతికి ఉన్నా వారు చనిపోయినట్లు సృష్టించి వారి భూములను కావాల్సిన వారికి ఇట్టే రిజిస్ట్రేషన్ చేసే వెసులుబాటు ఉంది....అలా కావాలనుకునేవారు ఎవరైనా ఉంటే వెంటనే ఖమ్మంరూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించగలరు....! ఇదేంటి అనుకుంటున్నారా...ఇది ముమ్మాటికి నిజం.....

అధికారి తప్పుకప్పి పుచ్చుకునేందుకు యత్నం.....?

బతికి ఉన్న మనిషిని చంపేసి అతని పేరుతో నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకొని భూమి రిజిస్ట్రేషన్ చేసి పెట్టిన విషయం బట్టబయలు అవ్వడంతో ఈ నకిలీ దందాకు సూత్రధారి అయిన సదరు రెవిన్యూ అధికారి తను చేసిన తప్పును కప్పి పుచ్చుకునేందుకు ఉన్నతాధికారులకు దొరకకుండా ఉండేందుకు తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు విశ్వసనీయ సమాచారం...అందులో భాగంగా దొంగే "దొంగ- దొంగ" అన్నట్లు... తాను చేసిన "తప్పును పక్కకు పెట్టి నకిలీ సర్టిఫికెట్లతో తనను మోసం చేశారని సదరు అధికారి ముందస్తుగా వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం...ఈ విధంగా చేయడం వలన సదరు అధికారి తప్పించుకోవచ్చు అనుకున్నారేమో కానీ ఎలాంటి విచారణ జరగకముందే సదరు అధికారి అవి నకిలీ సర్టిఫికెట్లు అని తేల్చి చెప్పి, వాటిని ఆ అధికారే బయటపెట్టి ఆ అధికారి తనకుతానే దొరికిపోయినట్ల యిందని నాలుకకరుచుకున్నట్లు సమాచారం......?

అధికారిపై మొదలైన విచారణ.....?

బతికి ఉన్న మనిషిని చనిపోయినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో కోట్ల రూపాయల భూమిని పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసిన విషయం జిల్లా కలెక్టర్ గౌతమ్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. దీంతో జిల్లా అధికారులు సదరు అధికారిపై విచారణ ముమ్మరం చేసినట్లు విశ్వసనీయ సమాచారం...అట్టి భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తి, చేయించుకున్న వ్యక్తి, నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసిన వ్యక్తులపై కూడా విచారణ జరుగుతున్నట్లు సమాచారం...!

దీనిపై ఖమ్మంరూరల్ తహశీల్దార్ తాళ్లూరి సుమను వివరణ కోరగా తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన కాపీలను ఆర్‌డిఓ, కలెక్టర్‌కు సమర్పించడం జరిగిందని, దీనికి సహకరించిన రెవెన్యూ సిబ్బందిపై ప్రతి ఒక్కరిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

నవతెలంగాణ - బోనకల్



గ్రామపంచాయతీలలో అన్ని రకాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్ కోరారు. మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల, ఈజీఎస్ సిబ్బంది తో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఉపాధిహామీ పథకం పనులలో కూలీలను ఎక్కువ సంఖ్యల సమీకరణ చేయాలని కోరారు. కంపోస్ట్ ఎరువు ఉత్పత్తి, కంపోస్ట్ షెడ్‌ను తప్పనిసరిగా వినియోగించాలని కోరారు. ఇంటి పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని కోరారు. అందుకు అవసరమైన రసీదు పుస్తకాన్ని తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 10 గంటలకు డిఎస్ఆర్ పూర్తి పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం మన ఊరు మన బడి కింద చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ పనుల కింద చేపట్టిన అభివృద్ధి పనులను ఎట్టి పరిస్థితులలోనూ జాప్యం చేయరాదని కోరారు. కలెక్టర్ మన ఊరు మన బడి కింద చేపట్టిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారని తెలిపారు. సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి మలినీడి ఇందిరా జ్యోతి ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి ఏఈ మొండితోక నవీన్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, విద్యా కమిటీ చైర్మన్‌లు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు ఆఖరి ఎకరం వరకూ వస్తాయి

జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు

నవతెలంగాణ - బోనకల్



ఆఖరి ఎకరం వరకూ సాగర్ జలాలను అందిస్తామని, రైతులెవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. రైతులకు సాగునీటి విషయంలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిదని, రైతులు అధైర్యపడొద్దన్నారు. బోనకల్ మండల కేంద్రంలో బోనకల్ యూత్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిసిన బిపిఎల్(బోనకల్ ప్రీమియర్ లీగ్)ను బుధవారం కమల్ రాజు ప్రారంభించారు. అనంతరం బోనకల్ రైతులు, ప్రజాప్రతినిధులు సాగర్ కాలువ సమస్యలను కమల్ రాజుకి వివరించారు. దీంతో ఆయన సమస్యలను చూడటానికి నేరుగా సాగర్ కాల్వలకు వెళ్ళి బీబీసీ, అళ్ళపాడు, రావినుతల, చిరునోముల, పోలంపల్లి, లింగాల, వత్సవాయి బ్రాంచ్ కెనాల్‌లను అధికారులు, రైతులతో పరిశీలించారు. నేరుగా రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగునీటి సమస్యతో మొక్కజొన్న పంట ఎండిపోతున్న విషయాన్ని ఆయనకు వివరించారు. ప్రస్తుతం బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు 1100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, మరో రెండు మూడు రోజుల్లో 1370 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారని కమల్‌రాజు తెలిపారు. ఆయన వెంట కల్లూరు, చింతకాని, మధిర, సత్తుపల్లి డిఈలు మరియన్న, శ్యాం ప్రసాద్‌రెడ్డి, నాగ బ్రహ్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, మండల ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, రైతు బంధు మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్‌రావు, ఆ పార్టీ నాయకులు కాకాని శ్రీనివాసరావు, చావా హనుమంతరావు, బనావత్ కొండ, కొమ్మినేని ఉపేందర్, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ సానుభూతిపరుడు మృతి

నవ తెలంగాణ - బోనకల్



ముష్టికుంట గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ సానుభూ తిపరుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గూనగుంట్ల అంతోని (80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఆంతోని ముష్టికుంట గ్రామంలో సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేవాడు. మృతదేహంపై డిసిసిబి మాజీ డైరెక్టర్ జెట్టి బాలశౌరి సిపిఎం జెండాను కప్పి నివాళులు అర్పించారు. మృతదేహాన్ని సిపిఎం గ్రామ కమిటీ కార్యదర్శి గొప్ప కొరివి వీరభద్రం, శాఖా కార్యదర్శులు షేక్ నజీర్, బొడ్డుపల్లి కోటేశ్వరరావు, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ హస్సేన్, సిపిఎం మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, నాయకులు పిల్లలమర్రి వెంకట అప్పారావు, బూర్గుల అప్పచారి, దూబ భద్రాచలం, కొమ్మినేని సీతారాములు, మాజీ సర్పంచ్ కొమ్ము శంకర్ రావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

కూలింగ్ మినరల్ వాటర్ ప్రారంభం

నవతెలంగాణ- కల్లూరు

వేసవిలో ప్రయాణించే ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు కూలింగ్ మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి తెలిపారు. కల్లూరు నూతన బస్టాండ్‌లో బుధవారం రాజ్యలక్ష్మి సూపర్ మార్కెట్ అధినేత కందుల వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు రఘువీర్, రమేష్‌ల సహకారంతో ఏర్పాటు చేసిన కూలింగ్ మినరల్ వాటర్ ఫ్రిజ్‌ను స్థానిక ఎస్సై రఘుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎస్సై రఘును శాలువాతో డిఎం రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పి.విజయ శ్రీలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి సభ్యులు లక్కినేని రఘు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు చలువాది నగేష్, దారా సురేష్, ఆర్టీసీ సిబ్బంది కిన్నెర ఆనందరావు, మరకల రత్నాకర్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ చందూకి జాతీయస్థాయి పురస్కారం

ఖమ్మం కార్పొరేషన్ :ఖమ్మం జిల్లాకు చెందిన ఫొటోగ్రాఫర్ చందూకి జాతీయ స్థాయి పురస్కరం లభించింది. వనపర్తి ఫొటొగ్రఫీ సోసైటీ వారి ఆధ్వర్యంలో పాపికొండల ప్రాంతంలో జాతీయస్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. రెండురోజులపాటు జరిగిన ఈ వర్క్ షాప్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 35 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి గాంచిన కొమ్ము, కోయ నృత్యాలు, మత్స్యకారుల జీవనశైలీపై వర్క్ షాప్ జరిగింది. ఈ వర్క్ షాప్ లో నిర్వహించిన స్పాట్ ఫొటో కాంపిటీషన్‌లో చందూ తీసిన చిత్రానికి బంగారు పతకం లభించింది. బండి రాజన్ బాబు మెమోరియల్ గోల్డ్ మెడల్ పేరుతో ఈ బహుమతిని వర్క్ షాప్ నిర్వాహకులు చందూకి జాతీయ బహుమతి ని అందజేశారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన చందూని పలువురు ప్రముఖులు అభినందించారు.

విద్యుత్ శాఖ ఉద్యోగుల నిరసన

వైరా : రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ శాఖ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు వైరా డివిజన్ ఆఫీస్ ముందు లంచ్ మోషన్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి ఆఫీస్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ విద్యుత్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవటంలో విఫలమయ్యారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పిఆర్‌సి కోసం ఆందోళనలు, విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ నిర్లక్ష్యం చేయటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైరా డిఈఈ కృష్ణ, జేఏఓ మల్లమ్మ, మాధురి మంజుల, యుడిసి శ్రీధర్, మోహన్‌రావు, కృష్ణమూర్తి, 1104 యూనియన్ ప్రెసిడెంట్ కర్లకంటి శ్రీనివాసరావు, సెక్రెటరీ శాఖమూడి కోటేశ్వరరావు, 327 యూనియన్ ప్రెసిడెంట్ నర్సిరెడ్డి, సెక్రెటరీ వెంకటేశ్వరావు, సిఐటియు ప్రెసిడెంట్ అక్కిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్టిజన్స్ గోపాలొరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జేఈఈ మెయిన్స్‌లో 'హార్వెస్ట్'కు అత్యుత్తమ ఫలితాలు

నవతెలంగాణ-ఖమ్మం



జేఈఈ మెయిన్స్ ప్లానింగ్, బి.ఆర్క్ ఫలితాలలో 'హార్వెస్ట్' కు అత్యుత్తమ ఫలితాలు సాధించారని హార్వెస్ట్ కళాశాల కరస్పాం డెంట్ పి.రవి మారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతిరెడ్డి తెలిపా రు. ఇంజనీరింగ్ విద్యన భ్యసించుటకు ఎన్.టి.పి వారు దేశవ్యాప్తంగా నిర్వహించే జెఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షాఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కరబరచి ఉన్నత ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. జేఈఈ మెయిన్స్ 2023 ప్లానింగ్. బి.ఆర్క్ ఫలితాల్లో తమ విద్యార్థులు వరుసగా 99.93, 99,39, 99.33, 99.28, 95.5, 95,1, 94.8, 92.6, 90.8, 90.3 పర్సంటైల్స్ సాధించి అగ్రస్థానంలో నిలిచారన్నారు. ర్యాంకులు సాధించిన వారిలో ఉదారపు మోహన్‌సాయి, మణిదీప్, తేళ్ళ చేతన్ తన్మయి, సి హెచ్.షన్ముఖ నిరూప్, చల్లా మహేష్, ఎల్. ప్రహ్లద్, కె.నవదీప్‌లు వరుసగా ర్యాంకులు సాధించారన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయు

నవ తెలంగాణ-ఖమ్మం రూరల్



అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, తెలంగాణ అంగన్వాడీ వర్కారు అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. కోటేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మొదటి రోజు మండల పరిధిలో పెద్దతండాలోని తిరుమలాయపాలెం ప్రాజెక్టు ఖమ్మంలోని ఖమ్మం రూరల్ ప్రాజెక్టుల ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం సీడీపీవోలకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు విష్ణు, నాయకులు మోహన్‌రావు, వీరన్న, రాధా, అన్నపూర్ణ, పద్మ, సారిక, జయమ్మ పాల్గొన్నారు.

రేపు హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద

అగ్రిగోల్డ్ బాధితుల ధర్నా



- హాజరుకానున్న పలు రాజకీయ పార్టీల రాష్ట్ర నాయకులు
- అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత

నవతెలంగాణ-వైరాటౌన్

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరుతూ తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ (ధర్నా చౌక్) వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత కోరారు. బుధవారం తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలో ఉన్న అగ్రిగోల్డ్ సంస్థలకు చెందిన ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని రాష్ట్రంలో ఉన్న అగ్రిగోల్డ్ బాధితులు అందరికీ డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జరిగే అగ్రిగోల్డ్ బాధితుల ధర్నాలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. సిపిఐ(ఎం), సిపిఐ, కాంగ్రెస్, టిడిపి, బి.ఎస్.పి, సిపిఐ ఎంఎల్ (ప్రజాపంథా) తదితర అఖిలపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు ధర్నాకు సంఘీభావం తెలిపేందుకు వస్తున్నారని అన్నారు. కావున అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్లు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటింటికీ తెలుగుదేశం శ్రేణులు

సత్తుపల్లి రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటికి తెలుగుదేశం, గడగడపకి గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో చేసిన అభివృద్ధి పనులు అనే కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా.. బుధవారం మండల పరిధిలోని రామానగరం గ్రామంలో ఈ కార్యక్రమం ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రూరల్ కన్వీనర్ బొంతు శ్రీనివాసరావు, ఆ పార్టీ మండల కమిటీ కన్వీనర్లు బండారు చిన్నబాబు, కోట సత్యనారాయణ, బొందల లక్ష్మణ్, రాజులపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాదరణ తట్టుకోలేకనే దాడులు

- అధికారం ఎవరి సొత్తూ కాదు
- రేవంత్ రెడ్డిపై దాడి అమానుషం
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం

భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ యాత్రకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే టీఆర్ఎస్ అల్లరి మూకలు దాడులకు పాల్పడుతున్నాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ అన్నారు. బుధవారం ఖమ్మంలోని రేవంత్ రెడ్డిపై దాడిని నిరసిస్తూ పాత బస్టాండ్ సెంటర్‌లో కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రేవంత్ రెడ్డి యాత్రకు భంగం కలిగించేందుకు స్థానిక ఎమ్మెల్యే తన టీఆర్ఎస్ రౌడీలతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. అధికారం ఉందని దాడులకు చేయడం సిగ్గు మాలిన చర్య అని అన్నారు. అధికారం ఎవరి సొత్తూ కాదని హితవు పలికారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు, ఖమ్మం నియోజకవర్గ పిసిసి సభ్యులు మహ్మద్ జావేద్, పాలేరు నియోజకవర్గ పిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్కా శేఖర్ గౌడ్, నగర కాంగ్రెస్ కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు, నగర మైనారిటీ, ఓబిసి సెల్ అధ్యక్షులు షేక్ అబ్బాస్ బేగ్, బాణాల లక్ష్మణ్, జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఏలూరి రజని, నగర మహిళా కాంగ్రెస్ నాయకులు పుష్ప, భూక్యా బాలాజీ, జిల్లా ఓబిసి సెల్ నాయకులు బోయినపల్లి వేణు, నగర కాంగ్రెస్ నాయకులు సంపటం నరసింహారావు, పూర్ణ, శంకర్‌నాయక్, గడ్డం వెంకటయ్య, తవిడబోయిన రవి, నూకారపు వెంకటేశ్వేరారావు, జహీర్ పాల్గొన్నారు.

135 శాతం బొగ్గు ఉత్పత్తి

వివరాలు వెల్లడించిన జీఎం

నవతెలంగాణ-ఇల్లందు

ఫిబ్రవరి నెలకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 2.70లక్షల టన్నులకు గాను 3.635లక్షల టన్నుల బొగ్గు తీసి మొత్తం 135 శాతం ఉత్పత్తి చేశామని జియం ఎం.షాలేమురాజు అన్నారు. ఏరియా జీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఫిబ్రవరి నెల బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత వివరాలను వెల్లడించారు. 3.14 లక్షల టన్నుల బొగ్గు రైల్వే మార్గం ద్వారా, 0.86 లక్షల టన్నులు రోడ్డు మార్గం ద్వారా, ఆర్‌సిహెచ్‌పి ద్వారా 1.29లక్షల టన్నులు మొత్తం 5.29లక్షల టన్నుల బొగ్గు బట్వాడా చేయడం జరిగిందని తెలిపారు. జనవరి నెలలో 86 రేకుల ద్వారా బొగ్గు రవాణా చేసామని తెలిపారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయడం పట్ల సంబంధిత అధికారులు ఉద్యోగులను, సూపర్వైజర్లను జి.యం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో యస్వోటు జియం మల్లారపు మల్లయ్య, ఎజియం(ఇఅండ్ఎం) జి.ప్రభాకర్ రావు, ఏ.జి.ఎం(ఐ.ఇ.డి)యం.గిరిధరరావు, డిజిఎం(పర్సనల్) జివి.మోహన్ రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయిస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

హాజరైన తమ్మల, మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట



మండలం లోని రంగువారిగూడెం గ్రామంలో బుధవారం శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, బొడ్డురాయి ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ఇల్లందు మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వర్లు, ఇల్లందు మాజీ జెడ్పీటీసీ వీరేందర్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి రామచంద్ర ప్రసాద్, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జున్ రావు, ఎంపీటీసీ చలపతి రావు,ఆళ్ళ జంగం, దమ్మపేట ఉప సర్పంచ్ దారా యుగంధర్ పాల్గొన్నారు.

మరోసారి 'బండ' బాదుడు..

పెరిగిన గ్యాస్ ధరలు

నవతెలంగాణ-ఇల్లందు



బీజేపీ పాలన మోడీ ప్రభుత్వంలో పేదలు ప్రజలు అన్ని రకాలుగా అతలాకుతలమవుతున్నారు. ముఖ్యంగా ప్రతినెలా గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. వంట గ్యాస్ వినియోగదారులపై మరోసారి ఆర్థికభారం పడింది. మోడీ ప్రభుత్వ విధానాల మూలంగా గ్యాస్ ధరలను పెంచుతూ పెట్రోలియం సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. వంట గ్యాస్ సిలిండర్‌పై 50 వరకు పెంచేయగా.. వాణిజ్య సిలిండర్ ధర రూ.350.50 బాదేశారు. నిన్నటిదాకా గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర హైదరాబాద్‌లో రూ.1,105 ఉండగా తాజా పెంపుదలతో రూ.1,155 అయ్యింది. వాణిజ్య సిలిండర్ ధర ఢిల్లీలో రూ.2119.50కు ఎగబాకింది. పెరిగిన గ్యాస్ ధరలు మార్చి ఒకటో తేదీ నుంచే అమల్లోకి వచ్చాయి. ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, ప్యాసింజర్ టికెట్లు రద్దుచేసి అదే రైళ్లలో ఎక్స్‌ప్రెస్ టికెట్లు, నిత్యావసర సరకులు, విద్యుత్తు ఛార్జీలు పెంపుతో సామాన్య మధ్యతరగతి కుటుంబాలు అల్లాడుతున్నాయి. తాజాగా పెరిగిన ధరలతో ఆ భారం మరింత పడనుంది. మరోసారి కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరలు ఎన్నో రేట్లు పెరిగే అవకాశం ఉంటుందని పరిశీలకులు అంటున్నారు.

నేడు, రేపు కలెక్టరేట్ ఎదుట దీక్ష

- అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్

జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకర పద్మ

నవతెలంగాణ పాల్వంచ



అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలపై గురు, శుక్రవారం 36 గంటల పాటు కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే దీక్షలను జయప్రదం చేయాలని అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకర పద్మ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ దీక్షలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.విజయలక్ష్మి ప్రారంభించనున్నారని చెప్పారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఐసీడీఎస్‌ని నీరుగార్చే విధంగా గత 8 సంవత్సరాల కాలంలో బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తున్నరన్నారు. 2018 నుండి కేంద్రం మించిన వేతనాలను ఇవ్వడం లేదన్నారు. ఐసిడిఎస్‌ని ప్రయివేట్ పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని వీటికి వ్యతిరేకంగా సమ్మె జరుగుతుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కనీస వేతనాన్ని 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. రిటైర్మెంట్ బెన్ ఫీట్స్, పెన్షన్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేస్తున్నామని చెప్పారు.

ప్రయివేట్ ఎలక్ట్రికల్, టెక్నీషియన్స్ సమావేశం

నవతెలంగాణ-భద్రాచలం

పట్టణంలోని గిరిజన అభ్యుదయ భవనంలో బుధవారం తెలంగాణ ప్రయివేట్ ఎలక్ట్రికల్, టెక్నీషియన్స్ ఫెడరేషన్ భద్రాచలం యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎలక్ట్రికల్ టెక్నీషియన్ పెద్ద సంఖ్యలో పాల్గొనగా ముఖ్య అతిథిగా డాక్టర్ తెల్లం వెంకటరావు పాల్గొని వారి సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సుధాకర్, రమాకాంత్, నవాబ్, రజినీకాంత్, బంబోతుల రాజీవ్, వెంకట్, విజయ్, గంగా భారతి, లక్ష్మీబాయి, లక్ష్మీకాంతం కార్యకర్తలు పాల్గొన్నారు.


రామభక్తులకు ఇకనుంచి ఉచిత మజ్జిగ

నవతెలంగాణ - భద్రాచలం

భద్రాద్రి రామయ్య సన్నిధికి రామయ్య దర్శనం కోసం వచ్చే భక్తులకు బుధవారం నుంచి ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆలయ ఏఈవోలు శ్రావణ్ కుమార్, భవాని రామకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ సాయిబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు, వేద పండితులు ప్రసాద్, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏరియాలో పర్యటించిన ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ

నవతెలంగాణ-ఇల్లందు



రాష్ట్ర ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ ఐఎఎస్ బుధవారం సింగరేణి ఏరియాలో పర్యటించారు. జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు స్వాగతం పలికారు. ఆ తరువాత శాలువాతో ఘనంగా సన్మానించారు. తదనంతరం వారు ఇల్లందు ఏరియాలోని వివిధ గనులకు సంబంధించిన రోజువారి బొగ్గు ఉత్పత్తి, రవాణాలతోపాటు, ఇల్లందు ఏరియాలోని సోలార్ విద్యుత్ ప్లాంట్ ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యస్వోటు జియం మల్లారపు మల్లయ్య, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీనివాసు, ఎస్టేట్ అధికారి మహేశ్వర్, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో జెడ్పీ చైర్మెన్ పర్యటన

నవతెలంగాణ-ఇల్లందు



జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా సుడిగాలి పర్యటన నిర్వహించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. టేకులపల్లి మండలం,బేతంపూడి సర్పంచ్ యధల్లపల్లి బాబు మనువళ్ల పంచెకట్టు వేడుకకు హాజరై చిన్నారులు పూజిత్, హనుమంత్ లను ఆశీర్వదించారు. ఇల్లందు పట్టణంలోని జగదాంబ సెంటర్ ఏరియాకు చెందిన బైక్ మెకానిక్ ఇన్నాబాబా గుండెపోటుతో మృతి చెందగా వారి పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఇందిరా నగర్ గ్రామ పంచాయతీకి చెందిన ముత్యాల ముత్తమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. లచ్చగూడెం గ్రామపంచాయతీ, ఏపలగడ్డ గ్రామానికి చెందిన చింతా నరసింహారావు అనారోగ్యంతో మృతిచెందగా వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో పర్యటించారు. ఆయన వారివెంట సర్పంచులు పాయం లలిత, పాయం స్వాతి, తాటి చుక్కమ్మ, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణ ప్రసాద్, మహిళా నాయకురాళ్ళు చిల్లా విజయ పాల్గొన్నారు.

నిరుపేద వికలాంగునికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-పాల్వంచ



లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ అధ్యక్షులు లయన్ చాట్ల శ్రీనివాసరావు తన పుట్టినరోజు శుభ సందర్భంగా ఒక నిరుపేద వికలాంగునికి పదివేల రూపాయలు తన జీవన ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 320 ఈ మైక్రో కమిటీ చైర్ పర్సన్ ఆరుద్ర సత్యనారాయణ మాట్లాడుతూ నేటి తరానికి ఆదర్శంగా నిలిచేటటువంటి కార్యక్రమాలు చేస్తున్నటువంటి చాట్ల శ్రీనివాసరావుకి క్లబ్ తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరుద్ర మాట్లాడుతూ చాట్ల శ్రీనివాసరావుకి తనకున్నటువంటి ఆర్థిక స్తోమతతో ఎంతో ఘనంగా తన పుట్టినరోజు కార్యక్రమం ఘనంగా నిర్వహించుకునే అవకాశం ఉన్నప్పటికీ తను దివ్యాంగ సోదరుల మధ్య తన బర్త్డే జరగాలని ఆకాంక్షించటం అభినందనీయం, వారు మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ ప్రెసిడెంట్ పుట్టా నాగేశ్వరరావు సెక్రెటరీ పోటు సతీష్, చేపూరి బ్రహ్మచారి, కాటా నవీన్, వట్టి కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా..

సొసైటీ ముసుగులో మిషన్‌తో లోడింగ్

- పట్టించుకోని మైనింగ్ శాఖ
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలి
- సీపీఐ(ఎం) డివిజన్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ

నవతెలంగాణ-చర్ల

గోదావరి సాక్షిగా నిబంధనలకు నీల్లొదిలారు. చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెం పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన శ్రీ లక్ష్మీ మహిళా సాండ్ క్వారీ ట్రైబల్ లేబర్ కాంట్రాక్ట్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఇసుక ర్యాంపులో అక్రమ ఇసుకతోలకాలకు తెరలేపారు. అర్ధరాత్రి గోదావరిలో జేసిబి, టిప్పర్ల సహాయంతో ఇసుక తోలకాలు సాగిస్తున్నారు. ఈ సొసైటీకి 98 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తోలకాలకు అనుమతులు మంజూరైనాయి. ఇట్టి ఇసుకను గోదావరి నుండి కూలీల ద్వారా ట్రాక్టర్ల సహాయంతో ప్రభుత్వం సూచించిన డపింగ్ ప్రాంతంలో నిల్వచేసి అక్కడ నుండి లారీల ద్వారా లోడింగ్ చేసి తరలించాలి. కాని ఇక్కడ ర్యాంపు నిర్వాహకులు సొసైటీ సభ్యులను తమ చెప్పుచేతల్లో పెట్టుకొని అర్ధరాత్రి నేరుగా గోదావరిలోకి మిషన్లను దింపి టిప్పర్ల సహాయంతో ఇసుకను డపింగ్ చేయడం గమనార్హం.ఇదేమిటని అడిగిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారని తెలిసింది. సొసైటీ ముసుగులో అర్ధరాత్రి జరుగుతున్న అక్రమ రవాణాపై అటు మైనింగ్ శాఖ అధికారులు కాని ఇటు రెవెన్యూ శాఖ వారు కాని పట్టించుకోకపోవడంలేదు. ఇసుక అక్రమ వ్యాపారులు ఇచ్చే ముడుపులకు ఆశపడిన అధికారులు నిబంధనలు విరుద్ధంగా ఇసుక తోలకాలు సాగిస్తున్నా చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. తెలంగాణా ప్రభుత్వం ఇసుక ర్యాంపుల నిర్వహణ గిరిజన సొసైటీల ద్వారా నిర్వహిస్తే ఆయా పంచాయతీల అభివృద్ధితో పాటు గిరిజనులకు ఉపాధి కలుగుతుందని ఎంతో సదుద్దేశంతో సొసైటీలను ఏర్పాటు అందులో గ్రామస్తులను భాగస్వామ్యం చేసింది. దీని ద్వారా పంచాయతీలో ఉన్న సభ్యులతోపాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరు తుంది. ట్రాక్టరులకు లేబర్‌కి ఉపాధి సైతం కలుగుతుంది. ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో చేపట్టిన ఇసుక ర్యాంపులో కొందరు రైజింగ్ కాంట్రాక్టర్ సొసైటీ వారిని తమ ఆధీనంలో పెట్టుకొని నిబంధనలకు పాతరేస్తున్నారు. ఆర్.కొత్తగూడెం కేంద్రంగా అర్ధరాత్రి జరుగుతున్న అక్రమ ఇసుక డంపింగ్ పై జిల్లా కలెక్టర్, మైనింగ్ శాఖ అధికారులు జోక్యం చేసుకొని ర్యాంపు నిర్వహనలో నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలి. అక్రమ రవాణాను అరికట్టి లేబర్ సహాయంతో ట్రాక్టర్ ల ద్వారా ఇసుక తరలింపు జరిపి ఇక్కడ ప్రజానీకానికి ఉపాధి కల్పించాలి. ఇప్పటి వరకు జరిగిన అక్రమ తోలకాలపై ఉన్నతాధికారులు స్పందించి శాఖ పరమైన విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుంది. లేదంటే అక్రమ తోలకాలను అడ్డుకొంటామని ఈ విషయం పై జిల్లా కలెక్టర్ మైనింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.





చీమలమర్రి మురళీకృష్ణ

ర్యాగింగ్ చేయడమంటే ఎదుటివారిని హింసించడమే

- డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

నవతెలంగాణ-సుజాతనగర్



ర్యాగింగ్ చేయడమంటే ఎదుటి వారిని హింసించి రాక్షస ఆనందం పొందటమేనని కొత్తగూడెం డిఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. మండలంలోని వేపలగడ్డ నందు గల అబ్దుల్ కలామ్ ఇంజనీరింగ్ కళాశాల నందు ర్యాగింగ్ చేయడం వలన ఎదురయ్యే ఇబ్బందులు గురించి విద్యార్థులకు అవహగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ మార్గ నిర్దేశాలకు అనుగుణంగా విద్యాసంస్థలలో ర్యాగింగ్‌ను పూర్తిగా నిషేధించారన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఒక్కసారి కేసు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలు రావడానికి అవకాశం లేదన్నారు. ఇతర దేశాలకు వెళ్లేందుకు పాసుపోర్టు పొందే అవకాశం ఉండదన్నారు. నేరం చేసిన వారి వాళ్ల వారితో పాటు వారి కుటుంబసభ్యులు సైతం శిక్షను అనుభవిస్తారన్నారు. పాల్పడిన విద్యార్థులపై కళాశాల యాజమాన్యాలు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు కళాశాలలో చేరే సమయంలో వారి వద్ద నుండి ర్యాగింగ్ పాల్పడనని లెటర్ తీసుకోవాలన్నారు. కళాశాల లో ర్యాగింగ్ కమిటీలు వేయాలని ఆ కమిటీ స్థానిక పోలీస్లు, పాత్రికేయులను మెంబర్స్ గా పెట్టాలన్నారు. ప్రతి నెల ఆ రిపోర్టును యూనివర్సిటీ లకు పంపించాలాన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన డయాల్ 100కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ రమకాంత్, డైరెక్టర్ జి. నరసింహరావు, ప్రిన్సిపాల్ వి.సీతారాం ప్రసాద్, ఎస్ఐ తిరుపతి, ఏవో శ్రీకాంత్, పీఆర్వో రమేష్, హెచ్ వోడి లు బాబురావు, మునీర్, రవికిరణ్, వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

108 కిలోల గంజాయి పట్టివేత

- విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సిఐ రాజశేఖర్

నవతెలంగాణ-ఇల్లందు



అక్రమంగా కారులో తరలిస్తున్న 108 కిలోల గంజాయి పట్టుకొని ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క సారలమ్మ గద్దెల సమీపంలో కొత్తగూడెం - ఇల్లందు మెయిన్ రోడ్డుపై వాహనాలు తనిఖీ చేశామన్నారు. కారు భద్రాచలం నుండి వరంగల్ వెళుతుందన్నారు. హర్యానా రాష్ట్ర రిజిస్ట్రేషన్ కు చెందిన హెచ్ఆర్ 38ఎఎ8833 వాహనం ఆపి తనిఖీ చేశామన్నారు. సీటు కింద డిక్కీలో 37గంజాయి ప్యాకెట్లు ఉన్నాయన్నారు. 2 కేజీలవి 27, 5కేజీలవి 10ప్యాకెట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ. 20 లక్షల ఉన్నట్లు తెలిపారు. ఒరిస్సాలో కిలో రూ.6వేలకు కొని, హరియానాలో రూ. 20వేలకు కిలో అమ్ముతున్నట్లు తెలిపారు. కారు, గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అక్రమ రవాణా చేస్తున్న కారు యజమాని బబ్లు కుమార్‌ను అదుపులో తీసుకున్నామని తెలిపారు. జ్యుడిషియల్ రిమాండ్కు పంపనట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా చేసిన విక్రయించిన ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇలాంటి నేరాలకు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ సమీ ఉల్లా ఖాన్, కానిస్టేబుల్ రవి, పాషా, మల్లికార్జున్, బాబు,తులస్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని మహా ప్రదర్శన

నవతెలంగాణ-ఇల్లందు

ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కొత్త బస్టాండ్ సుందరయ్య స్థూపం సెంటర్ నుండి పాత బస్టాండ్ సీఐటీయూ ఆఫీసు వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీఐటీయూ కార్యాలయం లో ఇల్లందు ఐసిడిఎస్ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు చింత రాంబాయి అధ్యక్షతన జరిగినసభలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) జిల్లాఅధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణ, ప్రాజెక్టు కార్యదర్శి మరియా,కోశాధికారి ఫాతిమా,యూనియన్ సీనియర్ నాయకురాలు బత్తుల దేవేంద్ర లు మాట్లాడారు. ఈ సభలో ఇల్లందు ప్రాజెక్టు యూనియన్ నాయకురాళ్లు రమణి పద్మ అంజమ్మ, పీ వెంకటమ్మ, ఎం రాధ, పార్వతి, దీప్తి, దాయావతి, ఉమ, వెంకటలక్ష్మి, సుభద్ర, షాహిన్, దేవమణి, పి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పరిరక్షణ కోసం సమ్మె

దమ్మపేట : ఐసీడీఎస్ పరిరక్షణ కోసం, అంగన్వాడీ హక్కుల సాదనకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలని అంగన్వాడీలు సమ్మె నిర్వహిస్తున్నారని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు సూరమ్మ అన్నారు. బుధవారం స్థానిక తాహశీల్దారు కార్యాలయం వద్ద వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సభలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులకు పేర్లు మార్చినంత మాత్రాన వారి సమస్యలు పరిష్కారం కాలేదని, వారికి రావలసిన సౌకర్యాలు ఇవ్వకపోగ పని బారం విపరీతంగా పెంచారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, మధు జ్యోతి, జయ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



చెర్ల

చెర్ల: సమ సమాజానికి ప్రైమరీ విద్యను అందిస్తూ నానా అవస్థలు పడుతున్న అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటియు జిల్లా అధ్యక్షులు కే. బ్రహ్మాచారి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారని వీరంతా మహిళలు బడుగు, బలహీనవర్గాలకు చెందినవారే ఎక్కువమంది ఉన్నారు. గత 40 సం.లకు పైగా ఐసిడిఎస్ లో పని చేస్తూ పేద ప్రజలకు సేవలందిస్తున్నారు. అయినా వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలను ప్రభుత్వం నేటికీ కల్పించలేదన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చారు. పశ్చిమ బెంగాల్, కేరళ తదితర రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. మనరాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు అంగన్వాడీ ఉద్యోగులకు కల్పించడం లేదని స్వయంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అంగన్వాడీ వర్కర్ పేరును టీచర్స్ గా మార్చారు. కానీ టీచర్లతో సమానంగా వేతనాలు, ఇతర సౌకర్యాలు మాత్రం ప్రభుత్వం ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. మూడు రోజులు పాటు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయటానికి ప్రధానంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడి వ్యవస్థ పై చూపుతున్న వివక్షత అని సిఐటియు అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కన్వీనర్ పాయం రాధా కుమారి అన్నారు. ఈ సమ్మెకు మండల కమిటీ సభ్యులు మచ్చ రామారావు, బందెల చంటి, టీఎస్ యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, బాలకృష్ణ సంఘీభావం తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

అశ్వారావుపేట : ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్వాడీ హక్కుల సాదన కొరకు,కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలని అంగన్వాడీ లు సమ్మె చేపట్టడం జరిగిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. బుధవారం స్థానిక పూర్వ మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో కట్టా రాధ అధ్యక్షతన జరిగిన సభలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.పుల్లయ్య వీరికి సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉష, సుందరీ, లక్ష్మి, రాజేశ్వరి, తులసి, కృష్ణవేణి, నాగమణి, చిరంజీవి, నర్సింహారావు, గంగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తులు మెచ్చేలా..ఏర్పాట్లు చేద్దాం



శ్రీరామనవమి సమీక్ష సమావేశంలో ఆర్డీఓ

నవతెలంగాణ - భద్రాచలం

మార్చి 30న శ్రీరామనవమి, 31 మార్చి పుష్కర్ పట్టాభిషేకం మహోత్సవం కార్యక్రమానికి రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున, ప్రతి భక్తుడు స్వామివారి కల్యాణ వేడుకలను కనులారా వీక్షించేలా అధికారులు ఏర్పాట్లు ఘనంగా చేయాలని భద్రాచలం ఆర్డీవో రత్న కళ్యాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్ లో శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేకం మహోత్సవాల ఏర్పాట్లపై డివిజన్ స్థాయి అధికారులతో చేపడుతున్న పనుల గురించి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 20వ తారీకు నాడు జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులతో శ్రీరామనవమి, పుష్కర పట్టాభి షేకం మహోత్సవాల ఏర్పాట్లపై శాఖల వారిగా అధికారులు తీసుకోవలసిన చర్యల గురించి అడిగి తెలుసుకుని, గత ఏడాది స్ఫూర్తితో ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించాలన్నారు. మార్చి 30న శ్రీరామనవమి, 31న పుష్కర పట్టాభిషేకం నిర్వహించనున్న మిథిలా స్టేడియంలో సెక్టార్ ప్రణాళిక పక్కాగా తయారు చేయాలని, భక్తుల నియంత్రణకు భారీ కేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి సెక్టార్కు పర్యవేక్షకులుగా ఓ జిల్లా అధికారిని ప్రత్యేకంగా నియమించినందున దానిని పర్యవేక్షించడం చాలా ముఖ్యమని అన్నారు. మార్చి 25 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, మార్చి ఒకటో తేదీ నుంచి భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు ఆన్లైన్ అందుబాటులో వచ్చినందున ప్రజలందరికీ తెలిసే విధంగా పేపర్ ప్రకటనలు సంబంధిత అధికారి జారీ చేస్తూ ఉండాలని అన్నారు. టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవో కార్యాలయాల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అలాగే పోస్టల్, మీసేవా కేంద్రాలు ద్వారా కూడా భక్తులకు స్వామివారి ప్రసాదాలు చేరవేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులు గోదావరి లోకి వెళ్లకుండా భారీ కేడింగ్ ఏర్పాటు, గజ ఈతగాళ్లను, నాటు పడవలను సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారికి సూచించారు. ప్రస్తుతం ఎండాకాలం నడుస్తున్నందున ఎండ నుంచి భక్తులు ఉపశమనం పొందేందుకు మజ్జిగ, మంచినీరు, సరఫరా చేయాలని అలాగే తినుబండారాలు అధిక ధరలకు విక్రయించకుండా చూడాలని అన్నారు. అత్యవసర వైద్య కేంద్రాలను ఏర్పాటు చేసి, 108 వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని, తప్పనిసరిగా భక్తులు ఉండే చోట మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వస్తున్నందున ముఖ్యమైన ప్రదేశాలలో సమాచార కేంద్రాల ఏర్పాటు తప్పనిసరిగా జిల్లా పౌర సంబంధాల అధికారి చూసుకోవాలని అన్నారు. శ్రీరామ నవమి ఏర్పాట్ల విషయంలో అధికారులందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి అప్పగించిన పనులను కలెక్టర్ ఇచ్చిన సూచనలు సలహాలు పాటించి ఈనెల 25 నాటికి పూర్తయ్యేలా చేసి, భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు ఘనంగా చేసి స్వామి వారి కళ్యాణం పట్టాభిషేకం కనులారా వీక్షించి సంతోషంగా వారి వారి గ్రామాలకు సురక్షితంగా చేరే విధంగా చూసే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి డిఈ హరిలాల్, ఎక్సైజ్ శాఖ అధికారి రఫీ మునిషా బేగం, ఏడిఎంహెచ్వో రాజ్ కుమార్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, టెంపుల్ ఏఈ అజయ్ కుమార్, టిఎస్ఆర్టిసి డిఎం రామారావు, డిఈ ఇరిగేషన్ మధుసూదన్ రావు, మిషన్ భగీరథ శ్రీనివాసరావు, సిఐ నాగరాజు, ట్రాఫిక్ ఎస్ఐ విఎన్ రావు, ఐటిసి మేనేజర్ చంగల్ రావు, దేవస్థానం ఈఈ రవీందర్, గ్రామపంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు,భద్రాచలం, బూర్గంపాడు తాసిల్దార్లు శ్రీనివాస్ యాదవ్, భగవాన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



పల్లె ప్రకృతి వనంపై నిర్లక్ష్యం

- నీళ్లు లేక వాడుతున్న మొక్కలు
- నేటికి బోర్డు ఏర్పాటు చేయని అధికారులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

గ్రామీణ ప్రాంత పల్లె ప్రజలకు సైతం పట్టణ తరహాలో ఆహ్లాదకర వాతావరణం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పల్లెలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ వనాలు పంచాయతీ పాలనాధికారుల పర్యవేక్షణ లేక అవి నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయనే చెప్పవచ్చు. మండలంలోని చింతగుప్ప గ్రామపంచాయితీలోని శుగ్నాపురం, తోగ్గూడెం గ్రామాల మధ్య మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా సుమారు రూ.4 లక్షల 55 వేల రూపాయల మేర అంచనా విలువతో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని హంగులతో నిరించాల్సి ఉన్నప్పటికి మొక్కుబడిగా మొక్కలు నాటి వదిలేశారు. కనీసం మొక్కలకు నీళ్ల కూడా పట్టక పోవడంతో ఎండాకాలం కావడంతో మొక్కలు వాడి పోతున్నాయి. ఆహ్లాదంగా ఉండాల్సిన వనం మొత్తం పిచ్చి మొక్కలు చెత్తా చెదారంతో దర్శనమిస్తోంది. నేటికి పల్లె ప్రకృతి వనం బోర్డు ఏర్పాటు చేయని దయనీయ పరిస్థితి అక్కడ నెలకొంది. ఆదివారం, సెలవు దినాలలో చదువుకునే పిల్లలు పల్లె ప్రకృతి వనంలో ఆహ్లాదంగా గడిపేందుకు వనం అనువుగా లేదని పల్లె ప్రకృతి వనంలో ఉండాల్సిన కనీస సౌకర్యాలు అయినటువంటి వాకింగ్ ట్రాక్‌లు, కూర్చునేందుకు బెంచీలు వంటి ఏర్పాటు చేయక పోగా పిచ్చి మొక్కలతో దర్శనం ఇస్తుంది. దీని వలన విష పురుగులు సంచరించే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బిల్లు రాక ఇబ్బంది పడుతున్నాం : సర్పంచ్ కట్టం కృష్ణ



ఈ విషయమై నవతెలంగాణ చింతగుప్ప సర్పంచ్ కట్టం కృష్ణను వివరణ కోరగా చేసిన పనులకు నేటికి బిల్లులు రాక చాలా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ట్రాక్టర్ రిపేర్ కావడం వలన పల్లె ప్రకృతి వనానికి నీళ్ల పట్టడం లేదన్నారు. నీళ్ల పట్టే మోటారు సైతం మరమ్మతులకు గురైందని తెలిపారు. పల్లె ప్రకృతి వనం వద్ద బోరు ఏర్పాటు చేసి మొక్కలు ఎండకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేష్
- ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా
- సిడిపిఓ కు వినతి పత్రం అందజేత
- టోకెన్ సమ్మెకు ప్రభుత్వం స్పందించకపోతే
- నిరవధిక సమ్మెకు సిద్ధమవుతాం
- రాష్ట్ర ప్రభుత్వానికి సీఐటియు హెచ్చరిక

నవతెలంగాణ-పాల్వంచ

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్వాడి టీచర్ల హెల్పర్ల సమస్యలు పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రవర్తిస్తున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేష్ అన్నారు. అంగన్వాడి టీచర్ల హెల్పర్ల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పాల్వంచలోని అంగన్వాడీ టీచర్స్, హెల్పర్లు భారీ ప్రదర్శనగా ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సిడిపిఓ కనకదుర్గ కు కు వినతి పత్రం అందజేశారు. దీంతో స్పందించిన సిడిపిఓ తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని మిగిలిన సమస్యలను పై అధికారులకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన సిఐటియు మండల కన్వీనర్ కె. సత్య అధ్యక్షతన జరిగిన సభలో సభలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్ల హెల్పర్ల సమస్యలు పరిష్కారం లో ఈ నిర్లక్ష్యానికి నిరసిస్తూ ఈ నెల 1,2,3 తారీకుల్లో రాష్ట్ర వ్యాప్త టోకెన్ సమ్మె జరుగుతుందని ఈ సమ్మెకు స్పందించి ప్రభుత్వ సమస్యల పరిష్కారంలో చొరవ చూపకపోతే నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

పేరు మార్చినంత మాత్రాన జరిగే ప్రయోజనం లేదని, అంగన్వాడీ జీవితాల్లో మార్పు రావాలని అన్నారు. ఆన్ లైన్ పేరుతో పని భారాన్ని పెంచితీవ్రమైన వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. 2017 నుండి టిఎ,డిఎ అద్దెలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వటం లేదన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలందరికీ ఎండాకాలం సెలవులు ప్రభుత్వ పాఠశాలల్లో ఇచ్చినట్లే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం అమలు ద్వారా అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసే కుట్ర జరుగుతుందన్నారు. సమస్యల పరిష్కారం వైపు బీజేపీ దృష్టి పెట్టకుండా సున్నితమైన అంశాలను సమస్యలుగా సృష్టించి, ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నదని అన్నారు. మార్చి 2,3 తేదీల్లో జరిగే 36 గంటల కలక్టరేట్ దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సిఐటియు కమిటీ సభ్యులు దొడ్డ రవి కుమార్, అంగన్వాడి టీచర్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా కోశాధికారి పండగ వెంకట రమణ, సెక్టార్ లీడర్స్ రాజ్యలక్ష్మి రమ్య చుక్కమ్మ స్వర్ణ లక్ష్మి కష్ణకుమారి హేమలత మంజుల రోజా మేరీ జయ ముంతాజ్ శ్రీదేవి ఉమా లక్ష్మి కుమారి సౌభాగ్య తదితర అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్.పాల్గొని,నాయకత్వం వహించారు.

గ్రాట్యుటీ ,మెడికల్ ,ఉద్యోగ భద్రత కల్పించాలి

బూర్గంపాడు : సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలను గుర్తించి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని సిఐటియు మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య అన్నారు.తెలంగాణ టీచర్స్, హెల్పర్స్ యూని యన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మోరంపల్లి బంజర కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనం తరం ఐసిడిఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం ఇంచార్జికి అందజేశారు. ఈ కార్యక్ర మంలో భద్రాచలం మహిళ కన్వీనర్ మర్లపాటి రేణుక, మండల అంగన్వాడి కార్యకర్తలు నిట్ట అనసూయ, ఎల్ పద్మ, కేసుపాక విజయలక్ష్మి, కృష్ణవేణి, నాగమల్లీశ్వరి, కృష్ణకుమారి, సావిత్రి, లక్ష్మి, బాలమ్మ, ఈశ్వరి, సులోచన తదితరులు పాల్గొన్నారు.



108 శాతం బొగ్గు ఉత్పత్తి

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు ఏరియా బొగ్గు ఉత్పాదకత ఫిబ్రవరి నెల వరకు 108శాతం ఉత్పత్తి సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్ అన్నారు. బుధవారం జిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో మణుగూరు ఏరియాలో ఉత్పత్తి లక్ష్యం 9,95,800 టన్నులకు గాను 9,10,442 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామన్నారు. ఫిబ్రవరి నెలలో సాధించిన ఉత్పత్తి 91 శాతం అన్నారు. ఏప్రిల్ 1 నుండి ఫిబ్రవరి 28 2023 వరకు ప్రోగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 10,50,3000 టన్నుల లక్ష్యానికి గాను 11,37,4392 టన్నులు సాధించారన్నారు. కాగా 108 శాతం ఉత్పత్తి సాధించమన్నారు. ఫిబ్రవరి నెలలో మణుగూరు ఏరియా 11,21,177 టన్నులను బొగ్గు రవాణా చేయటం జరిగిందన్నారు. 01 ఏప్రిల్, 2022 నుండి 28 ఫిబ్రవరి,2023 మార్చ్ వరకు ప్రోగ్రెస్సివ్ 11,60,3617 టన్నుల రవాణా చేయడం జరిగిందన్నారు. ఫిబ్రవరి నెలలో ఓవర్ బర్డన్ మన డిపార్ట్మెంటల్ గా 14 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్షాలకు గాను 96 శాతం తో 13.40 లక్షల క్యూబిక్ మీటర్లు తీశారు. 01 ఏప్రిల్ 2022 నుండి 28 ఫిబ్రవరి 2023 వరకు 132.58 లక్షల క్యూబిక్ మీటర్ల తీయడం జరిగిందన్నారు.కాగా 86 శాతం సాధించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యువ నాయకులు బట్టా విజయ్ గాంధీ

నవతెలంగాణ -బూర్గంపాడు



అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు స్వచ్ఛమైన పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ యువ నాయకులు, పిసిసి మెంబర్ బట్టా విజయ్ గాంధీ అన్నారు. మండలంలోని రామాపురంలో బుధవారం కాంగ్రెస్ రైతు డిక్లరేషన్, హాథ్ సే హాథ్ జోడో యాత్ర విధివిధానాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామగ్రామాన, ఇంటింటికి తిరుగుతూ ప్రజల్లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తలపెట్టబోయే రైతు డిక్లరేషన్ విధివిధానాలు ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని ఆయన అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర పేరుతో పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేపడుతున్న పాదయాత్రకు విశేష స్పందన లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, పెద్దలు బోర్రాభద్రయ్య,గ్రామపెద్దలు పాయం రాములు, తంగేడు కృష్ణ, పాయం రాజు, పాయం వెంకట్ రావు, పూనెం సురెందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదివితే ఉన్నత స్థానాలు

శ్రీ విజ్ఞాన్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవంలో విజయభాస్కర్‌రెడ్డి

నవతెలంగాణ-మణుగూరు



విద్యార్థులు లక్ష్యతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని శ్రీ విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత తిప్పారెడ్డి విజయ్ భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గుట్ట మల్లారంలోగల శ్రీ విజ్ఞాన్ స్కూల్‌లో నిర్వహించిన ప్రథమ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథులుగా తిప్పారెడ్డి విజయభాస్కర్ రెడ్డి, పుచ్చకాయల శంకర్ , కరస్పాండెంట్ సాంబశివరెడ్డి డైరెక్టర్స్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సాంబశివరెడ్డి మాట్లాడుతూ విద్యా సంస్థను స్థాపించిన ప్రథమ సంవత్సరంలో పదో తరగతి ఫలితాలలో 10/10 సాధించడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అదే ఉత్సాహంతో ద్వితీయ సంవత్సరంలో విద్యార్థుల విజ్ఞానాన్ని వెలికి తీయుటకు కార్పొరేట్ స్థాయిలో విద్యానందించుటకు విద్యార్థులకు భవిష్యత్తు మార్గాన్ని సుగుమం చేయుటకు అనేక విద్య ప్రతిభా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ప్రతి వారం ఆర్ట్ మ్యాజిక్, వర్డ్ హౌస్, స్పీడ్ మేథ్స్, హనీ ట్యూన్ వంటి కార్యక్రమాల సాధనలో సఫలీకృతమయ్యాయన్నారు. అనంతరం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యపై పెట్టే ఖర్చు, భారంగా కాకుండా పెట్టుబడిగా భావించినట్లయితే భవిష్యత్తులో బంగారు ఫలితాలు పొందగలుగుతారన్నారు. ఈ వార్షికోత్సవ సందర్భంగా 10/10 సాధించినటువంటి సమీరా, జాతీయ స్థాయి హ్యాండ్ రైటింగ్ విన్నర్ స్నేహ ప్రియాంక, త్రివిధను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సాంబశివారెడ్డి, డైరెక్టర్ సురేష్, శశికిరణ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి...

మణుగూరు: అంగన్వాడి టీచర్లకు,హెల్పర్లకు కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాసరావు డిమాండు చేశారు. బుధవారం తెలంగాణ అంగన్వాడీ టీచర్సు అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక సురక్ష బస్టాండ్ సెంటర్ నుండి టెలిఫోన్ ఎక్స్చేంజ్ వద్ద ఉన్న ఐసిడిఎస్ సిడిపిఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం మణుగూరు ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సిడిపిఓ విజయలక్ష్మికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా నాయకురాలు కే రమణ బి శ్యామల,రాణి, సావిత్రి , సరిత , సురంజన , డి మల్లేశ్వరి యశోద , సావిత్రి , మరియు మినీ టీచర్లు టీచర్లు హెల్పర్లు పాల్గొన్నారు.


ప్రీతి, రక్షిత మరణానికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలి

మణుగూరు : ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ప్రీతి, రక్షిత మరణానికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని వారి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి హరీష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు అఖిల్ తేజ, పట్టణ నాయకులు శ్రావణ్ కుమార్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

6 నుండి క్రికెట్ టోర్నమెంట్

దుమ్ముగూడెం : ములకపాడు గ్రామంలో గల క్రీడా మైదానంలో ఈ నెల 6 నుండి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ బాధ్యులు తెలిపారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన సివిల్ ఇంజనీర్ కొర్సా వెంకటేశ్వరరావు విజేతలకు బహుమతులను దాతగా అందజేస్తున్న టోర్నమెంట్ బ్రోచర్స్‌ను మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. సిఐ దోమల రమేష్ చేతుల మీదుగా ప్రారంభించే టోర్నీలలో పాల్గొనే టీములు 1000 రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు.

అటుకుల పులిహోర కలిపేద్దాం



పులిహోర అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. అయితే పులిహోర చేయాలంటే ప్రత్యేకంగా అన్నం వండాలి. చింతపండు రసాన్ని తయారు చేసుకోవాలి. ఆ తర్వాత బాగా కలిపాలి. అప్పుడే టేస్ట్ అదురుద్ది. కానీ అదంతా టైమ్ టేకింగ్ అని అనుకుంటున్నారా? అయితే మీరు అటుకుల పులిహోరను ట్రై చేయండి. పిల్లలకు వేగంగా లంచ్ బాక్స్ సిద్ధం చేయాలంటే.. దీనికి మించిన మంచి రెసిపి మరొకటి ఉండదు. చాలా ఈజీగా కేవలం 10 నుంచి 15 నిమిషాలలోపే అటుకుల పులిహోర కలిపేయొచ్చు. అదెలాగో చూడండి.

కావలసిన పదార్థాలు: ఒక కప్పు అటుకులు, కరివేపాకు రెండు రెమ్మలు, కాస్త కొత్తిమీర (మీ పిల్లలకు ఇష్టం లేకపోతే పక్కన పెట్టండి), రెండు నిమ్మకాయలు లేదా రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం, తగినంత ఉప్పు, కొన్ని వెల్లులి, అల్లం ముక్కలు, పావు టీస్పూన్ పసుపు, అర టీస్పూన్ జీలకర్ర, మూడు మిర్చీలు (పెద్దవైతే రెండు చాలు), రెండు టేబుల్ స్పూన్ల పల్లీలు.

ఇలా చేయండి: ముందుగా ఒక కప్పు అటుకులు తీసుకుని నీటిలో నానబెట్టండి. ఆ తర్వాత వాటిని వడపోసి పక్కన పెట్టండి. ఎక్కువ తడి లేకుండా, బాగా పొడిబారకుండా మధ్యస్థంగా ఉండేలా అటుకులు ఉండాలి. ఎక్కువ తడిగా ఉంటే వేడి చేసేప్పుడు మెత్తగా అయిపోతాయి. మరోవైపు స్టవ్ మీద పెనం పెట్టి, కాస్త ఆయిల్ వేసి అందులో వెల్లులి, అల్లం ముక్కలు, కరివేపాకు, జీలకర్ర, పచ్చిమిర్చి ముక్కలు, పల్లీలను సన్నని మంటపై దోరగా వేయించండి. కాస్త పసుపు వేసిన తర్వాత.. పక్కన పెట్టుకున్న అటుకులను పెనంలో వేసి బాగా కలపండి. అది స్టవ్ మీద వేడెక్కుతున్న సమయంలో.. నిమ్మరసాన్ని తీసుకోండి. అందులో తగినంత ఉప్పు వేసి బాగా కలపండి. ఆ రసాన్ని పెనం మీద ఉన్న అటుకుల్లో వేయండి. అంతే అటుకుల పులిహోర రెడీ. స్టవ్ ఆపేసి అటుకుల పులిహోరను ఒక గిన్నెలోకి తీసుకుని కొత్తిమీరతో గార్నిష్ చేస్తే మరింత అందంగా కనిపిస్తుంది.

మన అటుకుల పులిహోరను ఉత్తరాదిలో పోహా అంటారు. దీనికి టమోటాలు, బఠాణీలు, కాస్త మిక్చర్ కూడా యాడ్ చేస్తే పోహాగా మారిపోతుంది. మీకు టైమ్ ఉన్నట్లయితే నిమ్మరసానికి బదులుగా చింతపండు రసంతో కూడా అటుకుల పులిహోర చేయొచ్చు. ఇది నిమ్మరసం అటుకుల పులిహోర కంటే మాంచి టేస్ట్ ఉంటుంది. ఇంకెందుకు ఆలస్యం.. ఈ రోజే అటుకుల పులిహోర ట్రై చేయండి. పిల్లలకు కూడా ఇది కొత్తగా ఉంటుంది. ఒక్కసారి టేస్ట్ చూస్తే మళ్లీ మళ్లీ కావాలంటారు. పైగా అటుకులు ఆరోగ్యాన్ని కూడా అందిస్తాయి. అటుకులు డయాబెటిస్ బాధితులకు కూడా మంచివే. పైగా మీరు ఇందులో నిమ్మరసం కలుపుతారు కాబట్టి.. అటుకుల పులిహోర మరింత హెల్తీ.

ఇట్ల చేద్దాం



రెండు చెంచాల బొప్పాయి గింజలను మిక్సీలో గరుకు మిశ్రమంగా చేసుకోవాలి. ఇందులో రెండు చెంచాల ఓట్స్ పొడి, చెంచా తేనె కలిపి ముఖానికి మృదువుగా రాసి అయిదు నిమిషాలు రుద్ది ఆరనివ్వాలి. ఆపై చల్లని నీటితో కడిగితే ముఖంపై పేరుకొన్న మృతకణాలు, మురికి దూరమై చర్మం మెరుపులీనుతుంది. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే ముఖంపై మచ్చలు, మొటిమలు రాకుండా ఉంటాయి.


కళ మానసిక ఆనందాన్నిస్తుంది

అభిరుచి వుంటే అనుకున్నది సాధించవచ్చని నిరూపించారు. ఇంటి గుమ్మంలో ఆహ్వానిస్తూ నిలువెత్తు బొజ్జ గణపయ్య. ఇల్లంతా రకరకాల కళాత్మకమైన బొమ్మలు. అందంగా తీర్చి దిద్దిన ఇల్లు. నవ్వుతూ ఆహ్వానించే మోము. ఆమె పాలపర్తి శ్యామలా శర్మ.



అవకాశం దొరికితే చాలు మనసులోని ఆలోచనలకు రూపం కల్పిస్తారు. ఆసక్తి, శ్రద్ధ వుంటే చాలు, చిన్ననాటి అభిరుచులు సాకారం రూపు దాల్చుతాయి. శ్యామల చదువుకునే రోజుల్లోనే డ్రాయింగ్ కళ పట్ల ఆకర్షితురాలై అటువేపు అడుగులు వేశారు. పుట్టింది గుంటూరు. తల్లి తాడేపల్లి శకుంతల, తండ్రి నరసింహ మూర్తి. శ్యామల చదువంతా గుంటూరులోనే సాగింది. బి.ఎ. గుంటూరు ఉమెన్స్ కాలేజీలో చదివారు. ఫైన్ ఆర్ట్స్ అంటే ఎంతో ఆసక్తి వున్న వీరు చదువుకునే రోజుల్లోనే బొమ్మలు వేయటం మొదలు పెట్టారు.





డ్రాయింగ్‌లో తర్ఫీదు

ఎం.ఏ. చదువుతుండగా ఇంజనీరైన పాలపర్తి శివరామ కృష్ణతో వివాహం జరిగింది. అనంతరం భర్త ఉద్యోగ రీత్యా ముంబాయి, మస్కట్, అబూదాబీ నగరాల్లో వున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. అమ్మాయి వందన కలకత్తాలోనూ, అబ్బాయి వరుణ్ యు.ఎస్. లోనూ స్థిరపడ్డారు. మరి ఈ ఆర్ట్ కోసం ఎక్కడైనా తర్ఫీదు పొందారా అని అడిగినపుడు "మా బాబు చదువు కోసం నేను కొన్నాళ్ళు హైదరాబాదులో ఉన్నాను. అప్పుడు ఒక నెల రోజులు డ్రాయింగ్‌లో తర్ఫీదు పొంది మరిన్ని మెళ కువలు నేర్చుకున్నాను. ఖాళీ సమయంలో పెయింటింగ్ చేస్తూ ఉంటాను. ఎన్నో చిత్రాలు గీసి ఎందరికో బహుమతిగా కూడా ఇచ్చాను" అని అన్నారు.

అందంగా మలచొచ్చు

ఫైన్ ఆర్ట్స్‌లో ఎన్నో వున్నాయి. అంటే సంగీతం, నృత్యం ఇలా ఎన్నో కళలు. మీకు చిత్రాలు గీయాలని ఎందుకు అనిపించింది అని అడిగితె... "నాకు చిన్నప్పటి నుంచీ వున్న ఆసక్తి అంతే! ఎప్పుడూ బొమ్మలు వేస్తుండేదాన్ని. అసలు పెయింటింగ్ వేయాలంటేనే చాలా రకాలు వున్నాయి. వాటర్ కలర్స్ నుంచి ఆయిల్ పెయింట్స్, కాన్వాస్ పెయింటింగ్స్, గ్లాస్ పెయింటింగ్స్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్స్ ఇలా ఎన్నో రకాలుంటాయి. చిత్రించే మనసుండాలి కానీ దేన్నయినా అందంగా మలచవచ్చు. నా మనసుకి నచ్చిన ఆలోచనలు బొమ్మలుగా రూపుదిద్దుకునేవి" అంటారు ఆమె.

ఆయిల్ పెయింట్స్ ఇష్టం

ఆమె గీసిన చిత్రాల వివరాలు గురించి అడిగితే "పల్లె పడుచు చిత్రం, వినాయకుని చిత్రం కానీ దాదాపు అన్నింటినీ మా పెండ్లి అయ్యాక గీసినవే. ఇందుకు మా వారి ప్రోత్సాహం ఎంతో వుంది. ఇందులో ఉన్న అమ్మాయి బొమ్మని చెక్క మీద ఆయిల్ పెయింట్స్‌తో గీసాను. గ్రాస్ లిల్లీస్‌గా పిలుచుకునే ఈ పూలు సిల్క్ బట్ట మీద వేసాను. వినాయకుడు కాన్వాస్ మీద ఆయిల్ పెయింట్స్‌తో గీశాను. కాన్వాస్ మీద కాకుండా చీరలు, సిల్క్ క్లాత్ మీద బొమ్మలు వేస్తుండే దాన్ని. ఇవిగో ఈ బొమ్మలు అలా వేసినవే! అన్నిటిలోకి కాన్వాస్ మీద ఆయిల్ పెయింట్స్ వేయటం ఇష్టం. నేను ఇప్పుడు చెప్పిన అన్ని ప్రక్రియల్లోనూ వేసాను" అని సమాధానం చెప్పారు.

చీరలపై పెయింటింగ్

మీకు బొమ్మలు వేయటమేనా ఇంకేమైనా అభిరుచులు వున్నాయా అని అడిగితే "చదువుకునే రోజుల్లోనే ఎన్నో బట్టల మీద రక రకాల ఎంబ్రాయిడరీ డిజైన్‌లు కుట్టేదాన్ని. అవన్నీ కూడా అందరి మెప్పు పొందాయి. చాలా మందికి అవి బహుమతిగా కూడా కుట్టి ఇచ్చేదాన్ని. ఎంబ్రాయిడరీ వర్క్ సారీస్ అప్పట్లో ఫ్యాషన్. ఎంతో ఆసక్తితో చాలా చీరలపై కుట్టాను. వాటిల్ని అనాథ పిల్లలకి ఇచ్చేశాను. పెయింటింగ్‌పై ఆసక్తి పెరిగి చీరల మీద పెయింటింగ్ వేయటం మొదలు పెట్టాను. మచ్చుక్కి ఒకటి రెండు నా వద్ద వున్నాయి. ఇదిగో నాట్యం చేసే అమ్మాయిల బొమ్మలు చీర మీద వేసిన డిజైన్" అంటూ ఆ చీరని చూపించారు.



అవుట్ డోర్ ఆటలంటే ఆసక్తి

వీరు తన ఇంటిని ఎప్పుడూ అందంగా తీర్చి దిద్దుతారు. వంట చేయటమంటే తనకి ఇష్టమని. ఎన్నో వంటల పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్నానని అంటారు. గత జ్ఞాపకాలు తలుచుకుంటూ.. ఇతర వ్యాపాకాల గురించి వివరిస్తూ "చిన్నప్పటి నుంచి అవుట్ డోర్ ఆటలంటే ఆసక్తి. వాలీబాల్, బాస్కెట్ బాల్ ఆడేదాన్ని. బోల్డు సర్టిఫికెట్స్ కూడా వచ్చాయి. చాలా యాక్టివ్‌గా వుండేదాన్ని ఆరోజుల్లో. బడి చదువుతో పాటు హిందీ విశారద చదివాను. అంతే కాదు స్కూల్లో చదివేటప్పుడు నాటకాలు కూడా వేశాను. పల్నాటి వీర గాథలు వంటి నాటకాలు వేసేవాళ్ళం. బాగుండేవి అప్పటి రోజులు తలుచు కుంటుంటే!".



ఆక్టివిటీ క్రియేట్ చేసుకోవాలి

ప్రస్తుత సమాజంలో కళలకున్న ప్రాధాన్యం గురించి మీ అభిప్రాయం ఏమిటి అని అడిగితే "ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఆక్టివిటీ క్రియేట్ చేసుకోవాలి. ఈ పెయింటింగ్ ఆర్ట్స్ అయితే మానసిక ఆనందం ఇస్తుంది. ఎవరైనా సరే డిప్రెషన్‌లో వున్నప్పుడు, సమస్యలున్నపుడు, ఖాళీసమయాల్లో ఇటువంటి కళలపై దృష్టి పెడితే మనసు ప్రశాంతంగా వుంటుంది. ఈ కాలం యువత చదువుతో పాటు ఏదైనా మనసుకు నచ్చిన సంగీతమో, నృత్యమో, ఇలా ఫైన్ ఆర్ట్స్ వంటివి నేర్చుకుంటే మానసిక ఆనందం లభిస్తుంది. ఇంతకన్నా ఏమీ చెప్పలేను" అన్నారు.

అందంగా కొలువు తీరాయి

ఎప్పుడూ చిరునవ్వుతో గల గలా మాట్లాడుతూ, అందరూ ఆత్మీయులే అనుకుంటూ అందరితో స్నేహభావంతో ఉంటారు శ్యామల. భర్త పదవీ విరమణ అనంతరం హైదరాబాదులోని కొండాపూర్‌లో నివాస ముంటూ విశ్రాంత జీవితం గడుపుతున్నారు. ఫైన్ ఆర్ట్స్‌లో చక్కటి కళాత్మక చిత్రాలు ఎంతో అందంగా వారి ఇంట్లో కొలువు తీరాయి. ఇది గృహిణిగా వుంటూ చేతి వేళ్ళు అలవోకగా వంపులు తిప్పుతూ, కుంచెలతో రంగులు అద్దుతూ, కాన్వాస్‌పై మంచి చిత్రాలు రూపుదిద్దుకున్న శ్యామల అంతరంగం.

మణి నాథ్ కోపల్లె, 9703044410

బి12 లోపిస్తే..?

కొంతమందిలో కాళ్ళు, చేతులు తరచూ తిమ్మిర్లు పడుతూ ఉంటాయి. ఒకే చోట కదలకుండా కూర్చోవడం వల్ల అలా జరుగుతుందని కొంతమంది చెబుతుంటారు. అలా తిమ్మిర్లు పెట్టాక రెండు నుంచి మూడు నిమిషాలు చేతులు, కాళ్ళు కదపలేని పరిస్థితి ఉంటుంది. తర్వాత తగ్గిపోతుంది. రక్తప్రసరణ సాఫీగా జరగనప్పుడే ఇలా తిమ్మిర్లు వస్తూ ఉంటాయని చెబుతారు. తిమ్మిర్లు అప్పుడప్పుడు వస్తే పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కానీ తరచూ వస్తే మాత్రం కచ్చితంగా వాటిని సీరియస్‌గా తీసుకోవాలి. ముఖ్యంగా షుగర్ వ్యాధితో ఉన్నవారు మాత్రం ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటారు. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే చేతులు కాళ్లలో తరచూ తిమ్మిర్లు రావడం అనేది విటమిన్ బి12 లోపానికి ఒక సంకేతం.

- మన శరీరానికి విటమిన్ బి12 అత్యవసరమైనది. ఇది లోపిస్తే శరీరం అనేక అనారోగ్యాల బారిన పడుతుంది. ఎర్ర రక్త కణాల తయారీలో, నాడీ వ్యవస్థ పనితీరులో, శరీర ఎదుగుదలకు విటమిన్ బి12 చాలా అవసరం. ఇది లోపిస్తే శరీరంలో ఎర్ర రక్త కణాల సంఖ్య కూడా తగ్గిపోతుంది. అంతేకాదు అవయవాలకు ఆక్సిజన్ సరిగ్గా సరఫరా కాదు. దీనివల్లే తిమ్మిర్లు వస్తూ ఉంటాయి. విటమిన్ లోపిస్తే నరాల సమస్యలతో పాటు వెరికోస్ వీన్స్, సయాటికా వంటి సమస్యలు వేధిస్తాయి.
- తిమ్మిర్లు అధికంగా పడుతున్నా, అరిచేతులు, అరికాళ్ళలో సూదులు గుచ్చుతున్నట్టు అనిపిస్తుంటే విటమిన్ బి12 లోపం ఉందేమో అని చెక్ చేసుకోవాలి. అలాగే విటమిన్ బి12 నిండుగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. మాంసం, పాలు, పెరుగు, చేపలు వంటి వాటిల్లో బి12 పుష్కలంగా ఉంటుంది. వీటిని తింటూనే యాపిల్ సిడర్ వెనిగర్ కూడా తీసుకోవడం వల్ల విటమిన్ బి12 లోపాన్ని అధిగమించవచ్చు. తిమ్మిర్లు అధికంగా వస్తున్న వారు నీటిని అధికంగా తాగాలి. ఎందుకంటే విటమిన్ బి12 అనేది నీటిలో కరిగే విటమిన్. అది శరీరంలో లోపించిందంటే డిహైడ్రేషన్ వల్ల కూడా కావచ్చు. కాబట్టి నీటిని అధికంగా తాగుతూ చేతులు కాళ్లకు కొబ్బరి నూనెతో మర్దన చేసుకుంటూ ఉండాలి. దీనివల్ల రక్తప్రసరణ మెరుగుపడుతుంది. చేతులు, కాళ్లలో తిమ్మిర్లు రావడం తగ్గుముఖం పడుతుంది.



- విటమిన్ బి12 సప్లిమెంట్స్ కూడా మార్కెట్లో దొరుకుతాయి. వైద్యులను సంప్రదించాక వాటిని తీసుకుంటే ఈ లోపాలను అధిగమించవచ్చు. ఎవరికి వారు సొంతంగా సప్లిమెంట్లను తీసుకోవడం పద్ధతి కాదు. వైద్యుల సూచన మేరకే వాటిని తీసుకోవాలి.

సాగుకు పుష్కలంగా నీరు

(మొదటిపేజీ తరువాయి)

విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. అందుకే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడామని చెప్పారు. ఆలయ అభివృద్ధి కోసం మరో రూ.7 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అదే విధంగా బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు ఇస్తామని తెలిపారు. ఈ నిధులు దుర్వినియోగం చెందకుండా పనులు చేయించుకోవాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. మిగతా నియోజకవర్గం ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు నిరాశ చెందకుండా వారికి కూడా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల, రైతుల సమస్యలను గుర్తించి పరిష్కారం చేసే నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అని, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉండటం ఇక్కడ ప్రజల అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, రాష్ట్ర ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీ చైర్మెన్ విఠల్‌రావు, శోభ, ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజాల సురేందర్, బిగాల గణేష్ గుప్తా, టీసీసీబి చైర్మెన్ పోచారం భాస్కర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

బీర్కూర్‌లో సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పలువురు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామ సర్పంచ్ ఇందూరు సిద్దార్థను, తూర్పు రాజేష్ గోల్ల శ్రీనివాస్‌ను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ నాయకులను ముందస్తుగా అదుపులోకి స్టేషన్‌కు తరలించారు.

మేథోసంపత్తిలో అట్టడుగున భారత్

(మొదటిపేజీ తరువాయి)

స్థానం (2021లో) 40 నుంచి 42కు పడిపోయింది. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా గుర్తింపు అందుకున్న ఈ 55 దేశాల జీడీపీ, ప్రపంచ జీడీపీలో 90శాతం వాటాను కలిగివున్నాయి. పేటెంట్, కాపీరైట్ చట్టాల అమలు, మేథో సంపత్తి హక్కుల పరిరక్షణ, అంతర్జాతీయ ఒప్పందాలకు ఆమోదం తెలపటం వంటివి ఆయా దేశాల్లో ఏ విధంగా ఉందన్నది వెలుగులోకి తీసుకురావటం ఈ నివేదిక ముఖ్య ఉద్దేశం. భారత్ సహా అనేక దేశాల్లో మేథో సంపత్తి హక్కులకు భంగం వాటిల్లే విధానాలు తెరపైకి వస్తున్నాయని, ఇవన్నీ ఐపీ హక్కుల్ని తుడిచిపెట్టే ప్రమాదముందని నివేదికలో ఆందోళన వ్యక్తమైంది. నూతన ఆవిష్కరణలు, సృజనాత్మకత, పోటీ తత్వం..ఇవన్నీ ఆయా దేశాల ఆర్థిక భవిష్యత్తును ప్రకాశవంతం చేస్తుందని నివేదిక తెలిపింది. ఈ నివేదికపై అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ కిల్‌బ్రిడ్ మాట్లాడుతూ, "జనాభా, భౌగోళికంగా భారత్ పెద్ద దేశం. ఆర్థిక వ్యవస్థా పెద్దదే. ప్రపంచ వేదికపై భారత్ ప్రభావం ఉంది. ఇవన్నీ కూడా వర్ధమాన దేశంగా భారత్‌కు కలిసివచ్చే అంశాలు. ఐపీ హక్కులకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మేంట్ వ్యవస్థ మెరుగుపడింది. అయితే ఆసియాలో భారత్ ప్రత్యేక నిలబడాలన్నా, ఆర్థిక వృద్ధి కొనసాగించా లన్నా..అది సరిపోదు" అని అన్నారు.

లోక్‌సభ బీఏసీ నుంచి బీఆర్ఎస్ అవుట్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) నుంచి బీఆర్ఎస్‌ను తొలగిస్తూ లోక్‌సభ సచివాలయం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ పార్టీ నాయకత్వానికి పంపిన ఆహ్వానమే ఇందుకు సాక్ష్యంగా నిలిచింది. ఇప్పటిదాకా బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు బీఏసీ సమావేశాలకు సభ్యుడిగా హాజరవుతున్నారు. కాగా తాజాగా ఆయనకు పంపిన ఆహ్వానంలో ఆహ్వానితుడిగా మాత్రమే పేర్కొన్నారు. సాధారణంగా లోక్‌సభ నియామవళి ప్రకారం ఆసభలో కనీసం ఆరుగురు ఎంపీలను కలిగి ఉంటే ఏపార్టీకైనా లోక్‌సభ బీఏసీలో ప్రాతినిథ్యం కల్పిస్తారు. కాగా లోక్‌సభలో బీఆర్ఎస్‌కు తొమ్మిది మంది ఎంపీలు ఉన్నారు. అయినా లోక్‌సభ బీఏసీ నుంచి బీఆర్ఎస్‌ను తొలగించడం చర్చనీయాంశమైంది. ఇకపై ఆహ్వానం పంపితేనే భేటీకి హాజరుకావాల్సిన పరిస్థితి బీఆర్ఎస్‌కు ఎదురైంది. కాగా లోక్‌సభ సచివాలయం టీఆర్ఎస్‌గానే పరిగణిస్తున్నది. బీఆర్ఎస్‌గా మారినా పట్టించుకోకపోవడం గమనార్హం.

బండ బాదుడు..

(మొదటిపేజీ తరువాయి)

14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1,103 ఉంది. పెరిగిన ధరతో రూ.1,153కి చేరింది. అలాగే 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,769 నుంచి రూ.2,119.50కి పెరిగింది. ముంబయిలో ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1,102.50 నుంచి రూ.1,152.50కి పెరిగింది. 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,721 నుంచి రూ.2,071.50కి పెరిగింది. కోల్‌కతాలో ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1,129 నుంచి రూ.1,179కి, 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,870 నుంచి రూ.2,221.50కి, పెరిగింది. చెన్నైలో ఎల్పీజీ సిలిండర్ ధర రూ.1,118.50 నుంచి రూ.1,168.50కి, 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,917 నుంచి రూ.2,268.50కి పెరిగింది. మరోవైపు విమాన ఇంధనం ధరలను 4 శాతం తగ్గించటం గమనార్హం.

సామాన్యులకు మోడీ సర్కార్ హోలీ గిఫ్ట్ : ప్రతిపక్షాల ఆగ్రహం

మూడు ఈశాన్య రాష్ట్రాలలో పోలింగ్ ముగిసిన రెండు రోజులకే వంట గ్యాస్ ధరలు పెంచడంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేశాయి. ఇది సామాన్య ప్రజలకు మోడీ సర్కార్ ఇచ్చిన హోలీ బహుమతని ఎద్దేవా చేశాయి. మోడీ ప్రభుత్వ హయాంలో సామాన్యులు ద్రవ్యోల్బణంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ట్వీట్ చేశారు. ఇది మోడీ ప్రభుత్వ హోలీ కానుక అని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీ ప్రియాంక చతుర్వేది అన్నారు.

ఉపసంహరించుకోవాలి : సీపీఐ(ఎం)

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. "ఈ పెంపుతో, ఎక్కువ మంది ప్రజలు సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్‌లను సైతం వదులుకుంటారు. ఇప్పటికే, ఉజ్వల యోజన కింద 10 శాతం మందికి పైగా గత ఏడాదిలో ఎలాంటి రీఫిల్ సిలిండర్లు తీసుకోలేదు. దాదాపు 12 శాతం మంది 1 రీఫిల్ మాత్రమే తీసుకున్నారు. మొత్తం 56.5 శాతం మంది కనీస వార్షిక సగటు 7 పైగా సిలిండర్‌లకు కేవలం 4 లేదా, అంతకంటే తక్కువ రీఫిల్‌లను మాత్రమే తీసుకున్నారు. సంవత్సరానికి 12 సిలిండర్‌లు తీసుకొనే అవకాశం ఉంది. కాని తీసుకోలేకపోతున్నారు" అని స్పష్టం చేసింది. "కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరలను ఈ ఏడాది రెండోసారి పెంచారు. ఇది మరింత ధరల పెరుగుదలకు ఆజ్యం పోస్తూ అన్ని ప్రాసెస్ చేయబడిన ఆహార ఉత్పత్తులకు ఇన్‌పుట్ ఖర్చులను పెంచుతుంది" అని తెలిపింది. ఈ పెంపుదలను వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో డిమాండ్ చేసింది.

ఎన్నికల కౌంటింగ్ నేడే

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభం కానున్నదని కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్యంగా త్రిపురలో వామపక్ష కూటమికి, బీజేపీ కూటమికి మధ్య పోటీ నువ్వా–నేనా అన్నట్టుగా నెలకొంది. వీటి ఫలితాలు ఏవిధంగా వస్తాయన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఇక్కడ మొత్తం 60 స్థానాలుండగా, వామపక్షాలు 47 స్థానాల్లో, కాంగ్రెస్ 13 స్థానాల్లో పోటీచేశాయి. 2018 ఎన్నికల్లో బీజేపీ 36 స్థానాలు గెలుచుకొని, ఐపీటీఎఫ్‌తో జతకట్టి అధికారాన్ని కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లో 55 స్థానాల్లో బీజేపీ, ఆరు స్థానాల్లో ఐపీటీఎఫ్ అభ్యర్థులు బరిలో నిలబడ్డారు. ఫిబ్రవరి 16న పోలింగ్ జరిగింది.

గత ఐదేండ్లుగా బీజేపీ పాలనతో త్రిపుర ప్రజలు విసుగెత్తిపోయారు. దాడులు, విధ్వంసంతో ప్రతిపక్షాల్ని అణచివేయటమే లక్ష్యంగా బీజేపీ పాలన సాగింది. ప్రస్తుత ఎన్నికల నిర్వహణ స్వేచ్ఛాయుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే పరిస్థితులు కరువయ్యాయని ప్రతిపక్షాలు అనేకమార్లు ఆందోళన వ్యక్తం చేశాయి. ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా జరిగేట్టు చూడాలని వామపక్షాలు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి ఆశ్రయించాల్సి వచ్చింది. అధికార బీజేపీ పాలనపై వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉన్నా, అది ఎన్నికల్లో ఓట్ల రూపంలో ప్రతిబింబిస్తుందా? అంటే చెప్పలేని పరిస్థితి. కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల పోరులో దిగిన వామపక్షాల అభ్యర్థులకు ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది.

మేఘాలయ, నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27 పోలింగ్ చేపట్టారు. మేఘాలయ సీఎం కాన్‌రాడ్ సంగ్మా (పి.ఎ.సంగ్మా కుమారుడు) నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) అన్ని స్థానాల్లో పోటీ చేసింది. సంగ్మా పార్టీతో సంబంధాలు దెబ్బతినటంతో బీజేపీ 59స్థానాల్లో తన అభ్యర్థులను బరిలో నిలిపింది. తృణమూల్ కాంగ్రెస్ అన్ని స్థానాల్లో పోటీ చేసింది. నాగాలాండ్‌లోనూ నేషనల్ డెమొక్రాటిక్ ప్రోగ్రెస్సివ్ పార్టీతో బీజేపీ చేతులు కలిపింది. తద్వారా 2018లో అధికారాన్ని కైవసం చేసుకుంది. జనతాదళ్ (యునైటెడ్), ఒక స్వతంత్ర అభ్యర్థి సాయంతో నాగాలాండ్‌లో బీజేపీ, ఎన్‌డీపీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది.

శ్రీచైతన్య విద్యాసంస్థలను మూసేయాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

విద్యార్థుల చావులకు కారణమవుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థలను రాష్ట్రంలో మూసేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ఇటీవల కాలంలో ఇద్దరు విద్యార్థులు మానసిక ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారని విమర్శించారు. పీర్జాదిగూడ, నార్సింగిలో వారి మరణాలకు ఆ యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తూ ధనదాహంతో పనిచేస్తున్నాయని తెలిపారు. మార్కులు, ర్యాంకులే తప్ప విద్యార్థుల సంక్షేమం వారికి పట్టడం లేదని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వందలకొద్దీ బ్రాంచీలను తెరిచి మాయమాటలతో మోసపూరితంగా విద్యావ్యాపారం కొనసాగిస్తున్నాయని విమర్శించారు. విద్యార్థుల ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని తెలిపారు. గుర్తింపు లేకుండా సొంత భవనాల్లేకుండా నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన ఒక్కో విద్యార్థికి రూ.50 లక్షల నష్టపరిహారం ఆ విద్యాసంస్థ చెల్లించాలని కోరారు.

యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి : పీడీఎస్‌యూ

విద్యార్థుల మరణాలకు కారణమైన శ్రీచైతన్య యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, కార్యదర్శి నామాల ఆజాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని పేర్కొన్నారు.

ఆత్మహత్యపై విచారణ జరపాలి : పీడీఎస్‌యూ

శ్రీచైతన్యలో చదువుతున్న విద్యార్థి సాత్విక్ ఆత్మహత్యపై విచారణ జరిపించాలని పీడీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాం, ప్రధాన కార్యదర్శి ఇడంపాక విజయ్‌కన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందుకు కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆత్మహత్యలకు నిలయాలుగా మారిన కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

గ్రూప్-2,3 దరఖాస్తు గడువు పెంచాలి

- టీఎస్‌పీఎస్సీకి డీవైఎఫ్ఐ వినతి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

గ్రూప్–2, గ్రూప్–3 దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో అధికారులను బుధవారం ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జావిద్, నాయకులు నవీన్ కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు సకాలంలో దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. ఇంటర్‌నెట్, సాంకేతిక సమస్యలు, ఇతర ఇబ్బందుల కారణంగా గడువు సమయానికి దరఖాస్తు చేసుకోలేక పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయారని పేర్కొన్నారు. అర్హత ఉన్నా దరఖాస్తు చేసే అవకాశం లేకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మరోసారి దరఖాస్తు గడువును పెంచి వారికి అవకాశం కల్పించాలని కోరారు.

సామాన్యులపై మోయలేని భారం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్ ధరలను పెంచి సామాన్యులపై మోయలేని భారం మోపుతున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటుతుంటే, దీనికితోడు కేంద్రం ఇలాంటి నిర్ణయం తీసుకుని సామాన్యులపై మరింత భారం మోపిందని పేర్కొన్నారు. తక్షణమే పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను ఉపసంహరించుకుని ప్రజలపై భారం పడకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. 2014లో నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చినప్పుడు 14 కిలోల సిలిండర్ ధర రూ.400 ఉంటే, ఇప్పుడు అది రూ.1,155కు చేరుకోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలు కట్టెలపొయ్యి వాడడం వల్ల తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారంటూ కేంద్రం ఉజ్వల పథకం ద్వారా పెద్దమొత్తంలో గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. ధర పెరిగితే సబ్సిడీని కూడా పెంచుతామంటూ చెప్పి, ఆ సబ్సిడీని నామమాత్రంచేసి మోసం చేసిందని విమర్శించారు. దీనికితోడు గ్యాస్ ధరలను కూడా విపరీతంగా పెంచుకుంటూ పోతోందని తెలిపారు. ఇది ప్రజా సంక్షేమాన్ని గాలికొదలడమేనని విమర్శించారు. కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు రాయితీలిచ్చి ప్రపంచస్థాయి సంపన్నులను చేస్తున్న మోడీ, సామాన్య ప్రజలపై ఇలాంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరైందికాదని తెలిపారు. పేదలను ఆదుకునే 'దేవుడు మోడీ'అంటూ పదేపదే ప్రచారం చేసుకుంటున్న బీజేపీ రాష్ట్ర నాయకులు పేదలపై పడుతున్న ఈ భారాలపై స్పందించి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పెరిగిన ధరలను వెనక్కి తీసుకునే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

రాకుల్‌లో ఎగిరిన ఎర్రజెండా

(మొదటిపేజీ తరువాయి)

విజయం సాధించింది. కార్మికులు పెద్దఎత్తున సంబురాలు చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు, రాకుల్ పరిశ్రమ యూనియన్ అధ్యక్షుడు బీరం మల్లేశం మాట్లాడుతూ.. ఈ గెలుపు కార్మికుల ఐక్యతకు నిదర్శనమని, కార్మికుల ఐక్యతకు అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు. కార్మికుల ఐక్యతతో యాజమాన్యాల మెడలు వంచవచ్చని, అనేక సౌకర్యాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. కార్మికులకు ఇచ్చిన అన్ని హామీలనూ సాధించుకునేందుకు సీఐటీయూ పోరాడుతుందన్నారు. కార్మికుల ఉద్యోగ భద్రత, అన్ని రకాల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్ చందర్, ఎస్.మైపాల్, శివరామారావు, నర్సింహారెడ్డి, మహీంద్రా అండ్ మహీంద్రా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)



భారీగా మంటలు చెలరేగాయి. మరిన్ని బోగీలు పట్టాలు తప్పి పక్కకు పడిపోయాయి. ఈ ప్రమాద తీవ్రతకు ధ్వంసమైన ముందు బోగీల్లో 32 మంది సజీవదహనంకాగా, మరి కొంతమందిని సిబ్బంది కాపాడి ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. సమాచారమందుకున్న భద్రతా సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో ప్యాసింజర్ రైలులో దాదాపు 350 మంది ప్రయాణికులున్నారు. వీరిలో 200 మందిని సహాయక సిబ్బంది సురక్షితంగా కాపాడారు. చీకటిగా ఉండటం, మంటలు పెద్దఎత్తున చెలరేగడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

కొత్తగూడెం పోస్టుమెట్రిక్ హాస్టల్ సెల్‌ఫోన్ల చోరీ

పోలీసుల అదుపులో గాంధీనగర్ విద్యార్థులు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలోని గాంధీనగర్ గురుకులానికి చెందిన ముగ్గురు విద్యార్థులను సెల్ ఫోన్ల చోరీ కేసు విషయమై కొత్తగూడెం పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం వెలికి వచ్చింది. దీనికి సంబంధించి విశ్వసనీయ సమాచారం ప్రకారం.. గాంధీనగర్ గురుకులం ఇంటర్ విద్యార్థులు ముగ్గురు ఈనెల 25వ తేదిన రాత్రి గురుకులంలో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కొత్తగూడెం వెళ్ళారు. ముగ్గురు విద్యార్థులలో ఒకరి చెందిన సోదరుడు కొత్తగూడెంలోని పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో ఉంటున్నాడు. కొత్తగూడెం పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు వెళ్ళిన గాంధీనగర్ గురుకుల విద్యార్థులు ముగ్గురు అక్కడే ఆదివారం అంతా ఉన్నారు. సోమవారం తిరిగి గాంధీనగర్ గురుకులం చేరుకున్నారు. ఈక్రమంలో కొత్తగూడెం పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు చెందిన కొందరి విద్యార్థుల సెల్ ఫోన్లు మాయం అయ్యాయి. దీనికి సంబంధించి బాధితులు కొత్తగూడెం పోలీసులకు పిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులకు గాంధీనగర్ గురుకుల విద్యార్థులు పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు వచ్చిన విషయం తెలిసింది. విచారణలో భాగంగా గాంధీనగర్ వచ్చిన పోలీసులు ముగ్గురు విద్యార్థులను విచారణ చేయగా వారి వద్ద నుండి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వారిని మరింత విచారించటానికి వారిని పోలీసులు కొత్తగూడెం తీసుకవెళ్ళారు. గురుకులంలో విద్యార్థులు బయటకు వెళ్ళటం...చోరీ కేసులో పోలీసులు అదుపులో ఉండటంపై తల్లిదండ్రుల్లో భయాందోళనలు చెందుతున్నారు. విద్యార్థులు బయటకు ఎలా వెళ్ళారని, గురుకులంలో భద్రతపై ఆందోళన వ్యక్తం అవుతుంది.

ఆన్లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ- ముదిగొండ



ఆన్లైన్ మోసాలతో ప్రజలు, ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీజీవిబి మేనేజర్ రాచకొండ రవిచంద్ర అన్నారు. ముదిగొండ గ్రామీణ వికాస్ బ్యాంకు ఎదుట ఖాతాదారులు, ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత (మ్యాజిక్ షో) ద్వారా అవగాహనా సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్లైన్ మోసాలతో ప్రజలు అధికంగా మోసపోతున్నారన్నారు. ఆన్లైన్ మోసాలకు తావివ్వకుండా ప్రజలు బ్యాంకు అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్స్ ఎల్ గంగశేఖర్, ఎం.ప్రవీణ్ బాబు, డ్వాక్రా మహిళలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు సభ

నవతెలంగాణ - ఎర్రుపాలెం

విద్యార్థి దశ ఎంతో కీలక మైనదని, విద్యలో విద్యార్థులు రాణించాలని ఆట పాటలను సద్వినియోగ పరుచుకోవాలని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం గురుకుల పాఠశాలలో బుధవారం ఇంటర్ 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించబడిన వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, పంచాయతీ సర్పంచ్ మొగిలి అప్పారావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

బాయిలర్ ఫౌండ్రి ఫామ్ సమస్యలపై వినతి

నవతెలంగాణ-ముదిగొండ

బాయిలర్ ఫౌండ్రి ఫామ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఖమ్మంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్‌కు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మీగడ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం వినతపత్రం అందజేశారు. బాయిలర్ కోళ్ల ఫామ్ నష్టాల్లో ఉందని ఆదుకోవాలని జాయింట్ కలెక్టర్‌ను వారు కోరారు.ఈ కార్యక్రమంలో బాయిలర్ కోళ్ల ఫారం జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొమ్ము నాగిరెడ్డి, కార్యదర్శి బట్టు నాగరాజు, నాయకులు ఎస్కె జానీ, ఎం.శంకర్, అప్పన్న రమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాయిలర్ ఫామ్ జిల్లా అసోసియన్ అధ్యక్షులుగా మీగడ శ్రీనివాస్

బాయిలర్ కోళ్ల ఫామ్ జిల్లా అసోసియేషన్ కమిటీని ముదిగొండలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మీగడ శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులుగా కొమ్ము నాగిరెడ్డి ప్రధాన కార్యదర్శిగా బట్టు నాగరాజుతోపాటు,కమిటీ సభ్యులుగా ఎస్కె జానీ,మొన్నేటి శంకర్,అప్పన్న రమేష్,నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్రం : ఎమ్మెల్యే

నవతెలంగాణ-వైరా



కేంద్ర ప్రభుత్వం నిత్యం ధరలు పెంచుతూ సామాన్యులపై పెను భారం మోపుతుందని వైరా శాసన సభ్యులు లావుడియా రాములు నాయక్ విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత గతం కంటే మూడు రెట్లు గ్యాస్ సిలిండర్ ధరను పెంచి సామాన్యులు మోయలేని భారం వేసిందన్నారు 2014 లో 14.2 కేజీల సిలిండర్ ధర 400 రూపాయలు ఉంటే నేడు అది 1150 రూపాయలు అయిందని, అలాగే డీజిల్,పెట్రోల్ ధరలకు హద్దూ పద్దూ లేకుండా పెంచారని అన్నారు. కేంద్రం పెంచిన ధరలను తగ్గించకుంటే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

నవతెలంగాణ-కామేపల్లి

కామేపల్లి గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నట్లు కామేపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అజ్మీర రాందాస్ నాయక్, పంచాయతీ కార్యదర్శి పెంట అనిల్ కుమార్ తెలిపారు. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా కామేపల్లి గ్రామపంచాయతీలోని పెద్ద లచ్చతండా గ్రామంలో గల సైడ్ డ్రైనేజీలో చెత్తను తొలగించడం జరిగిందన్నారు.

'ఎస్ఆర్అండ్‌బిజీఎన్ఆర్'లో మహిళావరణం

నవతెలంగాణ- ఖమ్మం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 3, 4 తేదీలలో ఖమ్మం ఎస్ఆర్అండ్‌బిజీఎన్ఆర్ కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో "మహిళావరణం" పేరిట వ్యాపారదక్షతను, శక్తియుక్తుల ఆలంబనగా వివిధ అంశాలపై ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనలో వస్త్రాలు, జనపనార ఉత్పత్తులు, హెర్బల్ ప్రొడక్ట్స్, పుస్తక, వివిధ రకాల ఆహార, పానీయాల స్టాల్స్, మెహందీ, బ్యూటీషియన్ సంబంధిత అంశాలు విద్యార్థినులు ప్రదర్శిస్తారని తెలిపారు. నగరంలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలను, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులను ఆహ్వానించామని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం సమన్వయకర్త డాక్టర్ .జె.అనురాధను సంప్రదించాలని పేర్కొన్నారు.

ర్యాగింగ్ పేరుతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

నవతెలంగాణ-కల్లూరు

తెలిసి తెలియని వయసులో తోటి విద్యార్థుల్ని ర్యాగింగ్ చేసి ఆనందపడితే తమ జీవితాలే నాశనం అవుతాయని విద్యార్థులు తెలుసుకొని క్రమశిక్షణతో నడవాలని ఎస్ఐ పి.రఘు కోరారు. బుధవారం స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ లక్కినేని ప్రసాద్, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని పెద్ద కోరుకొండి గ్రామంలో సర్పంచ్ మేము రత్తమ్మ అధ్యక్షతన రోడ్డు భద్రత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిఐ హనుక్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.రఘు, గ్రామ ప్రజలు సిబ్బంది పాల్గొన్నారు

పెయింటింగ్ వర్కర్స్‌యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా నక్కా సురేష్, ఉపాధ్యక్షులుగా పాషా, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె.అబ్దుల్, సహాయ కార్యదర్శిగా రవి, కోశాధికారిగా పానుగంటి సత్యం, గౌరవ అధ్యక్షులుగా కుమార్, కరీం, ఆదెర్ల రామారావులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు నక్క సురేష్ మాట్లాడుతూ భవన నిర్మాణకార్మికులుకు సొంత ఇండ్లు లేక కిరాయి ఇండ్లలోనే ఉంటున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని, 50 ఏండ్లకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.

విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు : కలెక్టర్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విపి.గౌతమ్ అన్నారు. ఐడిఓసిలోని సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తొలిమెట్టు నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రధానోపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధతో కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమంలో సూచించిన స్వల్పకాలిక లక్ష్యాలను ప్రతి ఒక్క విద్యార్థి సాధించేలా కార్యాచరణ చేయాలన్నారు. ఫిబ్రవరి మాసాంతానికి ఏర్పరచిన లక్ష్యం ప్రతి ఒక్క విద్యార్థి అందుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అదనపు తరగతులు నిర్వహించి, విద్యా ప్రమాణాలు పెంపొందించాలని తెలిపారు. తరగతి గదిలో సంభాషణ ఇంగ్లీషులోనే చేయాలని, తద్వారా పిల్లలకు ఇంగ్లీష్‌లో మాట్లాడడం సులువుగా వస్తుందని అన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమం క్రింద పూర్తయిన పనులకు నిధులు విడుదల అయ్యాయని, పాఠశాల నిర్వహణ కమిటీలకు వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలుపారు. పనులు పూర్తయిన పాఠశాలల్లో పెయింటింగ్ పనులు చేపట్టి, పూర్తి చేయాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు మన ఊరు-మన బడి బాధ్యతలు తీసుకోవాలని అన్నారు. అన్ని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందించాలని తెలిపారు. పదో తరగతి గత సంవత్సర ఫలితాలు, ఈ సంవత్సరం ప్రి ఫైనల్ ఫలితాలపై పాఠశాలల వారీగా కలెక్టర్ సమీక్షించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణ చేయాలన్నారు. ఫలితాల్లో వెనుకబడిన పాఠశాలలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, సందర్శనలు చేసి పర్యవేక్షణ చేయాలని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకొని, ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అభ్యాస దీపికల పంపిణీ వంద శాతం చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలన్నారు. క్రీడా గ్రాంట్ పాఠశాలలకు మంజూరు అయినట్లు, క్రీడలకు సంబంధించి ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల ఆసక్తిని బట్టి క్రీడాపరికరాల కొనుగోలు చేయాలన్నారు. క్రీడా గ్రాంటును ఇతర అవసరాలకు వాడొద్దని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో యాన్యువల్ డే, హాస్టళ్లలో హాస్టల్ డే నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యతో పాటు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి అదనపు పాఠ్య ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ఇఇ నాగ శేషు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గంధం టవర్స్ అక్రమ నిర్మాణంపై చర్యలకు ఆలస్యమెందుకు?

గంధం టవర్స్ నివాసుల కమిటీ

నవతెలంగాణ-వైరా

వైరా ఏసిపి కార్యాలయం ఎదురుగా తల్లాడ రోడ్డులో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన గంధం టవర్స్‌పై చర్యలు ఎందుకు తీసుకోవటం లేదని, ఆ టవర్స్‌లో నివాసం ఉంటున్న వారు మునిసిపల్ కమిషనర్‌ను లేఖలో ప్రశ్నించారు. 14బి 9బి 22,10బి 11బి 22, 02 - 01- 2023 న ఈ విషయమై దరఖాస్తు చేసుకున్నామని, మీరు టవర్స్ ను పరిశీలించి కూడా మూడు, నాలుగు నెలలుగా చర్యలు తీసుకోకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ విషయమై 27-02- 23 న జిల్లా కలెక్టర్ కు కూడా పిర్యాదు చేసినట్లు కూడా పేర్కొన్నారు . టవర్స్ లో నివాసం ఉంటున్న 25 కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపినా మా సమస్య పట్ల నిర్లక్షం వహించటం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము వాడుకుంటున్న నీరు అక్కడే ఆగి దుర్గంధం వెదజల్లుతున్నదని, వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని, కనుక టవర్స్ యజమాని పై వెంటనే తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

నవతెలంగాణ-వైరా

మండలంలోని గన్నవరం గ్రామంలో పేకాట శిభిరంపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి చేశారు. 9 మంది పేకాట రాయుళ్ళను అదుపులోకి తీసుకుని వారి నుండి 8 సెల్ ఫోన్లు, 43 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.

మళ్లీ కళకళలాడుతున్న పాత బస్టాండ్

పాత బస్టాండ్ నుంచి పల్లెవెలుగు బస్సుల రాకపోకలు ప్రారంభం

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం నగరంలోని ఎన్నో సంవత్సరాలుగా నడిబొడ్డున ఉంటున్న పాత బస్టాండ్ ఒక్కసారిగా మూతపడడం వల్ల ప్రజలు, వ్యాపారస్తులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై సీపీఐ(ఎం) అనేక రూపాల్లో పోరాటం చేసింది. ఎట్టకేలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్పందించి మళ్లీ పాత బస్టాండ్ నుంచి బుధవారం నుంచి పల్లె వెలుగులు బస్సులు నడిచేలా చొరవ తీసుకున్నారు. కొత్త బస్టాండ్ నుండి హైటెక్ బస్సులు, ఎక్స్ ప్రెస్ బస్సులు, లగ్జరీ బస్సు సర్వీస్‌లు మాత్రమే ఉంటాయని బస్‌డిపో మేనేజర్ తెలిపారు. అదే విధంగా భక్త రామదాసు కళాక్షేత్రం పక్కన ఉన్న రైతు బజార్‌ను తిరిగి ఓపెన్ చేయాలని పలువురు స్థానికులు పువ్వాడకు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పాఠశాల విద్యారులకు స్టడీ మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు సహకారంతో కస్తూరి ఫౌండేషన్ వారు స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను సమకూర్చి వారికి సహకరించాలని కస్తూరీ ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్‌ను ఎస్సై రామారావు కోరటంతో ఫౌండేషన్ వారు అంగీకరించి మెటీరియల్‌ను పంపారు. వాటిని మాణిక్యారం, కోమట్లగూడెం, విశ్వనాథపల్లి, పేరుపల్లి, గేటుకారేపల్లి హైస్కూల్‌లోని పదోతరగతి విద్యార్థులు 70 మందికి ఎస్సై పుష్పాల రామారావు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రావురి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు హలావత్ ఇందిరాజ్యోతి, భూక్యా రంగారావు, అజ్మీర నాగేశ్వరరావు, భూక్యా కల్పన, బిజ్జ రాము, ఎంపీటీసీ శివరాత్రి పార్వతి అచ్చయ్య, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రివేణిలో హైస్కూల్ ఫన్ ఫెస్ట్ సంబరం

నవతెలంగాణ-ఖమ్మం



త్రివేణి పాఠశాలలో ఫన్ ఫెస్ట్ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం నగర అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏ.సుభాష్ చంద్రబోస్, గౌరవ అతిథులుగా ఖమ్మం టూ టౌన్ సిఐ సిహెచ్ శ్రీధర్, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, కృష్ణవేణి త్రివేణి సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, త్రివేణి పాఠశాల సిఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాల బోధన, బోధనేతర, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ- ఖమ్మం

ప్రముఖ బహుళ జాతి కంపెనీ ఎయస్‌సి ఇంటర్నేషనల్ బెంగుళూరు క్యాంపస్ డ్రైవ్‌కు15 మంది ఎస్‌బిఐటి విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. బిటెక్ సివిల్, ఈఈఈ, మెకానికల్ విభాగాలకు చెందిన విద్యార్థుల కోసం కంపెనీ కళాశాలలో డ్రైవ్ నిర్వహించి వివిధ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ డ్రైవ్‌కు 112 మంది విద్యార్థులు హాజరుకాగా సివిల్ నుండి 9మంది, ఈఈఈ నుండి ముగ్గురు, మెకానికల్ నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి వార్షిక వేతనంగా 5 లక్షల రూపాయలు లభిస్తాయని తెలిపారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రీ మాట్లాడుతూ విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా సరైన ఉద్యోగాలు పొందేందుకు యాజమాన్యం శాయశక్తులా కృషి చేస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించారు. అనంతరం కంపెనీ సీనియర్ హెచ్.ఆర్, మహ్మద్ హరున్‌ను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాస రావు, ఎకడమిక్ డైరెక్టర్స్ ఎ.వి.వి. శివ ప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్,.జి.సుభాష్ చందర్, జె.రవీంద్ర బాబు,హెచ్‌ఒడిలు పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్‌లో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-కొణిజర్ల

వైరా రిజర్వాయర్ లో చేపల కాపలాకు వెళ్లి వ్యక్తి మృతి చెందాడు...పోలీసులు స్థానికులు మండలంలోని సిద్దిక్ నగర్ గ్రామానికి గ్రామానికి చెందిన సురభి సాయిలు (46) మంగళవారం రాత్రి వైరా రిజర్వాయర్‌ఖి కాపలాకు వెళ్లి చెరువులో పడి మృతి చెందాడు. ఎంతవరకు బుధవారం ఉదయం ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు తోటి మత్స్యకారులు చెరువు దెగ్గరికి వెళ్లి చూడగా నీళ్లలో తెలుతూ విగతజీవిగా పడిండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ శంకర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిట్టల కృష్ణ, టీవీ9 సతీష్ కుటుంబాన్ని పరామర్శించిన మీడియం, అన్నవరపు

నవతెలంగాణ-మణుగూరు



ఇటీవల మరణించిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పిట్టల కృష్ణ కుటుంబాన్ని, టీవీ9 జర్నలిస్టు సతీష్ కుటంబాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భద్రాచలం మాజీ ఎంపీ మీడియా బాబురావు, సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పరామర్శించారు. కృష్ణ భార్య పిట్టల నాగమణి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు సిపిఎం మండల కమిటీలలో పనిచేస్తున్నారు. అతని కుమారుడు సాంబశివరావు స్వరూపలను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు టీవీ9 రిపోర్టర్ సతీష్ మాతమూర్తి ఇటీవల మరణించారు. కుటుంబం సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోడిశాల రాములు, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సంకినేని వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా సకల జనులకు సమన్యాయం

రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

నవ తెలంగాణ-బూర్గంపాడు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా సకల జనులకు సమన్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం మండలంలోని సోంపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ రచనలతోనే దేశంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ఆడబిడ్డలకు అండగా సీఎం కేసీఆర్ ఉన్నారని, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతా రావు అన్నారు. ఇరవెండి గ్రామంలో బుధవారం 70 మంది కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు, 70 లక్షల రూపాయల విలువగల చెక్కులను ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా డిసిసిబి చైర్మన్ కురాకుల నాగభూషణం ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటిసి కామిరెడ్డి శ్రీలత, ఏఎంసీ చైర్ పర్సన్ పోడియం ముత్యాలమ్మ, బూర్గంపాడు తహసీల్దార్ బి.భగవాన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ బిక్క సాని శ్రీనివాసరావు, ఇరవెండి సర్పంచ్ లక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే సహించం

నవతెలంగాణ-సత్తుపల్లి





అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే సహించేది లేదని, అంగన్వాడీల ఓపికను అలుసుగా తీసుకుంటే ప్రభుత్వాల పతనమవడం ఖాయమని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు కొలికపోగు సర్వేశ్వరరావు హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం మూడు రోజుల పాటు సమ్మెకు పిలుపునిచ్చిన అంగన్వాడీ ఉద్యోగులు బుధవారం సత్తుపల్లిలోని అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు వేసి సమ్మెలోకి దిగారు. అనంతరం పట్టణంలో ప్రదర్శన, సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు వి.సుశీల, కార్యదర్శి పి.ఉదయశ్రీ, జీవమ్మ, లలిత, నాగేంద్ర, ఎలిజబెత్, లక్ష్మీ, శాంతమణి, షకీనా, రామేశ్వరీ, పుష్ప, మహాలక్ష్మీ, భూశమ్మ, సుజనా, నాగమణి, విజయలక్ష్మీ, రాజ్యలక్ష్మీ, శైలజ, శారద, సల్మా ఉషా, సత్తుపల్లి, వేంసూరు మండలాల నుంచి 300 మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మధిర: మధిర పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో రాష్ట్ర సిఐటియు పిలుపులో భాగంగా మధిర ప్రాజెక్టు సీఐటీయూ ఆధ్వర్యంలో వైరా, బోనకల్, ఎర్రుపాలెం, మధిర అంగన్వాడి టీచర్లు, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా, ర్యాలీ మరియు మానవహారం చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి పి విజయలక్ష్మి, పి.రమ్య, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, సిఐటియు నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు మండవ ఫణీంద్ర కుమారి, మందా సైదులు, పడకండి మురళి, సద్గుర్తి సంజీవరావు, వడ్రానపు మధు, తేలప్రోలు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి దేవాలయానికి రూ.10లక్షల విరాళం

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఏ కందాళ దంపతులు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం





తిరుమలాయపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలేరు శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి ఆయన సతీమణి విజయమ్మ హాజరయ్యారు. ఆలయంలో దేవత మూర్తుల దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజల కోరిక మేరకు 10 లక్షల రూపాయలను దేవాలయానికి విరాళంగా ఆలయ నిర్మాణ కమిటీ వారికి అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు కొండబాల కరుణాకర్, మండల రైతు బంధు సమన్వయ సమితి కన్వీనర్ చావా శివరామకృష్ణ, ప్రముఖ న్యాయవాదులు బ్రహ్మయ్య చౌదరి, కొండపాక కళాధర్, ఎంపీపీ బోడ మంగీలాల్ నాయక్, గ్రామ సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్లు, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు భాష బోయిన వీరన్న, సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు బొడ్డుపల్లి ప్రసాద్, ఎంపీటీసీ గొల్ల రేణుక లింగయ్య, మద్దినేని మధు, కేతినేని కిరణ్, తాటికొండ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రికి సత్వరమే పర్యావరణ అనుమతులు ఇవ్వాలి

రూ.20వేల కోట్లకు పైగా ఖర్చుతో 64.20 శాతం పనులు పూర్తి

శరవేగంగా మిగతా పనులు : ఎంపీ నామ

నవతెలంగాణ-ఖమ్మంప్రాంతీయప్రతినిధి



తెలంగాణలోని నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో యుద్ధ ప్రాతిపదికన శరవేగంగా నిర్మితమవుతున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పనులు 64.20 శాతం పూర్తయిన నేపథ్యంలో వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు దివికొండ దామోదరావు, బడుగుల లింగయ్య యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం న్యూఢిల్లీలో నామ నాయకత్వంలో ఎంపీల బృందం కేంద్ర పర్యావరణ శాఖ అదనపు కార్యదర్శి తన్మయ్ కుమార్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి, ప్రత్యేకించి ఒక లేఖ అందజేశారు. రూ. 29,965.48 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఇప్పటికే 20వేల కోట్లకు పైగా ఖర్చు చేసి, 64.20 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగతా పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎంపీలు కేంద్రం దృష్టికి తీసికెళ్ళారు. మిగతా యూనిట్లకు సంబంధించిన అన్ని రకాల పనులు త్వరితగతిన జరుగుతున్నాయని అన్నారు.

పేదల 'రక్తం' పీల్చుతున్న కేంద్రం

- 3న నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనలు
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నవతెలంగాణ- సత్తుపల్లి



పేదల రక్తమాంసాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీల్చుకు తింటోందని, మోడీ పాలన అంతం కాకుంటే ఇక దేశంలో పేదల జీవనం కడు దుర్భరంగా మారే ప్రమాదం పొంచి ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడం సండ్ర మండిపడ్డారు. మోడీ పాలన వచ్చిన దగ్గర నుంచి ఇప్పటి లెక్కలేనన్ని సార్లు గ్యాస్ ధరను పెంచిందని విమర్శించారు. పేద కుటుంబాలను గ్యాస్‌కు దూరం చేయాలనే కుట్రకు మోడీ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లో సుమారుగా రూ. 500కు పైగా ఉన్న ధర పెంచిన ధరతో రూ. 1150 చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన వంటగ్యాస్ ధరను తగ్గించాలని సండ్ర డిమాండ్ చేశారు.

3న నియోజకవర్గ వ్యాప్తంగా గ్యాస్ ధర పెంపుపై నిరసనలు...

సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 3వ తేదీన సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో గ్యాస్ ధర పెంపుపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సండ్ర తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడంతో కళ్లు మూసుకొని పాలన సాగిస్తున్న మోడీ కళ్లు తెరుచుకొనేలా నిరసన కార్యక్రమాలు ఆకాశాన్నంటాలని సండ్ర పిలుపునిచ్చారు. ఏ మండలానికి ఆ మండల నాయకులు కార్యక్రమాలు విజయవంతం అయ్యే విశేష కృషి జరపాలని పార్టీ శ్రేణులను సండ్ర ఆదేశించారు.



ర్యాలీగా వెళుతున్న గిరిజన నాయకులు


సభకు హాజరైన జనం..


అభివాదం చేస్తున్న నేతలు...


మాట్లాడుతున్న మల్లు లక్ష్మీ

గిరిజనుల ద్రోహి మోడీ

(మొదటిపేజీ తరువాయి)

రేషన్ షాపులు ఎత్తేసే ఆలోచనలో ఉన్నారని విమర్శించారు. డిజిటల్ ఇండియాలో కోవిడ్ సమయంలో గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులు ఇంటర్నెట్, ఆన్‌లైన్ సౌకర్యాలు లేక చదువుకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో గిరిజన యూనివర్సిటీలకు కోటి రూపాయలు మాత్రమే బడ్జెట్లో నిధులు కేటాయించారని, దీనిబట్టి చూస్తే గిరిజనుల పట్ల మోడీకి ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు. అటవీ హక్కు చట్టానికి తూట్లు పొడిచి అడవుల నుంచి గిరిజనులను తరిమికొట్టేందుకు యత్నిస్తున్నారన్నారు.

బీజేపీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని స్వాగతిస్తున్నామని, మోడీ చేసే విధానాలే కేసీఆర్ అమలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. పోడు భూములకు



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

పట్టాలిస్తామని కేసీఆర్ ఇటీవల హామీ ఇచ్చారని, ఆ హామీ నిలబెట్టుకోవాలని కోరారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే సమరశీల పోరాటాలు చేస్తామన్నారు. మోడీ పతనానికి మిర్యాలగూడ వేదిక నుంచే శ్రీకారం చుడతామన్నారు. గిరిజన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డికి గిరిజన ప్రజలు అండగా నిలవాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల కురుక్షేత్రంలో రంగారెడ్డికి గిరిజనులు మద్దతు ఇచ్చి తమ సత్తా చాటాలన్నారు

ప్రజల సొమ్ము లూటీ
సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు సీతారాములు

కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు అమ్ముతూ ప్రజల సొమ్మును లూటీ చేస్తోందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. మోడీ -అదానీల బంధం దేశానికి ప్రమాదకరంగా మారిందని చెప్పారు. దేశ సంపదను బడాబాబులకు దోచిపెడుతున్న మోడీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. షేర్ మార్కెట్ అతలాకుతలం కావడానికి అదానీ కుంభకోణమే కారణమని చెప్పారు.

దేశంలో మతోన్మాద, కార్పొరేట్ శక్తులు ఏకమై దోచుకుతింటున్నాయన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టం, ఆహార భద్రత, అటవీ హక్కుల చట్టం, ధరల నియంత్రణ చట్టం కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. నిజాయితీ ఉంటే అదానీపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న శ్రీరాం నాయక్

కార్పొరేట్ శక్తులకు ఏజెంట్‌గా కేంద్రం: జూలకంటి

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఏజెంట్‌గా పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాల వల్ల నిత్యావసర ధరలు పెరిగాయన్నారు. గిరిజన చట్టాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వకుండా ఊరికో కోడి ఇంటికో ఈక లాగా వ్యవహరిస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, సాగు తాగునీరు అందివ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం ప్రతినిధుల సభను తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్ నివేదిక


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

చదివి ప్రారంభించారు. ఈ మహాసభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మనాయక్, రమావత్ రవి నాయక్, మూడావత్ రవినాయక్, కొర్ర శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధర్మానాయక్

నవచిత్రం


కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్


ఎన్టీఆర్, రామ్‌చరణ్

ఆస్కార్ వేదికపై
నాటు.. సాంగ్ లైవ్

ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవ సమయం దగ్గర పడుతున్న తరుణంలో అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే హాట్ టాపిక్‌గా మారిన 'ఆర్ఆర్ఆర్' మరో అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. ఈ చిత్రంలోని 'నాటు..నాటు' పాటని 95వ ఆస్కార్ అవార్డుల వేదికపై లైవ్‌లో చూడబోతున్నారంటూ ఆస్కార్ అవార్డ్‌ల కమిటీ బృందం బుధవారం అధికారికంగా ప్రకటించింది.
దీంతో ఈ సినిమా కోసం 'నాటు..నాటు..' పాటను పాడిన కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ గాయక ద్వయం ఆస్కార్ వేదికగాపై తమ గాత్ర సత్తాని మరోసారి చాటబోతున్నారు. తమకి ఈ అవకాశం లభించడాన్ని ఇరువురు ఎంతో బాధ్యతగా భావిస్తున్నామని, తెలుగు సినిమా రంగం గర్వపడాల్సిన తరుణమిదంటూ.. సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో మార్చి 12న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరుగనుంది. 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు..నాటు' పాట ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులను కైవసం చేసుకుని ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డుల బరిలోనూ గట్టి పోటీనిస్తోంది.

సరికొత్త సైంటిఫిక్ మిస్టరీ థ్రిల్లర్


సహర్ అఫ్సహ, జెడి ఆకాష్

హెచ్ ఎమ్ మూవీ మేకర్స్ పతాకం పై రవి శంకర్, జెడి ఆకాష్, సయెద్ ఇర్ఫాన్, సుమితా బజాజ్, సహర్ అఫ్సహ, వీరు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కరాళ'. హెచ్ ఎమ్ శ్రీనందన్ దర్శకత్వంలో బోదాసు నర్సింహ నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రం కన్నడంలో 'బీగా' పేరుతో విడుదల కానుంది. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను పాత్రికేయుల సమావేశంలో మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బోదాసు నర్సింహ మాట్లాడుతూ, 'దర్శకుడు చెప్పిన కథ ఈ సినిమా నిర్మించా. మా చిత్రం చాలా గొప్పగా వచ్చింది. తెలుగు, కన్నడ భాషల్లో విడుదల చేస్తున్నాం. ఈ సినిమా అందరికీ కచ్చితంగా నచ్చుతుంది' అని తెలిపారు. 'సినిమా చూశాను. చాలా కొత్తగా, మంచి సస్పెన్స్‌తో ఉంటుంది' అని సహ నిర్మాత పిట్ల భాస్కర్ అన్నారు. దర్శకుడు శ్రీనందన్ మాట్లాడుతూ, 'ఇదొక సైంటిఫిక్ మిస్టరీ చిత్రం. చాలా ఆసక్తికరంగా మంచి ట్విస్ట్‌లతో, మంచి సంగీతంతో, మంచి యాక్షన్ సన్నివేశాలతో సరికొత్తగా ఉంటుంది. కన్నడలో 'బీగా' పేరుతో ఈనెల 3న విడుదల చేస్తున్నాం. తెలుగులో త్వరలోనే విడుదల చేస్తున్నాం' అని అన్నారు.

మిస్ శెట్టి.. మిస్టర్ పోలిశెట్టి


అనుష్క, నవీన్ పోలిశెట్టి

భిన్న చిత్రాలకు, వైవిధ్యమైన కాంబినేషన్లకు కేరాఫ్‌గా నిలిచిన యువీ క్రియేషన్స్ సంస్థ ఇటీవలో అనుష్క, నవీన్ పోలిశెట్టి కలయికలో ఓ సినిమా చేస్తున్నట్టు ప్రకటించి, అందర్నీ సర్‌ప్రైజ్ చేసింది. ఈ ప్రకటన తర్వాత పరిశ్రమతో పాటు ప్రేక్షకుల్లో కూడా ఈ ప్రాజెక్ట్‌పై ఓ రకమైన ఆసక్తి ఏర్పడింది. ఆ ఆసక్తిని రెట్టింపు చేసేలా ఈ చిత్ర ఫస్ట్ లుక్ టైటిల్‌ను మేకర్స్ ఎనౌన్స్ చేశారు. అనుష్క, నవీన్ పేర్లు కలిసి వచ్చేలా.. చూడగానే ఆకట్టుకునేలా ఈ చిత్రానికి 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ టైటిల్‌కు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. చాలా క్యాచీగా ఉండటంతో పాటు కథకు ఈ టైటిల్ సరిగ్గా సరిపోయేలా నప్పిందని చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమాలో సిద్ధుపోలిశెట్టి అనే స్టాండప్ కమెడియన్‌గా నవీన్, అన్విత రవళిశెట్టి అనే చెఫ్ పాత్రలో అనుష్క నటించారు. పి.మహేష్ బాబు దర్శకత్వం వహించిన ఈ వైవిధ్యభరిత చిత్రాన్ని వేసవికి తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ విడుదలకు చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

ఆటలు

టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకుని తొలి రెండు టెస్టుల్లో ఆస్ట్రేలియా కకావికలం కాగా.. మూడో టెస్టులో అది టీమ్ ఇండియా వంతైంది!. హోల్కర్ పిచ్‌పై తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ స్పిన్‌కు విలవిల్లాడింది. లయాన్, మర్ఫీ, కునేమాన్ ముప్పేట మాయజాలంతో 109 పరుగులకే కుప్పకూలింది. విరాట్ కోహ్లి (22), శుభ్‌మన్ గిల్ (21) 20 ప్లస్ పరుగులే అత్యధికం కావటం గమనార్హం. బదులుగా, ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో దీటుగా సాగుతోంది. 156/4తో తొలి ఇన్నింగ్స్‌లో 47 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

స్పిన్‌కు పడిపోయారు

- తొలి రోజు కదం తొక్కిన కంగారూలు
- 109 పరుగులకే కుప్పకూలిన భారత్
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 156/4

భారత్, ఆసీస్ మూడో టెస్టు తొలి రోజు



నవతెలంగాణ-ఇండోర్

స్పిన్ ట్రాక్ వ్యూహం అడ్డం తిరిగింది. టీమ్ ఇండియా రచించిన స్పిన్ వ్యూహంలో తనే చిక్కుకుంది. ఇండోర్ టెస్టులో 33.2 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలిన భారత్.. తొలి రోజు ఆస్ట్రేలియాకు ఆధిక్యం అప్పగించింది. యువ స్పిన్నర్ మాథ్యూ కునేమాన్ (5/16) ఐదు వికెట్ల ప్రదర్శనకు తోడు నాథన్ లయాన్ (3/35) మాయజాలంతో తోడవటంతో రోహిత్‌సేన కుదేలైంది. విరాట్ కోహ్లి (22, 52 బంతుల్లో 2 ఫోర్లు), శుభ్‌మన్ గిల్ (21, 18 బంతుల్లో 3 ఫోర్లు) మాత్రమే చెప్పుకోదగిన ప్రదర్శన చేశారు. లోయర్ ఆర్డర్‌లో కె.ఎస్ భరత్ (17, 30 బంతుల్లో 1 ఫోర్), ఉమేశ్ యాదవ్ (17, 13 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (12 నాటౌట్, 33 బంతుల్లో 1 ఫోర్) భారత్‌ను వంద పరుగులు దాటించారు. ఓపెనర్ ఉస్మాన్ ఖవాజ (60, 147 బంతుల్లో 4 ఫోర్లు) అర్ధ సెంచరీతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 156/4 పరుగులతో కొనసాగుతుంది. మార్నస్ లబుషేన్ (31), స్టీవ్ స్మిత్ (26) సైతం రాణించారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 47 పరుగుల ముందంజలో నిలిచింది.



స్పిన్‌కు విలవిల

సిరీస్‌లో తొలిసారి తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా తొలి సెషన్లోనే చేతులెత్తేసింది. స్పిన్ స్వర్గధామ పిచ్‌పై భారత బ్యాటర్లు విఫలమయ్యారు. ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో మొదలైన పతనం.. ఎక్కడా ఆగలేదు. ఓపెనర్లు రోహిత్ శర్మ (12), శుభ్‌మన్ గిల్ (21) తొలి వికెట్‌కు 27 పరుగులు జోడించారు. గిల్ ఓ ఎండ్‌లో ఎడాపెడా బౌండరీలు బాదాడు. దీంతో భారత్ ఇన్నింగ్స్ సాఫీగా సాగుతుందని అనిపించింది. కానీ రోహిత్ శర్మ వికెట్‌తో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కునేమాన్ ఓపెనర్లను ఇద్దరినీ సాగనంపగా.. నాథన్ లయాన్‌కు పుజార (1) చిక్కాడు. క్రీజులో కాస్త సౌకర్యవంతంగా కనిపించిన విరాట్ కోహ్లి (22)ని మరోసారి టాడ్ మర్ఫీ వెనక్కి పంపించాడు. జడేజా (4) డిఆర్ఎస్‌తో పెవిలియన్‌కు చేరగా.. శ్రేయస్ అయ్యర్ (0) డకౌట్‌గా నిష్క్రమించాడు. లంచ్ విరామ సమయానికే 84/7తో భారత్ ఆలౌట్‌కు చేరువైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే కథ ముగిసింది. చివర్లో కె.ఎస్ భరత్ (17), అక్షర్ పటేల్ (12 నాటౌట్), ఉమేశ్ యాదవ్ (17) వేగంగా ఆడటంతో భారత్ వంద పరుగుల మార్క్ చేరుకోగలిగింది. ఉమేశ్ యాదవ్ రెండు సిక్సర్లతో భారత్‌కు మూడెంకల స్కోరు అందించాడు.

ఆసీస్ దూకుడు

రెండో సెషన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియాకు సైతం ఆరంభంలోనే షాక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న ట్రావిశ్ హెడ్ (9)ను ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే అవుట్ చేసిన జడేజా.. కంగారూ శిబిరంలో గుబులు రేపాడు. కానీ మరో ఓపెనర్ ఉస్మాన్ ఖవాజ (60), మార్నస్ లబుషేన్ (31) ఆసీస్‌ను గట్టెక్కించారు. రెండో వికెట్‌కు విలువైన 96 పరుగులు జోడించిన ఖవాజ, లబుషేన్ భారత్‌ను నైరాశ్యంలోకి నెట్టారు. లబుషేన్ అవుటైనా.. స్టీవ్ స్మిత్ (26)తో కలిసి ఖవాజ జోరు కొనసాగించాడు. భారత బౌలర్లలో అశ్విన్, జడేజా వికెట్ల వేటలో చెమటోడ్చారు. అక్షర్ పటేల్, మహ్మద్ సిరాజ్, ఉమేశ్ యాదవ్‌లకు పెద్దగా పని లేకపోయింది. రవీంద్ర జడేజాకు నాలుగు వికెట్లు పడినా.. అప్పటికే ఆసీస్ ఆధిక్యంలోకి ప్రవేశించింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (7 నాటౌట్), కామెరూన్ గ్రీన్ (6 నాటౌట్) అజేయంగా ఆడుతున్నారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (స్టంప్డ్) అలెక్స్ (బి) కునేమాన్ 12, గిల్ (సి) స్మిత్ (బి) కునేమాన్ 21, పుజార (బి) లయాన్ 1, కోహ్లి (ఎల్బీ) మర్ఫీ 22, జడేజా (సి) కునేమాన్ (బి) లయాన్ 4, అయ్యర్ (బి) కునేమాన్ 0, భరత్ (ఎల్బీ) లయాన్ 17, అక్షర్ నాటౌట్ 12, అశ్విన్ (సి) అలెక్స్ (బి) కునేమాన్ 3, ఉమేశ్ (ఎల్బీ) కునేమాన్ 17, సిరాజ్ (రనౌట్) 0, ఎక్స్‌ట్రాలు : 0, మొత్తం : (33.2 ఓవర్లలో ఆలౌట్) 109.

వికెట్ల పతనం : 1-27, 2-34, 3-36, 4-44, 5-45, 6-70, 7-82, 8-88, 9-108, 10-109.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 5-0-21-0, కామెరూన్ గ్రీన్ 2-0-14-0, కునేమాన్ 9-2-16-5, నాథన్ లయాన్ 11.2-2-35-3, టాడ్ మర్ఫీ 6-1-23-1.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : ట్రావిశ్ హెడ్ (ఎల్బీ) జడేజా 9, ఉస్మాన్ ఖవాజ (సి) గిల్ (బి) జడేజా 60, లబుషేన్ (బి) జడేజా 31, స్మిత్ (సి)భరత్ (బి) జడేజా 26, హ్యాండ్స్‌కాంబ్ నాటౌట్ 7, కామెరూన్ గ్రీన్ నాటౌట్ 6, ఎక్స్‌ట్రాలు : 17, మొత్తం : (54 ఓవర్లలో 4 వికెట్లకు) 156.

వికెట్ల పతనం : 1-12, 2-108, 3-125, 4-146.

బౌలింగ్ : అశ్విన్ 16-2-40-0, జడేజా 24-6-63-4, అక్షర్ 9-0-29-0, ఉమేశ్ 2-0-4-0, సిరాజ్ 3-0-7-0.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886